
శుక్రవారం 25-1-2019


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 304

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

క్యారెట్ రూ.46,000 కన్నా అధికంగా ఇస్తున్నారంటే..

మీరు తెలిసే మోసపోతున్నట్టు!





భారతదేశంలోనే తక్కువ ధరకు వజ్రాభరణాలు!

క్యారెట్ రూ. 4600O నుంచి!

V.A. గ్రాముకు రూ.975 మాత్రమే

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్బాక్ సౌకర్యం. 100% Quality. E-F Colour Grade & VVS Clarity.

నాణ్యత తక్కువైన G-H కలర్‌గ్రేడ్ ఆభరణాలను మేం విక్రయించం.

బంగారు ఆభరణాలు తయారీ ధరకే..!

లక్షలాది డిజైన్లు! 100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్







వెండి వస్తువులు

కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.

మార్కెట్‌లో కంటే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!



నగలు కొనుగోలు పథకం

11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!

తొలి వాయిదా ఉచితం!

+

V.A. 50% ఉచితం!

ఈ సువర్ణ అవకాశం అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది!

రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 చిన్న వాయిదాలు, రెండింతల ప్రయోజనం!

One Time Payment !

నగల బుకింగ్ పథకం

ఏ నగకూ 100% V.A. లేదు

మొత్తం నగదును ఒకసారి చెల్లించి, తర్వాత.. V.A. లేకుండా నగలు కొనుగోలు చేసుకోండి.

5 నెలల నుంచే ఫలితం! 11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ.. 1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.

మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

Lalithaa®©

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133 / 91332 98333 / 91332 98444.

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్‌రోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677. www.lalithaajewellery.com

చెన్నై • తిరువళ్ళూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్


‘ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 11

సంచిక: 304

శుక్రవారం 25-1-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నిషేధం ఎత్తివేత

పాండ్యా, కేఎల్ రాహుల్‌లను ఆడేందుకు అనుమతినిచ్చిన బీసీసీఐ - స్పోర్ట్స్‌లో



నిశిరాతిరిలో నిశ్శబ్ద విజయం

విజయవంతంగా నింగిలోకి పీఎస్ఎల్వీ సీ44 రాకెట్ ప్రయోగం - 2లో

చందా కొచర్‌పై సీబీఐ కేసు



- వీడియోకాన్‌తో క్విడ్ ప్రో కో వ్యవహారం... రుణాలిచ్చి ముడుపులు తీసుకున్నారని ఆరోపణ
- ఎఫ్ఐఆర్‌లో భర్త దీపక్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ ధూత్
- వీడియోకాన్, న్యూపవర్ కార్యాలయాల్లో సోదాలు
- కామత్ సహా పలువురు బ్యాంకర్ల పాత్రపై విచారణకు అవకాశం

12 లో



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో నిర్వహిస్తున్న చండీయాగంలో భాగంగా గురువారం నాలుగో రోజు అమ్మవారికి హారతి ఇస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు - 2లో

రానున్నది ‘హంగ్’..!

- 99 స్థానాలు కోల్పోనున్న ఎన్డీయే
- యూపీఏకు పెరగనున్న సీట్లు
- కీలకంగా మారనున్న ‘ఇతరులు’
- మ్యాజిక్ ఫిగర్‌కు 35 సీట్ల దూరంలో ఎన్డీయే... ఇప్పటికిప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగితే ఫలితాలివే
- ఇండియా టుడే–కార్వీ సర్వేలో వెల్లడి

11 లో

ఎన్డీయేకు మైనస్.. యూపీయేకు ప్లస్

- రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు 16, ఎంఐఎంకు ఒక సీటు
- ఏపీలో వైఎస్సార్‌సీపీకి 19, టీడీపీకి 6 సీట్లు వచ్చే చాన్స్
- రిపబ్లిక్ టీవీ సర్వే ఫలితాలు

స్ట్రెచర్‌పై వైద్య విద్య

అధ్యాపకుల కొరత తీవ్రం ● రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 925 ఖాళీలు

- ప్రొఫెసర్ల కొరతతో నాణ్యత కొరవడిన మెడికల్ ఎడ్యుకేషన్
- దీంతో టాప్–100 వైద్య కళాశాలల్లో తెలంగాణకు దక్కని స్థానం
- ప్రొఫెసర్ల విరమణతో తగ్గుతున్న పీజీ మెడికల్ సీట్లు
- రిటైర్మెంట్‌ను 65 ఏళ్లకు పెంచాలన్న నిర్ణయం కాగితాలకే పరిమితం
- సీనియర్ ప్రొఫెసర్లను వదులుకుని.. కాంట్రాక్టు అధ్యాపకులతో క్లాసులు
- తెలంగాణ రిటైర్డ్ మెడికల్ ప్రొఫెసర్లకు మధ్యప్రదేశ్ భారీ ఆఫర్



సాక్షి, హైదరాబాద్: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులంతా.. సహజంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే ఎంబీబీఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా గాంధీ, ఉస్మానియా, కాకతీయ తదితర ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై ఎక్కువ శ్రద్ధ కనబరుస్తారు. వీటిలో చోటు దక్కకపోతేనే ప్రైవేటు కాలేజీలవైపు చూస్తారు. అంతటి ప్రతిష్టాత్మక సంస్థలవి. అలాగే పీజీ మెడికల్ విద్య విషయంలోనూ.. ప్రభుత్వ కాలేజీలకే మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో నాణ్యతపై ఉన్న సందేహాల కారణంగానే.. ప్రభుత్వ వైద్య విద్యే మెరుగన్న భావన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొంది. గాంధీ, ఉస్మానియా, కాకతీయ మెడికల్ కాలేజీల్లో మెడికల్ పట్టభద్రులంటే ఓ గౌరవముంటుంది.

అయితే ఇప్పుడు ప్రభుత్వ కాలేజీల్లో వైద్య విద్య నాణ్యత తగ్గిపోతోంది. దీనికి కారణం ఈ కాలేజీల్లో అధ్యాపకుల కొరత తీవ్రస్థాయిలో ఉండటమే. ఏడాదికేడాది ప్రొఫెసర్ల పదవీ విరమణ జరుగుతున్నప్పటికీ.. దానికి అనుగుణంగా ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిరాసక్తత చూపడంతో.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య నాణ్యతపై నీలి నీడలు అలముకున్నాయి. ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్న విమర్శలున్నాయి. దీంతోపాటు బోధనాసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యం చేసేందుకు వైద్యులు కరువయ్యారు.

925 ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ...

తెలంగాణలో ప్రస్తుతం ఏడు ప్రభుత్వ వైద్య కళాశాలలున్నాయి. హైదరాబాద్‌లో

మిగతా 2వ పేజీలో ▶

సెట్స్ తేదీల్లో మార్పులు

టీసీఎస్ సూచనతో ఎంట్రన్స్‌ల తేదీలు మార్చిన ఉన్నత విద్యామండలి

- లాసెట్ మే 26కు బదులు మే 20నే నిర్వహణ
- పీఈసెట్ మే 20కి బదులు మే 15 నుంచే..
- పీజీఈసెట్ మే 28 నుంచి 31 వరకు.. మే 31నే ఎడ్‌సెట్
- ఎంసెట్, ఈసెట్, ఐసెట్ తేదీలు మాత్రం యథాతథం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పలు ఉమ్మడి ప్రవేశ పరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి మార్చింది. లాసెట్, పీఈసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్ తేదీల్లో మార్పు చేసింది. ఎంసెట్, ఈసెట్, ఐసెట్‌లు మాత్రం గతంలో ప్రకటించిన తేదీల్లోనే జరుగుతాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. సెట్స్ నిర్వహణ సంస్థ అయిన టీసీఎస్ సూచన మేరకు ఈ మార్పులు చేసినట్లు చెప్పారు. లాసెట్, పీజీ లాసెట్ మే 26కి బదులు మే 20నే నిర్వహిస్తామని తెలిపారు. పీఈ సెట్‌ను మే 20 నుంచి నిర్వహించాల్సి ఉండగా దాన్ని మే 15 నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. పీజీ ఈసెట్‌ను

మిగతా 2వ పేజీలో ▶

అహ్మద్ వనీకి ‘అశోక చక్ర’

- వివరాలు 11లో

అమెరికా బ్యాంకులో కాల్పులు

ఐదుగురు మృతి.. నిందితుడి అరెస్టు



నిందితుడు జెఫెన్

■ అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం చెలరేగింది. ఫ్లోరిడా రాష్ట్రం సెబ్రింగ్ పట్టణంలోని ఓ బ్యాంకులో 21 ఏళ్ల దుండగుడు విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 11లో



‘సీబీఐ’ విచారణ నుంచి

తప్పుకున్న జస్టిస్ సిక్రీ

■ సీబీఐ డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించడాన్ని సవాల్ చేస్తూ వచ్చిన పిటిషన్ విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ తప్పుకున్నారు.

- వివరాలు 11లో



మళ్లీ బ్యాలెట్‌కు నో

■ దేశంలో ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలన్న కొన్ని రాజకీయ పక్షాల డిమాండ్‌కు తలొగ్గబోమని ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా స్పష్టం చేశారు. మళ్లీ బ్యాలెట్ బాక్సులను వినియోగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

- వివరాలు 11లో


సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో నిర్వహిస్తున్న చండీయాగంలో భాగంగా గురువారం నాలుగోరోజు పూజలో పాల్గొన్న సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి


పెద్దలకు తాంబూలం ఇస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు

యాగం.. వైభోగం

- నాలుగో రోజు 400 పారాయణలు, సప్తశతి పఠనం
- సీఎం దంపతుల ప్రత్యేక పూజలు
- నేడు పూర్ణాహుతితో యాగం ముగింపు
- హాజరుకానున్న విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర

సాక్షి, జగదేవ్‌పూర్ (గజ్వేల్): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ.. సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న మహా రుద్ర సహిత సహస్రచండీ మహాయాగం నాలుగో రోజు విజయవంతంగా పూర్తయింది. గురువారం ఉదయం యాగశాలకు సతీసమేతంగా వచ్చిన సీఎం కేసీఆర్.. మొదట రాజశ్యామల మాత మంటపంలో పూజలు నిర్వహించారు. శ్రీమహాకాళి, మహాలక్ష్మీ, మహా సరస్వతీ, స్వరూపిణిగా శ్రీ రాజశ్యామలాదేవికి పుష్పాంజలి ఘటించారు. సర్వమంగళ మాంగల్యే.. శ్రీ రాజశ్యామలా దైవేయ నమస్తే.. అంటూ రుత్వికులు ప్రార్థనలు చేశారు. రాజశ్యామల మంటపంలో సీఎం దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం చేశారు. శుక్రవారం పూర్ణాహుతితో ఈ యాగం పరిసమాప్తం కానుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ శారదా పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి ఎర్రవల్లికి చేరుకోనున్నారు.

మహారుద్ర మంటపంలో పూజలు

గురువారం నాడు మహారుద్ర మంటపంలో జరిగిన పూజల్లో సీఎం దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుత్వికులు మహారుద్ర సహిత ఏకాదశ రుద్ర పఠనం, నమకం, చమకం పఠించారు. పంచాక్షరి జపంలో భాగంగా శివశివ శంకర భూత పతే, శంకర శివ, శంభో మహాదేవ, హరహర మహాదేవ మంత్రాలతో యాగశాలలు మార్మోగాయి. బ్రహ్మ స్వరూపిణి బగళాముఖి మంటపంలో సీఎం కేసీఆర్ దంపతుల సమక్షంలో వేద పండితులు, రుత్వికులు పూజలు చేశారు. శతమానం భవతే అంటూ పండితులు సీఎం దంపతులను ఆశీర్వదించారు. నవగ్రహ మంటపంలో ఆదిత్య హృదయంతోపాటు సూర్యాది నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీమాత ప్రధాన యాగశాలలో రాజరాజేశ్వరీదేవి ప్రార్థన చేశారు. గురువారం రుత్వికులు 400 సార్లు చండీ సప్తశతి పారాయణ చేశారు. వేద పండితులు యాగం వీక్షించడానికి వచ్చిన భక్తులకు సుభాషితాలు వినిపించారు. యాగ విశిష్టతను వివరించారు. మహాహారతితో గురువారం నాటి పూజా కార్యక్రమాలు ముగిసాయి.

పాల్గొన్న ప్రముఖులు

నాలుగో రోజు యాగంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వివిధ రకాల పూజా కార్యక్రమాల్లో పాల్గొని చండీమాత అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంలో రాష్ట్రంలోని ఎంపీ, ఎమ్మెల్యేలు అందరితోపాటు పలువులు ప్రముఖులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం పూజా కార్యక్రమాలతో యాగం ముగియనుంది.


ముత్తయిదువులకు వాయినం అందజేస్తున్న కేటీఆర్ భార్య శైలిమ, ఎంపీ కవిత


గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి మేనకాగాంధీ నుంచి అవార్డు అందుకుంటున్న కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్ జిల్లాకు జాతీయ పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ: బేటీ బచావ్ బేటీ పడావ్ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో విశేష కృషి చేసినందుకుగానూ తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని నెల్లూరు జిల్లాకు జాతీయ పురస్కారాలు దక్కాయి. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ బేటీ బచావ్ బేటీ పడావ్ కార్యక్రమం అమలులో సత్ఫలితాలు సాధించిన జిల్లాలకు అవార్డులు ప్రదానం చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మేనకాగాంధీ చేతుల మీదుగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డు అందుకున్నారు. అలాగే ఏపీ నుంచి నెల్లూరు జిల్లాకు దక్కిన అవార్డును ఐసీడీఎస్ పీడీ సరోజిని అందుకున్నారు.

‘స్పీడ్’ పోస్ట్ దందాపై విచారణ మొదలు

రెండ్రోజుల్లో పలువురు అధికారులకు మెమోలు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: స్పీడ్ పోస్ట్ పేరిట రాష్ట్ర రవాణాశాఖలో వాహనదారుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్న విషయంపై ఎట్టకేలకు ఆర్టీఏ అధికారులు స్పందించారు. ఈ నెల 23న ‘సాక్షి’లో ‘స్పీడ్‌గా దోచేస్తోంది’పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆ శాఖ ఉన్నతాధికారులు దళారుల ద్వారా కార్డులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే ఈ వ్యవహారంపై పలు ఆర్టీఏ కార్యాలయాల్లో వాకబు చేశారు. దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయాల్లోని అధికారులను వివరణ కోరారు. అయితే వారిచ్చిన సమాధానంతో ఉన్నతాధికారులు సంతృప్తి చెందలేదు. దీంతో త్వరలోనే వారికి మెమోలు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. రెండ్రోజుల్లో మెమోలు జారీ కానున్నట్లు తెలిసింది.

వీఆర్వోకు ఎంపికైన దివ్యాంగులకు వైద్య పరీక్షలు

28 నుంచి 30 వరకు నిర్వహణ: టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: వీఆర్వో పోస్టుకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న దివ్యాంగ అభ్యర్థులకు మెడికల్ బోర్డు నిర్వహించే వైద్య పరీక్షలు ఈ నెల 28 నుంచి 30 వరకు ఉంటాయని టీఎస్‌పీఎస్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దృష్టి లోపం ఉన్న దివ్యాంగులు 28 నుంచి 30 వరకు మెహిదీపట్నంలోని సరోజి దేవి కంటి ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొంది. వినికిడి లోపం ఉన్న అభ్యర్థులు కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రిలో, శారీరక వైకల్యం ఉన్న అభ్యర్థులు అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో పైన పేర్కొన్న తేదీ, సమయాల్లో హాజరు కావాలని సూచించింది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in ను చూడాలని పేర్కొంది.

ఎస్సీ యువతకు ఉపాధి శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ నిరుద్యోగ యువతకు వివిధ ట్రేడుల్లో ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు రాష్ట్ర ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ (టీఎస్‌సీసీడీసీ) తెలిపింది. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలు మించకుండా 18–35 ఏళ్ల వయసున్న అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపింది. జాతీయ పర్యాటక ఆతిథ్య నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఫేష్ ట్రెనింగ్, పంచకర్మ, ఆయుర్వేద స్పా, రెస్టారెంట్ సర్వీసులో శిక్షణ ఇస్తామని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నామని పేర్కొంది. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్‌లోని జాతీయ, పర్యాటక ఆతిథ్య నిర్వహణ సంస్థలో కానీ జిల్లా ఎస్సీ కోఆపరేటివ్ సంస్థను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల డైరీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రూపొందించిన 2019 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నాంపల్లిలోని తెలంగాణ గెజిటెడ్ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీజీవో అధ్యక్షురాలు వి.మమత, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ హాజరయ్యారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..., పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అధికారులతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర కూడా ఎంతో అవసరమన్నారు. తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో వారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

స్ట్రెచర్‌పై వైద్య విద్య

▶ మొదటి పేజీ తరువాయి

ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలు, వరంగల్లో కాకతీయ మెడికల్ కాలేజీ ఉంది. ఆదిలాబాద్‌లో రిమ్స్ మెడికల్ కాలేజీ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేటల్లోనూ మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. వీటన్నింటినీ కలుపుకుని మొత్తంగా 1,150 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అత్యధికంగా ఉస్మానియాలో 250, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల్లో 200 చొప్పున ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఏడు మెడికల్ కాలేజీల్లో 680 పీజీ మెడికల్ స్పెషాలిటీ సీట్లున్నాయి. వచ్చే ఏడాది నుంచి నల్లగొండ, సూర్యాపేటల్లోనూ మెడికల్ కాలేజీలు ఏర్పాటుకానున్నాయి. ఈ కాలేజీలన్నింటికీ అనుబంధంగా బోధనాసుపత్రులున్నాయి. నిత్యం ఆయా బోధనాసుపత్రులకు వేలాది మంది రోగులు వస్తుంటారు. గాంధీ, ఉస్మానియా, నీలోఫర్ ఆసుపత్రులకైతే జనం పోటెత్తుతారు. కానీ ప్రస్తుతం నడుస్తున్న కాలేజీల్లో అధ్యాపకుల కొరత వేధిస్తుంది. నల్లగొండ, సూర్యాపేట కాలేజీలతో మొదలుకొని మిగిలిన ఏడు కాలేజీల్లో ఉండాల్సిన అధ్యాపకులు, వైద్యుల సంఖ్య 2,359 కాగా, కాంట్రాక్టు పద్ధతిని తీసుకున్న వారితో కలుపుకొని కేవలం 1,434 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మొత్తంగా 925 ఖాళీలున్నాయి. ఉదాహరణకు 100 ఎంబీబీఎస్ సీట్లున్న ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉండాల్సిన అధ్యాపకుల సంఖ్య 168 మంది కాగా, ప్రస్తుతం అక్కడి స్టాఫ్ 49మంది మాత్రమే. ఇంకా 119 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 100 ఎంబీబీఎస్ సీట్లున్న నిజామాబాద్ మెడికల్ కాలేజీలో 210 మంది అధ్యాపకులు ఉండాలి. కానీ.. 102 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇంకా 108 ఖాళీలున్నాయి. 150 ఎంబీబీఎస్ సీట్లున్న మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో 112 మంది అధ్యాపకులకు గానూ.. కేవలం 53 మంది స్టాఫ్ ఉన్నారు. ఇక్కడ 59 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే సిద్దిపేట మెడికల్ కాలేజీలో 104 ఖాళీలున్నాయి. ఇలా అన్ని మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ బోధనాసుపత్రుల్లో భారీ స్థాయిలో ఖాళీలుండటంతో రోగులు అల్లాడిపోతున్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) తనిఖీలకు వచ్చినప్పుడు మాత్రం ఏవేవో సర్దుబాట్లు చేసి లెక్కలు చూపిస్తుంటారు. ఈ ఏడాది ఎంసీఐ నుంచి ఎలాగోలా గట్టెక్కేందుకు కొంత మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. కానీ ప్రొఫెసర్ల కొరత మాత్రం తీర్చలేకపోయారు. ఈ పరిస్థితి వల్ల దేశంలో 100 ప్రముఖ మెడికల్ కాలేజీల్లో తెలంగాణ నుంచి ఒక్కటి కూడా పోటీలో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఏటా 50 మంది విరమణ...

ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల కొరతతో రాష్ట్రంలో వైద్యవిద్య నాణ్యత తగ్గుతోంది. పైగా ఆయా బోధనాసుపత్రులకు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడంలేదు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ చేస్తుండటం, సకాలంలో పదోన్నతులు చేపట్టకపోవడం, నియామకాలు లేకపోవడం వల్లే అధ్యాపకుల కొరత వేధిస్తుంది. ప్రతీ ఏటా సరాసరి 50 మంది వరకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. గతేడాది 50 మంది విరమణ పొందగా, అందులో 34 మంది మెడికల్ ప్రొఫెసర్లు ఉన్నారు. దీంతో.. ఎంబీబీఎస్, పీజీ సీట్లలో బోధన చేసేవారే లేరు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు రిటైర్ అయితే.. పీజీ సీట్లు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. ఎంసీఐ నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్‌కు 3 పీజీ మెడికల్ సీట్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఒక పీజీ సీటు కేటాయిస్తారు. ఆ ప్రకారం ఫ్యాకల్టీ లేకపోతే ఉన్న సీట్లలో నిస్సందేహంగా కోత విధిస్తారు. ఇలా ఫ్యాకల్టీ తగ్గిపోవడంతో గాంధీ, ఉస్మానియా వంటి మెడికల్ కాలేజీల్లోనూ సీట్లు కోల్పోవాల్సిన దుస్థితి. నాలుగైదేళ్లలో ఇలా పెద్దసంఖ్యలో సీట్లు కోల్పోవాల్సి వచ్చింది. అయితే.. ప్రభుత్వం కలుగజేసుకొని ఎంసీఐ వద్దకు వెళ్లి ఈ ఖాళీలను భర్తీ చేస్తామని బతిమాలుకుని.. మళ్లీ ఆ సీట్లు తెచ్చుకున్నప్పటికీ నియామకాలు మాత్రం జరపలేదు. ఈ ఏడాది 54 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో దాదాపు 100కు పైగా పీజీ మెడికల్ సీట్లపై కత్తి వేలాడుతుండటం గమనార్హం. కీలకమైన 35 రకాల విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు వెళ్లిపోతుండటంతో రాష్ట్రంలో వైద్యవిద్య ప్రమాదంలో పడింది. గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి బోధనాసుపత్రుల్లో రోగుల సమస్యలపైనా ఈ కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది.

విరమణ వయస్సు పెంపుపై జాప్యం

రాష్ట్రంలో ఉద్యోగ విరమణ వయస్సు 58 ఏళ్లు. దీంతో వైద్య ప్రొఫెసర్లు 58 ఏళ్లు రాగానే.. రిటైర్ అయిపోతున్నారు. వారిని ప్రైవేటు మెడికల్ కాలేజీలు లక్షలకు లక్షలు జీతాలిచ్చి నియమించుకుంటున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రం సీనియర్లను వదిలేసుకొని కాంట్రాక్టు పద్ధతిలో జూనియర్లను తీసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. బోధనాసుపత్రుల్లోని అధ్యాపకుల విరమణ వయస్సును 65 ఏళ్లకు పొడిగించాలని గతేడాది రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం కేవలం కాగితాలకే పరిమితమైంది. దీంతో సత్తా ఉన్న వైద్య అధ్యాపకులంతా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్‌లో అధ్యాపకుల విరమణ వయస్సు 65ఏళ్లు కలిపి మరో ఐదేళ్లు పొడిగించారు. అంటే 70 ఏళ్ల వరకు కూడా సీనియర్ల సేవలను వినియోగించుకోనున్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం 58 ఏళ్లకే రిటైర్మెంట్ కారణంగా వైద్యవిద్య ప్రమాదంలో పడింది. పైపెచ్చు సకాలంలో పదోన్నతులు లేకపోవడంతో.. ప్రొఫెసర్ కేడర్‌లోకి రాకుండానే విరమణ పొందుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు ముందు చూపు లేకపోవడంతోనే ఈసమస్య ఉత్పన్నమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మన వైద్యులకు మధ్యప్రదేశ్ వల...

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, అధ్యాపకుల వేతనాలు చాలా తక్కువ ఉన్నాయన్న విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వ వైద్య సేవల వైపు డాక్టర్లు ఆసక్తి చూపించడంలేదు. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ప్రొఫెసర్ వేతనం అన్నీ అలవెన్సులు కలుపుకొని లక్షన్నర రూపాయలుండగా.. కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు అధ్యాపకుని సామర్థ్యం ఆధారంగా రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు వేతనం ఇస్తున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్‌కు ప్రభుత్వం రూ.లక్ష వరకు ఇస్తే, బయట రూ.2 లక్షలు ఇస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ప్రభుత్వం రూ.80, 90 వేలు ఇస్తే, బయట రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఇస్తున్నారు. ఇదిలావుంటే మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది నాలుగు మెడికల్ కాలేజీలను ప్రారంభించింది. ఆయా కాలేజీలకు అవసరమైన ప్రొఫెసర్లు, ఇతర అధ్యాపక సిబ్బంది కోసం ఇటీవల ఆ రాష్ట్రానికి చెందిన ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఒక బృందం తెలంగాణకు వచ్చింది. సీనియర్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, డాక్టర్ల సంఘాలతోనూ సమావేశమైంది. తమ రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో పనిచేయడానికి ముందుకు వచ్చే వారికి భారీ వేతనాలు, ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించింది. అలాగే నివసించేందుకు మంచి క్వార్టర్లు ఇస్తామని, భార్యాభర్తల్లో ఎవరైనా అర్హత కలిగినవారు ఉంటే వారికి సరిపోయే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, ఒప్పుకుంటే తక్షణమే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చింది. అలా వివిధ రాష్ట్రాలు భారీ ప్రోత్సాహకాలు ఇస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం సీనియర్లను పోగొట్టుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



నిశిరాతిరిలో నిశ్శబ్ద విజయం!

విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్‌ఎల్‌వీ సీ44

శ్రీహరికోట(సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నెల్లూరు జిల్లాలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదినుంచి పీఎస్‌ఎల్‌వీ సీ44 (పీఎస్‌ఎల్‌వీ–డీఎల్) అనే వినూత్న ఉపగ్రహ వాహక నౌకను గురువారం రాత్రి 11.37 గంటలకు 70వ ప్రయోగంగా ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారు. పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో 46వ ప్రయోగమైన పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను మొదటిసారిగా 2 స్ట్రాపాన్ బూస్టర్లతో రూపొందించి విజయవంతంగా ప్రయోగించారు. తమిళనాడులోని హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన కలాంశాట్, ఇండియన్ డిఫెన్స్‌కు ఉపయోగపడే మైక్రోశాట్–ఆర్ అనే రెండు ఉపగ్రహాలను పీఎస్‌ఎల్‌వీ సీ44 రోదసీలోకి మోసుకెళ్లి నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టి నిశిరాత్రిలో నిశ్శబ్ద విజయాన్ని నమోదు చేసుకుంది. 44.4 మీటర్లు పొడవున్న పీఎస్‌ఎల్‌వీ సీ44 ప్రయోగ సమయంలో 290 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి పయనమైంది. బుధవారం రాత్రి 7.37 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ 28 గంటల పాటు కొనసాగింది. కౌంట్‌డౌన్ ముగిసే సమయం ముగిసిన వెంటనే గురువారం రాత్రి 11.37 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ44 నిప్పులు కక్కుతూ విజయవంతంగా నింగికి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగాక 11.55 గంటలకు ముందుగా మైక్రోశాట్–ఆర్ ఉపగ్రహాన్ని భూమికి 274.2 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 1.5 కిలోలున్న కలాంశాట్‌ను 450 కి.మీ. ఎత్తులోని కక్ష్యలో ప్రవేశపెట్టారు. రెండు ఉపగ్రహాలను వేర్వేరు కక్ష్యల్లోకి విజయంగా ప్రవేశపెట్టడంతో శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు.

సెట్స్ తేదీల్లో మార్పులు

▶ మొదటి పేజీ తరువాయి

షెడ్యూల్ ప్రకారం మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించాల్సి ఉండగా వాటిని అదే నెల 28 నుంచి 31 వరకు నిర్వహిస్తామని వివరించారు. ఎడ్‌సెట్‌ను మే 30, 31 తేదీల్లో నిర్వహించేలా ముందుగా షెడ్యూల్ జారీ చేసినప్పటికీ మే 31నే పూర్తి చేసేలా మార్పులు చేసినట్లు వివరించారు. ఇటీవల ఆయా సెట్స్‌కు కన్వీనర్లను నియమించిన ఉన్నత విద్యామండలి గురువారం వారితోపాటు ఆయా సెట్స్‌కు చైర్మన్లుగా వ్యవహరించే సంబంధిత యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సెట్స్ నోటిఫికేషన్ల జారీ, దరఖాస్తుల స్వీకరణ అంశాలపై చర్చించింది. ఇప్పటికే సెట్స్ కమిటీలను ఏర్పాటు చేశామని, త్వరలోనే ఆయా కమిటీలు సమావేశమై నోటిఫికేషన్ల జారీ తేదీలను వెల్లడిస్తాయని పాపిరెడ్డి పేర్కొన్నారు. అప్పుడే దరఖాస్తు ఫీజుల వివరాలను వెల్లడిస్తామన్నారు. గతేడాది నిర్ణయించిన ఫీజునే కొనసాగించే అవకాశం ఉందని, ఒకవేళ పెంచాల్సి వచ్చినా ఆ పెంపు స్వల్పంగానే ఉంటుందని వివరించారు. ప్రవేశపరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ఈసారి పరీక్ష కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా, ఒకవేళ తలెత్తినా వెంటనే పరిష్కరించేలా టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యేలా సెట్స్ వెబ్‌సైట్లలో మాక్ టెస్టుల లింకులను విద్యార్థుల ప్రాక్టీస్ కోసం అందుబాటులో ఉంచుతామన్నారు. హైదరాబాద్ నాచారంలోని పరీక్ష కేంద్రంలో దాదాపు 8 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, అక్కడ గతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయని, ఈసారి అవి లేకుండా చూస్తామన్నారు. పీజీ కామన్ ఎంట్రెన్స్ విషయంలో ఆలోచనలు చేస్తున్నామన్నారు.

ఇవీ సెట్స్ తేదీల వివరాలు...

సెట్	పాత తేదీలు	మారిన తేదీలు
లాసెట్, పీజీ లాసెట్	మే 26	మే 20
పీఈసెట్	మే 20 నుంచి	మే 15 నుంచి
పీజీఈసెట్	మే 27, 28, 29	మే 28, 29, 30, 31
ఎడ్‌సెట్	మే 30, 31	మే 31
ఎంసెట్	మే 3, 4, 6 (ఇంజనీరింగ్), 8, 9 (అగ్రికల్చర్)	–
ఈసెట్	మే 11	–
ఐసెట్	మే 23, 24	–

1 నుంచి ఫిష్ ఫెస్టివల్

- ఎన్‌ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాణికుమూదిని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పౌష్టికాహారమైన చేపల వినియోగాన్ని పెంచేందుకు జాతీయ చేపల అభివృద్ధి సంస్థ (ఎన్‌ఎఫ్‌డీబీ) నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఐఏఎస్ అధికారి రాణికుమూదిని తెలిపారు. శరీరానికి కావాల్సిన ఆవశ్యక ప్రొటీన్లను అందించే చేపలు మెరుగైన ఆహారమన్నారు. వీటిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, చేపల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పలు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. చేపలు తింటే ముళ్లు గొంతులో ఇరుక్కుంటాయని, ఇతర అపోహలు ప్రజల్లో ఉన్నాయని.. ఇలాంటి వాటిని పోగొట్టేందుకు జాతీయ స్థాయిలో పలు ఫిష్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 2018 జూలైలో విశాఖపట్నంలో తొలిసారిగా ఫిష్ ఫెస్టివల్ నిర్వహించామని, దీనికి అద్భుతమైన స్పందన వచ్చిందని చెప్పారు. ఈ ఏడాది తొలి ఫిష్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



3 వారాల్లో 131 కేసులు

- రాష్ట్రంలో చాపకింద నీరులా విస్తరిస్తున్న స్వైన్‌ఫ్లూ
- ప్రస్తుతం గాంధీ, ఉస్మానియాలో 10 మందికి చికిత్స
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. మూడు వారాల్లోనే 1,170 మంది నుంచి నమూనాలు సేకరించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపగా, వీరిలో 131 మందికి పాజిటివ్ అని తేలింది. వీటిలో ఒక్క హైదరాబాద్‌లోనే 47 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లోని స్వైన్‌ఫ్లూ వార్డుల్లో 10 మంది చికిత్స పొందుతుండగా, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పెరుగుతున్న చలి తీవ్రత.. ఉదయం మంచు కురుస్తుండటంతో ఫ్లూ కారక వైరస్ బలోపేతం అవుతోంది. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఫ్లూ కేసులు నమోదు కావడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఐదేళ్ల తర్వాత ఇంత భారీ స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. అయితే స్వైన్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ పేర్కొంది.

ఇప్పటి వరకు 29 మంది మృతి..

గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఫ్లూ లక్షణాలతో ఉస్మానియా ఆస్పత్రిలో 228 మంది చేరగా, వైద్యులు వారి నుంచి నమూనాలు సేకరించి ఐపీఎంకు పంపారు. వీరిలో 38 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో ఇప్పటి వరకు 10 మంది మృతి చెందారు. ఫ్లూ బాధితుల్లో 50 నుంచి 70 ఏళ్ల లోపు వారు 38 మంది ఉండగా, మిగిలిన వారంతా 50 ఏళ్ల లోపువారే. బాధితుల్లో 60 శాతం మంది పాత బస్తీ పరిసర ప్రాంతాలకు చెందిన వారే కావడం గమనార్హం. గాంధీ ఆస్పత్రి స్వైన్‌ఫ్లూ నోడల్ సెంటర్‌లో గతేడాది నుంచి ఇప్పటి వరకు 80 పాజిటివ్ కేసులు నిర్ధారణ కాగా, వీరిలో 19 మంది మరణించారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో ఏడుగురు చికిత్స పొందుతుండగా, వీరిలో ఐదుగురికి పాజిటివ్ రాగా, మరో నలుగురిని అనుమానిత ఫ్లూ కేసులుగా నమోదు చేసుకుని చికిత్స అందిస్తున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

చిన్న జాగ్రత్తలు తీసుకుంటే చాలు..

సాధారణ ఫ్లూ, స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఒకేలా ఉంటాయి. అంతమాత్రాన జ్వరం, దగ్గు, ముక్కు కారడం తదితర లక్షణాలు కనిపించగానే స్వైన్ ఫ్లూగా భావించాల్సిన అవసరం లేదు. రోగ నిరోధక శక్తి తక్కువ ఉండే మధుమేహులు, గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కిడ్నీ, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు ఫ్లూ బారిన పడే అవకాశాలు ఎక్కువ. స్వైన్‌ఫ్లూలో దగ్గు, జలుబు, ముక్కు కారడం, దిబ్బడగా ఉండటం, 101, 102 డిగ్రీల జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం, తలనొప్పి, కొందరిలో వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటాయి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నవారు తుమ్మినా, దగ్గినా చేతి రుమాలు అడ్డు పెట్టుకోవాలి. బయట నుంచి ఇంటికి వెళ్లగానే చేతులు, కాళ్లు సబ్బుతో కడుక్కోవాలి. మూడు కన్నా ఎక్కువ రోజులు పై లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి.



రేపు భారతమాతకు మహా హారతి


ఏర్పాట్లు చేస్తున్న భారతమాత ఫౌండేషన్



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న సాయంత్రం నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో భారత మాత మహా హారతి కార్యక్రమం నిర్వహించేందుకు భారతమాత ఫౌండేషన్ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 1,500 మంది భారతమాత వేషధారణతో పాల్గొనే కార్యక్రమానికి మహిళలు, నగరంలోని వివిధ కాలేజీల నుంచి విద్యార్థులు తరలి వస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర బీజేపీ నేతలు ఎమ్మెల్సీ రాంచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి గురువారం పరిశీలించారు. గణపతి పూజ అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈనెల 25న ప్రసాద్ ఐమాక్స్ నుంచి భారతమాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి నెక్లెస్ రోడ్డులో ప్రతిష్ఠిస్తామని తెలిపారు. చాగంటి వారి ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సప్త హారతులు, సంగీత కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. చింతల రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ స్థలం సరిపోదనే కారణంతో ఈ కార్యక్రమానికి 1,500 మందిని మాత్రమే అనుమతిస్తున్నామన్నారు.

లెక్చరర్ పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకులు


- పోస్టులు భర్తీ చేసుకోవచ్చన్న హైకోర్టు
- నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని వెల్లడి
- పొలిటికల్ సైన్స్ విభాగంలో ఓ పోస్టును ఖాళీగా ఉంచాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి అడ్డంకులు తొలగిపోయాయి. పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. లెక్చరర్ల పోస్టులను భర్తీ చేసుకోవచ్చని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ నియామకాలన్నీ తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది. పొలిటికల్ సైన్స్ విభాగంలో ఓ పోస్టును ఖాళీగా ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ఉత్తర్వులు జారీ చేశారు. రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీలో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించడం లేదంటూ హైదరాబాద్‌కు చెందిన సుజాత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. నియామకపు ప్రక్రియపై స్టే విధించింది. ఈ స్టేను ఎత్తేయాలని కోరుతూ టీఎస్‌పీఎస్సీ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి విచారణ జరిపారు. ప్రభుత్వ నియామకాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసిందని పిటిషనర్ వివరించారు. అయితే డిగ్రీ కాలేజీల్లో భర్తీ చేసే లెక్చరర్ల పోస్టుల భర్తీ విషయంలో ఈ ఉత్తర్వులను అమలు చేయడం లేదన్నారు. ఆ తరువాత టీఎస్‌పీఎస్సీ న్యాయవాది డి.బాలకిషన్‌రావు వాదనలు వినిపిస్తూ, రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. 546 పోస్టుల్లో బీసీలకు 117 పోస్టులు కేటాయించామన్నారు. సర్వీసు నిబంధనల ప్రకారం పోస్టుల భర్తీ జరుగుతోందని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పోస్టుల భర్తీ విషయంలో గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించారు. లెక్చరర్ల పోస్టుల భర్తీకి అనుమతినిచ్చారు.



9వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2019



శ్రీ సునీల్ అరోరా
భారత ఎన్నికల అధికారి

సందేశం

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, దేశంలోని పౌరులందరినీ, 18 సం॥లు నిండి ఓటర్లుగా నమోదు చేసుకోబోతున్న వారందరికీ నా శుభాకాంక్షలు. యుక్త వయస్సు రాగానే ఓటు హక్కును మన పవిత్ర రాజ్యాంగ కర్తలు, అర్హులైన భారతీయ పౌరులందరికీ కల్పించారు. భారత ఎన్నికల సంఘంగా మేము దానిని మీకందించడానికి ఎంతో కృషి చేస్తున్నాం.

యావత్ దేశమంతటా 17వ లోక్‌సభ ఎన్నికలకు, ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ఎన్నికలకు సిద్ధమవుతోంది. మేము కూడా దేశంలోని 87 కోట్లపైగా ఓటర్లకు, 10 లక్షల పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జాతీయ ఎన్నికల్లో మొదటి సారిగా మిల్లెనియల్స్ మా అంబాసిడర్స్‌గా పాలుపంచుకుంటున్నారు. దీనికి వారి కుటుంబసభ్యులు సైతం సహకరిస్తారని ఆశిస్తాము. ఈ ఎన్నికల్లోనే కాక, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ పాలు పంచుకుంటారని భావిస్తున్నాము.

ఎక్కువ మంది ఓటింగ్‌లో పాలు పంచుకుంటే, అదే ధృడమైన ప్రజాస్వామ్యానికి పునాది. మేం, భారతీయ కమీషన్‌లో **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నాం.

మాకు ఈ రోజు ఎంతో కీలకమైన రోజు. 25 జనవరి, 1950న భారత ఎన్నికల సంఘం స్థాపించబడిన రోజు. ఈనాడే పటిష్ట భారత ప్రజా స్వామ్య వ్యవస్థ సుస్థాపితమైన రోజు. దేశంలో అద్భుత ప్రజాస్వామ్య వారసత్వాన్ని చాటిచెబుతూ, ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నాటి నుండి విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

మా లక్ష్యం - ప్రతి ఎన్నికలను ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేయడమే, ఓటరుతో స్నేహపూర్వకంగా, పారదర్శకంగా మెలగడమే. ఈ దిశగా మేము ఎన్నో చర్యలు చేపట్టాం. ఎన్నికల ఆఫీసును చేరువ చేసి, సకల సమాచారం, సహకారం కోసం - ఓటర్ హెల్ప్‌లైన్ నెం: 1950 అందించాం. ఇదే నెంబర్‌పై ఎస్ఎమ్ఎస్ సేవలు ఫోన్ ద్వారా పంపిస్తున్నాం. ఆన్‌లైన్ ఓటర్ సేవలను ఫోన్ ద్వారా అందిస్తున్నాం.

భారత ఎన్నికల సంఘం తరపున, నేను దేశంలోని ఓటరులందరినీ తమ పవిత్రమైన ఓటుహక్కు వినియోగించుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి భయం, ఆందోళన, లంచాలకు లొంగక భారత ప్రజాస్వామ్యాన్ని గెలిపించవలసిందిగా కోరుతున్నాను. ఇది 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం మీరు కోరుకున్న వారు మీ తరపున లోక్‌సభలో నిలుస్తారు. అందుకే నేడే ఓటర్‌గా నమోదు చేసుకోండి.

మరొక్కసారి, జాతీయ ఓటర్ల దినోత్సవం 2019 తరపున దేశంలోని ప్రజలందరికీ మన స్ఫూర్తిగా నా శుభాభినందనలు అందజేస్తున్నాను.

జై హింద్

"ఎలక్షన్ కమీషన్ 25 జనవరి తన సంస్థాపన దినోత్సవంగా **'జాతీయ ఓటర్ల దినోత్సవం'** గా జరుపుకుంటోంది, 2011 జనవరి 25 నుంచి ప్రతీ సంవత్సరం ఇలా జరుపుకోంటోంది. ఏ ఓటరు తన హక్కును కోల్పోకూడదు అనే లక్ష్యంతో ఈ రోజు 9వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించబడుతోంది. చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరికి ఈ హక్కును కల్పించుటలో పూర్తిగా వాస్తవరూపంలోకి తీసుకువచ్చుటకు మరియు భారత ప్రజాస్వామ్య నాణ్యతను పెంపొందించుటకు ఈ సందర్భాన్ని ఉపయోగిస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పెంపొందించు లక్ష్యంతో కమీషనర్ ఉన్నారు. తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల ప్రదేశాలన్నింటి వద్ద కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద నూతనంగా నమోదైన ఓటర్లు నూతన పివిసి కలర్ కార్డుతో పాటు లోగో మరియు **"Proud to be a voter – Ready to Vote"** నినాదం కలిగి ఉంటారు."

తెలంగాణ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

తెలంగాణ సుస్థిర మరియు క్రియాశీల ప్రభుత్వం కలిగిన వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం, ఇది 2018 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలిచింది, ఒక్క సంఘటన కూడా లేకుండా ఎంతో ప్రశాతంగా నిర్వహించబడినవి. ఈ పరపతి అంతా ఎలక్షన్ కమిషన్‌కు దక్కుతుంది, వారు ఎలక్షన్లను సవ్యంగా, సజావుగా నిర్వహించుటకు అవిశ్రాంతంగా పని చేశారు. గతంలోని ఓటర్ శాతం 69.5 శాతంతో పోల్చితే ఇప్పుడు 73.4 శాతమునుకు పెరిగింది. ఎలక్షన్ కమిషన్ ప్రయత్నాలతో ఇది ఎంతో గొప్ప అభివృద్ధి, విజయంగా పేర్కొనవచ్చును.

ఇప్పుడు జాతీయ ఓటర్ల దినోత్సవం ఎంతో సంతోషంగా జరుపుకునే వేడుక **NVD**. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వివిధ రకాల కార్యకలాపాలతో మరియు ఎంతో ఆసక్తి కలిగించే అంశాలతో నిర్వహించబడుతోంది. క్విజ్, వ్యాసరచన, మాక్ పార్లమెంట్, మహిళలకు రంగోలి పోటీలు, హై స్కూల్స్ సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయి. వీటిని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహిస్తారు. మరియు విజేతలకు బహుమతులు మరియు సర్టిఫికేట్లు పంపిణీ ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున తెలంగాణలో అన్ని విద్యాసంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలలో **NVD** ప్రతిజ్ఞ చేయబడుతుంది. పోలింగ్ స్టేషన్, శాసన సభ నియోజకవర్గం, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో **NVD** కార్యక్రమాలకు హాజరయ్యే పౌరులందరూ కూడా ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది.

జాతీయ ఓటర్ల దినోత్సవం
25 జనవరి
2019

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.



డా॥ రజత్ కుమార్ ఐ.ఎ.ఎస్
ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ

సందేశం

భారత ఎన్నికల సంఘం 25 జనవరిని తన సంస్థాగత దినోత్సవం రోజును 2011 నుండి ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం మీకందరికీ తెలుసు. ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం - ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, అర్హులైనవారందరినీ ఓటర్లుగా నమోదు చేయడం తద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం. ఈ రోజు మనం 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ముఖ్యాంశంతో జరుపుకుంటున్నాం.

తెలంగాణ మొట్టమొదటి సాధారణ ఎన్నికలు డిసెంబర్ 2018లో ఎంతో ప్రశాంతంగా చక్కగా జరిగాయని తెలియజేస్తున్నాను. తెలంగాణ ఓటరు మహాశయులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. పోలింగ్ శాతం రాష్ట్రంలో చారిత్రాత్మకంగా 73.40% మును పెన్నడూ లేని విధంగా నమోదు అయ్యింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, ఉద్రిక్తపరిస్థితులు, ఆందోళనలు, తలెత్తలేదు. రీపోలింగ్ జరగలేదు. వికలాంగులైన వారికి సైతం - కల్పించిన ప్రత్యేక వసతుల వలన పోలింగ్‌లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారి పోలింగ్ శాతం 70% వరకూ నమోదైంది.

లోక్‌సభకు ఎన్నికలు అతి తొందరలోనే రాబోతున్నాయి. దీనిలో మీ ఓటు హక్కును మీరు వినియోగించాలంటే ముందుగా మీ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఓటర్ లిస్ట్‌లో పేరు లేకపోతే ఓటును వేయలేరు. ఓటర్ల జాబితాల సవరణ 1-1-2019 నుండి ప్రారంభమై, ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయి. మీ దరఖాస్తులు సమర్పించడానికి ఇదే ఆఖరు తేది. తుది జాబితా 26.02.2019 న ప్రకటించబడుతుంది. 31 డిసెంబర్ 2018 నాటికి 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు హక్కును పొందడానికి అర్హులు.

కనుక అర్హులైన పౌరులందరూ వెంటనే తమపేరు నమోదు చేసుకొని, రానున్న జాతీయ సార్వత్రిక ఎన్నికల్లో తమ విలువైన ఓటు హక్కును ఎటువంటి భయం, భీతి లేకుండా, కులం, మతం, ప్రాంతం, భాష లేదా లంచాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవలసిందిగా కోరుతున్నాను.

నేను మరొక్కసారి చేసే విన్నపమల్లా **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అనే భావన ఎన్నికల సంఘం వారి మహదాశయాన్ని నిజం చేసేందుకు మనందరం నిరంతరం కృషి చేద్దాం... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా, వినియోంచుకునేలా చూద్దాం !!



ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి

భారత ఎన్నికల సంఘం
https://eci.gov.in

ప్రధాన ఎన్నికల అధికారి,
తెలంగాణ

Voter Helpline 1950

పబ్‌జీ..మహాడేంజర్‌జీ

- ఆన్‌లైన్ మొబైల్ గేమ్‌కు బానిసలవుతున్న యువత
- గంటల తరబడి ఆటలోనే మునిగితేలుతున్న విద్యార్థులు
- పోటీదారులను తుపాకులు, బాంబులతో చంపడమే గేమ్ లక్ష్యం
- పిల్లలను హింస, నేరప్రవృత్తి వైపు పురిగొల్పుతున్న వైనం
- శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకూ కారణం
- గేమ్‌ను బ్యాన్ చేసిన చైనా.. గుజరాత్ స్కూళ్లలో నిషేధం



మొన్న పోకెమాన్.. నిన్న బ్లూవేల్.. తాజాగా 'ప్లేయర్ అన్‌నోన్స్ బ్యాటిల్‌గ్రౌండ్' ఉరఫ్ పబ్‌జీ.. దేశంలో ప్రస్తుతం యువతను.. ప్రత్యేకించి స్కూలు విద్యార్థులను గంగవెర్రులెత్తిస్తున్న ప్రమాదకర ఆన్‌లైన్ మొబైల్ గేమ్ ఇది. ఆత్మహత్యలవైపు ప్రేరేపించిన బ్లూవేల్, పోకెమాన్‌ల స్థాయిలో కాకున్నా పబ్‌జీ విద్యార్థులను హింస, నేరప్రవృత్తి స్వభావంవైపు పురిగొల్పుతోంది. స్కూళ్లు ఎగ్గొట్టి మరీ గంటల తరబడి వారు ఈ ఆటలో మునిగితేలేలా బానిసలుగా మార్చుకుంటోంది. యువతలో వివిధ శారీరక, మానసిక అనారోగ్యాలకు కారణమవుతోంది. – సాక్షి, హైదరాబాద్

ఏమిటీ గేమ్...?

ఇది దక్షిణ కొరియాకు చెందిన ఓ వీడియో గేమింగ్ కంపెనీ తీసుకొచ్చిన ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమింగ్ యాప్. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని గేమ్‌లో ప్రవేశించగానే ఒక ఐడీ లభిస్తుంది. ఇది ఎక్కువగా ఒక జట్టుగా ఆడే గేమ్. ఎంత మందితో ఈ గేమ్ ఆడాలి అనేది ముందే దీన్ని ఆడేవారు నిర్ణయించుకుంటారు. ఈ గేమ్ ఆడేవారు ప్రత్యేక సైనిక వేషధారుల్లా మారిపోతారు. అలాగే ఇది గ్రూప్ వాయిస్ గేమ్. అంటే ఈ గేమ్ ఆడేవారంతా ఎప్పటికప్పుడు మాట్లాడుకునే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. ఈ గేమ్‌లో గరిష్టంగా వంద మంది ఉంటారు. దీన్ని ఆడేవారు ఏర్పాటు చేసుకున్న టీం తప్ప మిగతా వారంతా శత్రువుల కిందే లెక్క. దీంతో ఈ గేమ్ ఒక యుద్ధక్షేత్రాన్ని తలపిస్తుంది. పోటీదారులందరినీ చంపుకుంటూ పోవడమే ఈ ఆట. యుద్ధంలో ఉపయోగించే తుపాకులు, బాంబులతోపాటు శత్రువులకు చిక్కకుండా దాక్కునేందుకు బంకర్లు, గాయపడితే వైద్యం పొందేందుకు మెడికల్ కిట్ వంటివి ఇందులో ఉంటాయి. ఒక్కసారి ఆటగాడు చనిపోతే గేమ్ అయిపోనట్లే లెక్క. అందుకే యుద్ధంలో ఎలాగైనా గెలవాలనే కసితో ఈ ఆటలో చనిపోయిన ప్రతిసారీ తిరిగి గేమ్‌లో ప్రవేశించాలనుకుంటారు.

గుజరాత్ స్కూళ్లలో నిషేధం

పబ్‌జీ వల్ల బానిసలుగా మారిన యువతను చూసి చైనా ఈ గేమ్‌ను ఇప్పటికే పూర్తిగా నిషేధించింది. సర్వర్ లింకులను కూడా తొలగించి నెటిజన్లకు ఈ గేమ్ లింక్ దొరకకుండా చర్యలు చేపట్టింది. మరోవైపు గుజరాత్ ప్రభుత్వం కూడా ఈ ఆటను స్కూళ్లలో నిషేధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులెవరూ స్కూళ్లకు స్మార్ట్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేసింది. అలాగే దేశవ్యాప్తంగా ఈ గేమ్‌ను నిషేధించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు సైతం చేసింది. వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) సైతం హాస్టళ్లలోని విద్యార్థులు పబ్‌జీకి బానిసలవుతున్నారని గుర్తించి తమ సంస్థ ఆవరణలో దీన్ని ఆడటంపై నిషేధం విధించింది.

పబ్‌జీ ఆడే వారిలో విద్యార్థులు, ఉద్యోగులు సహా చాలా మంది ఉంటున్నారు. ఏ గేమ్ అయినా అతిగా ఆడితే దానికి బానిస లైనట్లే. ఇలాంటి ఆన్‌లైన్ ఆటలను పిల్లలు ఆడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. శారీరక వ్యాయామానికి దోహదపడే ఆటల వైపు వారిని ప్రోత్సహించాలి.
– డాక్టర్ ఫణి ప్రశాంత్ ములకలూరి, మానసిక వైద్య నిపుణుడు

నేను 4 నెలల నుంచి పబ్‌జీ ఆడుతున్నా. ఈ గేమ్ వల్ల స్నేహితులతో సమయం గడపలేకపోతున్నా. గేమ్ ఆడటం తగ్గించాలని ఫోన్లోంచి రెండుసార్లు యాప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసినా నన్ను నేను నియంత్రించుకోలేక మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకున్నా.
– తిరుపతి, డిగ్రీ విద్యార్థి

20 కోట్ల మంది యూజర్లు

ప్రపంచవ్యాప్తంగా పబ్‌జీ ఆడేవాళ్లు దాదాపు 20 కోట్ల మంది ఉన్నారు. ఏ సమయంలోనైనా ఈ గేమ్‌లో యాక్టివ్‌గా ఉండే వాళ్ల సంఖ్య 3 కోట్ల నుంచి 4 కోట్లుగా ఉంది. దీన్నిబట్టి ఈ ఆటకు ఎంత మంది బానిసలుగా మారారో అర్థంచేసుకోవచ్చు.

దేశంలో పబ్‌జీ ప్రభావం....

పబ్‌జీ కారణంగా జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పది, పన్నెండో తరగతి పరీక్షా ఫలితాలు చాలా దారుణంగా వచ్చాయని, వెంటనే ఈ గేమ్‌పై నిషేధం విధించాలని ఆ రాష్ట్ర విద్యార్థుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. తెలుగు రాష్ట్రాల్లో సైతం పబ్‌జీ ప్రభావం అధికంగానే ఉంది. ఎక్కడ చూసినా విద్యార్థులు ఈ గేమ్‌లో మునిగితేలి కనిపిస్తున్నారు.

బానిసలుగా ఎందుకు మారుతున్నారు?



ఏదైనా ఆట ఆడేటప్పుడు గెలవాలనే కసి ఉండటం సహజం. కానీ పబ్‌జీ విషయంలో మాత్రం అది మరీ ఎక్కువ. ఈ గేమ్ ఆడుతున్నంతసేపూ యుద్ధం చేస్తున్న ఫీలింగ్ కలుగుతుంది కాబట్టి యువత ఓడిపోయిన ప్రతిసారీ తిరిగి గేమ్‌లోకి ప్రవేశిస్తూ విజయం కోసం తహతహలాడుతోంది. ఈ ఆట ఆడే సమయంలో ఎవరు వచ్చినా పట్టించుకోరు. గేమ్ నుంచి క్షణం దృష్టి మరల్చినా చనిపోతామనే భయంతో ఎవరు పిలిచినా పట్టించుకోరు. ఎవరు ఫోన్లు చేసినా కట్ చేస్తారు. మానసికంగా పూర్తిగా దానికే అంకితమవుతూ విచక్షణారహితంగా ప్రవర్తిస్తుంటారు.

పబ్‌జీ ఆడే వారిలో కనిపించే లక్షణాలు...

- చదువులో ఏకాగ్రత లోపించడం
- కోపం, చిరాకు ప్రదర్శించడం, దుందుడుకు స్వభావం
- ఎవరితోనూ కలవలేకపోవడం
- నిద్రలేమి, కంటి సమస్యలు

'సీఎల్‌ఐఎస్సీ' ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (సీఎల్‌ఐఎస్సీ) కోర్సులో ప్రవేశాల కోసం రాష్ట్ర గ్రంథాలయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు కాలేజీలు ఉన్నాయని పేర్కొంది. వాటిల్లో ఇంగ్లిష్ మీడియంలో 120 సీట్లు, తెలుగు మీడియంలో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 1 నుంచి 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు ఫారాలను కాచిగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, జడ్చర్లలోని జ్ఞానసాయి లైబ్రరీ సైన్స్ ఇన్‌స్టిట్యూట్, దిల్‌సుఖ్‌నగర్‌లోని నవీన్ వివేకానంద కాలేజ్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌లలో పొందవచ్చని వివరించింది.

మనూలో 'బీఈడీ' దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లో దూరవిద్య ద్వారా బీఈడీ కోర్సులో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎఫ్.రెహమాన్ తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. మార్చి 17న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులనే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 040–23008463, 040–23120600 నంబర్లను సంప్రదించవచ్చు.

18 నుంచి టీసీసీ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలను ఫిబ్రవరి 18 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొంది. డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే తేదీని త్వరలోనే వెల్లడిస్తామని వివరించింది.

భూపాలపల్లి ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌పై విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓపెన్ క్యాస్ట్ మైనింగ్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) గురువారం విచారించింది. జిల్లాలోని కాకతీయ గని–2లో పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా బ్లాస్టింగ్స్ జరుపుతున్నారని, పేలుళ్ల ప్రకంపనలతో సమీపంలోని నివాసాలు దెబ్బతింటున్నాయని రాజలింగమూర్తి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ గనిలో నిబంధనలు పాటించట్లేదని కేంద్ర పర్యావరణ శాఖ కూడా నివేదిక ఇచ్చిందని పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావణ్‌కుమార్ తెలిపారు. మైనింగ్ నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ మరో అప్లికేషన్ దాఖలు చేయగా ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. ప్రధాన కేసు విచారణను త్వరలోనే పూర్తి చేస్తామని, మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని బెంచ్ పేర్కొంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది.

వచ్చే రబీకి 2 లక్షల ఎకరాలకు సాగునీరు

తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈద

సాక్షి, హైదరాబాద్: వచ్చే రబీనాటికి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తెలిపారు. కొన్ని పాత పథకాలకు తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పాటు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన 10 కొత్త ఎత్తిపోతల పథకాలను కూడా ప్రారంభిస్తామని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లోని మరికొన్ని ఎత్తిపోతల పథకాలు అటవీశాఖ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయని, వీటిని సాధించే దిశలో సీఎంతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు నిరంతర కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణలో రైతులను భాగస్వాములను చేయాలని కోరారు. ఎత్తిపోతల పథకాల ద్వారా గత రెండేళ్ల నుంచి మూడులక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు.


వారి ఎన్నిక రద్దు చేయాలి

- హైకోర్టును ఆశ్రయించిన పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల చేతిలో ఓడిపోయిన పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తమపై గెలుపొందినవారి ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ ఎన్నికల పిటిషన్లు(ఈపీ) దాఖలు చేశారు. ఈపీలు దాఖలు చేసినవారిలో నాగం జనార్దన్‌రెడ్డి, డీకే అరుణ, ఎ.రేవంత్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్, దాసోజు శ్రవణ్‌కుమార్, చంద్రశేఖర్, ఫిరోజ్‌ఖాన్, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు. తమపై గెలుపొందిన వారంతా అక్రమ పద్ధతుల్లో విజయం సాధించారని తమ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. కొడంగల్‌లో తనపై గెలుపొందిన పట్నం నరేందర్‌రెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో పలు వివరాలు పొందుపరచలేదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో పలు అక్రమాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని తెలిపారు. అందువల్ల ఆయన ఎన్నికను రద్దు చేసి తాను ఎన్నికైనట్లు ప్రకటించాలని కోరారు. ధర్మపురి నుంచి గెలుపొందిన కొప్పుల ఈశ్వర్ ఎన్నికను రద్దు చేయాలంటూ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తన పిటిషన్‌లో కోరారు. కొందరు అధికారులు ఈశ్వర్‌తో కుమ్మక్కై ఈవీఎంల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని వివరించారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈవీఎంల కు తగిన భద్రత కల్పించలేదని, వాటిని ఉంచిన గదులకు సీలు వేయలేదని పేర్కొన్నారు. నాగర్‌కర్నూలు నియోజకవర్గంలో మర్రి జనార్దన్‌రెడ్డి ఎన్నికను నాగం జనార్దన్‌రెడ్డి సవాల్ చేశారు. గద్వాల నుంచి కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికను కాంగ్రెస్ అభ్యర్థి డీకే అరుణ సవాల్ చేశారు. ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ ఎన్నికను రద్దు చేయాలని దాసోజు శ్రవణ్ కోరారు. పోలైన ఓట్లసంఖ్యకు, కౌంటింగ్‌లో వచ్చిన ఓట్ల సంఖ్యకు మధ్య చాలా తేడాలున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వీవీ ప్యాట్‌ల లెక్కింపునకు అభ్యర్థించినా అధికారులు స్పందించలేదన్నారు. మహబూబ్‌నగర్‌లో వి.శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికను సవాలు చేస్తూ టీడీపీ అభ్యర్థి చంద్రశేఖర్, నాంపల్లిలో ఎంఐఎం అభ్యర్థి ఎన్నికను సవాలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్, సికింద్రాబాద్‌లో టి.పద్మారావుగౌడ్ ఎన్నికను సవాలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హైకోర్టును ఆశ్రయించారు.

రక్షిత గృహాల్లో మీకేం పని?

- 'యాదాద్రి' బాధితులకు నేతల పరామర్శపై హైకోర్టు ఆగ్రహం
- ఎవరికీ అనుమతివ్వొద్దని అధికారులకు ఆదేశం
- విచారణ మార్చి 12కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: 'యాదాద్రి' ఘటనలో బాధిత బాలికలను సందర్శించేందుకు స్థానిక నేతలు, ప్రైవేటు వ్యక్తులకు జిల్లా సంక్షేమ కమిటీలు అనుమతులివ్వడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రక్షిత గృహాల్లో నేతలకు పనేముందని ప్రశ్నించింది. ఇకపై ఎవరినీ బాధిత బాలికల వద్దకు అనుమతించవద్దంటూ రక్షిత గృహ నిర్వాహకులను హెచ్చరించింది. కేసు దర్యాప్తులో ఉన్నందున చిన్నారుల సంరక్షులమని చెప్పుకునే వారిని కూడా అనుమతించ వద్దని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా దౌర్జన్యంగా వ్యవహరిస్తే.. వారిపై అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపింది. బాధిత చిన్నారులను సందర్శించేందుకు ఇప్పటి వరకు ఎవరెవరొచ్చారు? ఎవరెవరికి, ఎందుకు, ఎవరు అనుమతినిచ్చారని ప్రశ్నించింది. ఈ వివరాలను సీల్డ్ కవర్‌లో తమ ముందుంచాలని రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల బాలల సంక్షేమ కమిటీలను ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. యాదాద్రిలో చిన్నారులను వ్యభిచార వృత్తిలోకి దింపిన వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను హైకోర్టు సుమోటో పిల్‌గా పరిగణించిన విషయం తెలిసిందే. గురువారం విచారణ సందర్భంగా ఈ సందర్భంగా రక్షిత గృహం 'ప్రజ్వల' తరపు న్యాయవాది స్పందిస్తూ, తమ రక్షిత గృహంలో ఉన్న చిన్నారులను ఓదార్చేందుకు స్థానిక నేతలు వస్తున్నారని, వీరికి ఆయా జిల్లాల బాలల సంక్షేమ కమిటీలు అనుమతులు ఇచ్చారని కోర్టుకు నివేదించారు. దీనిపై అభ్యంతరం చెబితే, వచ్చిన నాయకులు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వివరించారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించి.. అధికారులను హెచ్చరించింది.

హెచ్‌ఎం అకౌంట్ టెస్టు ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్టు ఎగ్జామినేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో (www.bse.telangana.gov.in) అందుబాటులో ఉంచామని పేర్కొంది. పాస్/ ఫెయిల్ మెమోలను త్వరలోనే అభ్యర్థులకు పంపించనున్నట్లు వెల్లడించింది.

మరో ముగ్గురికి నోటీసులు

- షర్మిలపై అసత్య ఆరోపణల కేసులో జారీ
- మొత్తం 15 మందిని విచారించిన సైబర్‌క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: దివంగత సీఎం వైఎస్సార్ కుమార్తె, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై నమోదైన కేసులో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఐదుగురికి నోటీసులు పంపిన పోలీసులు.. గురువారం మరో ముగ్గురికి నోటీసులిచ్చారు. ఈ కేసుకు కీలక ప్రాధాన్యమిస్తున్న విచారణ బృందం సాంకేతికంగా బాధ్యుల్ని పట్టుకునే ప్రయత్నాల్లో ఉంది. దాదాపు 60 యూట్యూబ్ లింకులను షర్మిల తన ఫిర్యాదులో పొందుపరిచారు. వీటి ఆధారంగా విచారణ ప్రారంభించిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఆయా యూట్యూబ్ చానల్స్ ఎవరికి చెందినవో తెలుసుకుని విచారణకు పిలుస్తున్నారు. గురువారం వరకు మొత్తం 15 మందిని విచారించారు. వీరిలో కొందరు షేర్ చేసిన, పోస్ట్ చేసిన విషయాలు అభ్యంతరకరంగా ఉన్నట్లు తేలింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించారు. వీరికి సీఆర్పీసీ 41(ఎ) సెక్షన్ కింద నోటీసులు జారీ చేశారు. అభియోగపత్రాల దాఖలు అనంతరం వీరు కోర్టుకు హాజరై విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు సూత్రధారుల్ని గుర్తించాలంటే ప్రాథమికంగా ఆయా అంశాలతో కూడిన వీడియోలను సృష్టిస్తూ యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ వివరాలు కోరుతూ యూట్యూబ్ యాజమాన్యానికి, గూగుల్‌కు లేఖలు రాశారు. మరోపక్క ఆయా వీడియోలను వీక్షించిన వారు కింద చేసిన కామెంట్స్‌లో కొన్ని ఆక్షేపణీయంగా ఉన్నాయి. వీటినీ సీరియస్‌గా తీసుకున్న సైబర్‌క్రైమ్ పోలీసులు ఆ సబ్‌స్క్రైబర్స్‌ను గుర్తించే పనిలో పడ్డారు. ఇందుకోసం వారి ఐడీలకు సంబంధించిన లాగిన్, ఐపీ వివరాలు సంపాదించే పనిలో ఉన్నారు.

సాక్షి
శుక్రవారం, జనవరి, 25

సంకల్పం మంచిదేగానీ...

ఉన్నత విద్యా సంస్థల్లో ఇప్పుడున్న సీట్ల సంఖ్యను వచ్చే విద్యా సంవత్సరం నుంచి 25 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుందన్న వార్త చాలామందికి ఉపశమనం కలిగిస్తుంది. సీట్ల సంఖ్య పెరిగితే తమకు ఛాన్స్ ఉంటుందని ఆశించే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాత్రమే కాదు... విద్యావేత్తలు కూడా ఈ నిర్ణయాన్ని హర్షిస్తారు. విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఇటీవల తీసుకొచ్చిన 124వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కోటా అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు తాజా కోటా వల్ల నష్టం కలగకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవ్డేకర్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న 40,000 కళాశాలలు, 900 యూనివర్సిటీలు తాజా నిర్ణయాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాయాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ డీమ్డ్ యూనివర్సిటీలు కూడా సీట్ల సంఖ్యను 25 శాతం పెంచాల్సి ఉంటుంది. వివిధ రకాల ఉన్నత విద్యా సంస్థల్లో మొత్తంగా 3 కోట్ల 66 లక్షలమంది విద్యార్థులున్నారని నిరుడు విడుదలైన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సర్వే చెబుతోంది. అధ్యాపకుల సంఖ్య చూస్తే 13 లక్షలు దాటలేదు. ఉన్నత విద్యాసంస్థల్లో 35 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని జవ్డేకర్ ఇటీవల చెప్పారు. ఇప్పుడున్న విద్యార్థులకు బోధించడానికే తగినంతమంది అధ్యాపకులు లేనప్పుడు కొత్తగా చేరేవారికి చదువుచెప్పేదెవరు?

దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థ నిజానికి సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. మన విద్యా సంస్థల తీరుతెన్నులెలా ఉన్నాయో అంతర్జాతీయంగా ఏటా విడుదలయ్యే సర్వేలు చెబుతాయి. ప్రపంచశ్రేణి విశ్వవిద్యాయాలు చైనాలో 10 ఉంటే మన దేశంలో ఒక్కటంటే ఒక్కటీ లేదని నిరుడు 'యూనీర్యాంక్' జాబితా వెల్లడించింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్(టీహెచ్ఈ) టాప్–100 జాబితాలో మాత్రం మన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) చోటు దక్కించుకుంది. ఏటా విడుదలయ్యే ఈ ర్యాంకులకు అనుసరించే గీటురాళ్లపై భిన్నాభిప్రాయాలున్నా ఉన్నత విద్యా వ్యవస్థ పరిస్థితి ఏమాత్రం సరిగా లేదని అందరూ అంగీకరిస్తారు. అసలు మన పట్టభద్రుల్లో కేవలం 17.5 శాతంమందికి మాత్రమే తగిన ఉద్యోగార్హతలున్నాయని రద్దయిన ప్రణాళికా సంఘం కొన్నేళ్లక్రితం చెప్పింది. ఈ దుస్థితిని గమనించినప్పుడు కొత్తగా సీట్ల సంఖ్య పెంచడం వల్ల ఒరిగేదేమి ఉంటుందన్న సంశయం సహజంగానే చాలామందికి వస్తుంది. సీట్ల సంఖ్య పెరగడం వల్ల మరిన్ని వేలమందికి విద్యాసంస్థల్లో ప్రవేశం దొరికినా అక్కడ చదువు చెప్పడానికి తగిన సంఖ్యలో అధ్యాపకులు లేనప్పుడు, పరిశోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేనప్పుడు ప్రయోజనం ఏముంటుంది? మన ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు దీటైన పరిశోధనలు లేవని మొత్తుకుంటున్నా వినేవారు లేరు. ఉన్న అధ్యాపకులపైనే పని భారం పెరుగుతోంది. ఫలితంగా వారు పరిశోధనల్లో పాలుపంచుకోవడానికి, విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించడానికి అవకాశం చిక్కడం లేదు. కనుకనే ఇక్కడ విద్యాభ్యాసం కోసం వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య ఏటా 50,000 కన్నా తక్కువ ఉంటున్నది. దీన్నంతటినీ పట్టించుకోవాల్సిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఘోరంగా విఫలమైంది. విశ్వవిద్యాలయాల ప్రమాణాలు మెరుగుపర్చడానికి అది చేసిన కృషేమీ లేకపోగా వాటి స్వయంప్రతిపత్తిని దెబ్బతీయడంలో, వాటికి సరిగా నిధులందకుండా చేయడంలో అది విజయం సాధించింది. నిధుల దుర్వినియోగం ఆరోపణల సంగతి సరేసరి. దాని స్థానంలో రాబోయే భారత ఉన్నత విద్యా కమిషన్(హెచ్ఈసీఐ) ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏం చేస్తుందన్న అంశంలో విద్యావేత్తల్లో అత్యధికులు పెదవి విరుస్తున్నారు. ఉన్నత విద్యలో ప్రమాణాలను పెంచడానికి సీ. రంగరాజన్ ఆధ్వర్యంలోని 11వ ఆర్థిక సంఘం చేసిన సూచనలు పరిగణించదగ్గవి. మౌలిక సదుపాయాల కల్పన, విద్యా సంస్కరణలు, తగిన సంఖ్యలో అధ్యాపకులు ఉంటే ప్రమాణాలు పెరుగుతాయని ఆ సంఘం చెప్పింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమష్టిగా కృషి చేస్తే తప్ప ఇది సాధ్యం కాదు. కానీ ఈ విషయంలో పెద్దగా జరిగిందేమీ లేదు. ఆశ్చర్యకరమైన అంశమేమంటే 1965లో ఏర్పాటైన డీఎస్ కొఠారి కమిషన్ తర్వాత ఉన్నత విద్యారంగాన్ని సమగ్రంగా సమీక్షించిందే లేదు. అంటే దాదాపు 55 ఏళ్లుగా ఆ రంగంపై పాలకులెవరూ దృష్టి సారించలేదన్నమాట! పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నప్పుడు ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు పెంచడం వల్ల కొత్తగా సాధించేదేమి ఉంటుంది?

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యా సంస్థల్లో పెరిగే సీట్ల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు పెంచాలంటే అదనంగా కనీసం రూ. 4,000 కోట్లు అవసరమవుతాయని నిపుణుల అంచనా. ఇందుకోసం కేంద్రం ఏ రకమైన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది. ప్రైవేటు విద్యాసంస్థలకు సైతం ఈ అదనపు సీట్ల వల్ల ఆర్థిక భారం గణనీయంగానే ఉంటుంది. ఆ నిధుల్ని సమకూర్చుకోవడానికి ప్రభుత్వాలు ఎలాంటి వెసులుబాట్లు కల్పిస్తాయన్న విషయంలోనూ స్పష్టత లేదు. అంతిమంగా అవి ఫీజుల పెంపుపైనే ఆధారపడక తప్పదు. ఇప్పటికే ఉన్నత విద్య ఖరీదైన వ్యవహారంగా మారింది. అది మరింత భారమైతే ఎంతమంది దాన్ని అందిపుచ్చుకోగలరన్నది అనుమానమే. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి కొన్ని నెలల వ్యవధి మాత్రమే ఉంది. నిధుల మంజూరు మొదలుకొని మౌలిక సదుపాయాల కల్పన వరకూ శరవేగంతో ముందుకు ఉరికితే తప్ప ఇదంతా పరిపూర్తి కాదు. మహా అయితే 'అగ్రవర్ణ పేదలకు' ఏదో చేశామని చెప్పుకోవడానికి పనికొస్తుంది. పాలకులు చివరికేం చేస్తారో చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి బ.పంచమి రా.12.27 వరకు, తదుపరి షష్ఠి నక్షత్రం ఉత్తర రా.10.24 వరకు, తదుపరి హస్త. వర్జ్యం ఉ.6.34 నుంచి 8.05 వరకు, దుర్ముహూర్తం ఉ.8.51 నుంచి 9.35 వరకు తదుపరి ప.12.34 నుంచి 1.20 వరకు, అమృతఘడియలు... ప.3.38 నుంచి 5.08 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

స్వేచ్ఛను లొంగదీసే దొంగాట!


దిలీప్ రెడ్డి

ప్రజాస్వామ్య ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే 'ఓటరు' స్వేచ్ఛను ఆట వస్తువు చేస్తున్నారు. కోరిన రీతిన వంచుతున్నారు. ఓటు విలువను పలుచన చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో తనకిష్టమైన పాలకులను నిర్ణయించుకునేందుకు, తన మనోగతాన్ని వెల్లడి చేసేందుకు బలమైన ఆయుధం 'ఓటు'. లాటిన్ అమెరికా సాహితీ ప్రపంచంలో వేగుచుక్క అనదగ్గ కవి, రచయిత, జర్నలిస్టు, సామాజిక వేత్త అయిన జోస్ మార్టి (క్యూబా) మాటల్లో చెప్పాలంటే.. ''అన్నింటి కన్నా ఓటు అత్యంత సున్నితమైన విశ్వాసం. ఓటరు ప్రయోజనం మాత్రమే కాదు అతని జీవితం, పరువు, భవిష్యత్తు కూడా ఓటుతో ముడివడి ఉన్నాయి''

సమకాలీనం

''పైసల్ తీస్కొని ఓటేసుడా..? థూ... ఓటుకు పైసల్ తీస్కునుడంటే, పానం (జీవితం) అమ్ము కున్నట్టు లెక్క పటేలా! ఇజ్జత్ (పరువు) అమ్ము కున్నట్టు'' సరిగ్గా ముప్ఫై ఏళ్ల కింద... 1989లో జరిగిన ఎన్నికలప్పుడు మెదక్ జిల్లా మారుమూల గ్రామం యెనగండ్ల (మా ఊరు)లో 42 ఏళ్ల వయసున్న ఒక వ్యవసాయ దినకూలీ అన్నమాటలివి. దాన్ని అవగాహన అనాలో, చైతన్యం అనాలో, నైతికత అనాలో, మరేమనాలో తెలియదు. నాటి పరిస్థితిని నేటితో పోలిస్తే... ఎన్నో రెట్లు అవగాహన పెరిగింది. చైతన్యం రగిలింది. నైతికతే దిగజారింది. ఓటుకింత అనే లెక్కలో తమకు తక్కువ డబ్బులిచ్చారని ఒక వార్డు వాసులు ఓ రాజకీయ పార్టీ కార్యాలయం ముందు ధర్నాకు దిగే పరిస్థితులు నేడు నెలకొన్నాయి. 'ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో నాకు 11 కోట్ల రూపాయలు ఖర్చయింది' అని రాజ్యాంగ హోదా అనుభవిస్తున్న ఓ బడా నేత నిర్భయంగా ప్రకటించుకునే పరిస్థితి! ఓటర్ల జాబితా సవరించాకా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పేరిటే హైదరాబాద్‌లో రెండు ఓట్లున్న దుస్థితి! ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి ఎంతగా ప్రచారం చేస్తున్నామో, దాని విలువను దిగజార్చే పరిస్థితులు, పరిణామాలే అంతకు పలు రెట్లు అధికమవుతున్నాయి. తిలా పాపం తలా పిడికెడన్నట్టు ఆ పాతకానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యక్తులే కాక వ్యవస్థలూ కారణమవుతున్నాయి. ఏదో రీతిన ఓట్లు దండుకొని గద్దె నెక్కాలనే నాయకులు, ఓటరు జాబితాలు తారుమారు చేసే పార్టీ గణాలు, ఎన్నికల ప్రక్రియను ప్రహసనం చేసే అధికార యంత్రాంగం, ఓటు హక్కునే విస్మరిస్తున్న 'నాగరికులు', విడిగా–ఉమ్మడిగా వెల కట్టి అమ్ముకుంటున్న ఓటర్లు... ఇలా అన్ని వైపుల నుంచీ ఓటు విలువను దిగజారుస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థనే నవ్వుల పాల్జేస్తున్నారు. ప్రజాస్వామ్యం మీద, ఓటు విలువపైన విశ్వాసమున్న వారి నమ్మకం రోజు రోజుకు సడలిపోయేలా పరిస్థితులు విషమిస్తున్నాయి. దీనికి తోడు ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై తెలెత్తిన వివాదం గోటిచుట్టపై రోకటి పోటులా తయారయింది. మళ్లీ బ్యాలెట్‌కు వెళదామా? అనే చర్చ–మీమాంస పుట్టుకొస్తోంది. ఎన్నిసార్లు సవరణ ప్రక్రియ చేపట్టినా... తప్పుల తడిక ఓటరు జాబితాలు సగటు ఓటరును వెక్కిరిస్తున్నాయి. వ్యవస్థల్ని చెరబట్టిన రాజకీయ దళారీలు ఈ జాబితాల్ని కలుషితం చేస్తున్నారు. లక్షల దొంగ ఓట్లను చేర్చడం ద్వారానో, తమకు ఓటేయరనే భయంతో లక్షలాది అసలు పేర్లను తొలగిస్తూనో అరాచకం సృష్టిస్తున్నారు. ఈ నేర ప్రక్రియ క్రమంగా ప్రమాదకర స్థాయిలో వ్యవస్థీకృతమవుతోంది.

ఎన్నికల సంఘం వైపు వేలు

ప్రక్షాళన పేరిట రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓటర్ల జాబితాలను అత్యంత కలుషితం చేశారు. నిన్నటికి నిన్న అసెంబ్లీ ఎన్నికల ముంగిట తెలంగాణలో లక్షలాది ఓట్లు గల్లంతయ్యాయి. రేపు ఎన్నికలు జరగాల్సిన ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది దొంగ, నకిలీ ఓట్లొచ్చి జాబితాలో తిష్ట వేశాయి. ప్రక్షాళనకోసం వాడుతున్న సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టమే కాకుండా నిర్వహణ ప్రక్రియలోనూ అనేక లోపాలున్నాయి. వివిధ స్థాయిల్లో అధికార యంత్రాంగం అత్యంత నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా వ్యవహరించింది. జవాబుదారితనం లేకుండా యథేచ్ఛగా వ్యవహరించి ఓటరును నిమిత్తమాత్రుడిని చేసింది. ఓటు నమోదు, తొలగింపు ద్వారా సవరణ, ప్రక్షాళన ప్రక్రియల్లో ప్రజాప్రాతినిధ్య చట్టం కింద పౌరుల (ఓటర్లుగా)కున్న హక్కుల్ని నిర్దాక్షిణ్యంగా కాలరాసింది. తెలిసి కొంత, తెలియక ఇంకొంత నేడున్న దురుద్దేశపు రాజకీయ వ్యవస్థకు ఊడిగం చేస్తోంది. తెలంగాణలో చాలా చోట్ల జాబితాను ఓటర్లు తనిఖీ చేసినపుడు తమ పేరుంది, నంబరుంది... దాన్ని ఆధారం చేసుకొని తగిన గుర్తింపు కార్డుతో పోలింగ్ స్టేషన్‌కు వెళితే పేరు లేదు, ఓటే లేదు. ఓటేయకుండానే ఉస్సురంటూ వెనక్కి రావలసి వచ్చింది. 'అవును 22 లక్షల ఓట్లను తొలగించామ'ని ఎన్నికల ప్రధానాధికారే అంగీకరించిన వాస్తవం. వివాదమిప్పుడు న్యాయస్థానం పరిధికి చేరింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 52 లక్షల దొంగ/నకిలీ ఓట్లు రాష్ట్ర ఓటర్ల జాబితాలో చేరినట్టు ఓ నిపుణుల బృందం శాస్త్రీయంగా నిరూపించింది. ఎన్నికల సంఘం దీన్ని పాక్షికంగా అంగీకరించి, తిరిగి సవరణ చేపడితే... పెనంలోంచి పొయిలో పడ్డట్టు, ఇప్పుడు మరో 6 లక్షలు నకిలీ ఓట్లు అదనంగా వచ్చి చేరాయి. దాదాపు 25 లక్షల నకిలీ ఓట్లున్న మాట నిజమే అని రాష్ట్ర ఎన్నికల (కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల తప్పించిన) ముఖ్యాధికారే స్వయంగా అంగీకరించి ఆమేరకు ప్రకటన వెలువరించారు. ప్రపంచమే అచ్చెరువొందేలా ఓ పెద్ద ఎన్నికల ప్రక్రియని దశాబ్దాల తరబడి నిర్విఘ్నంగా, ప్రశాంతంగా కొనసాస్తూ కీర్తి కిరీటం దక్కించుకున్న భారత ఎన్నికల సంఘం ఈ వైఫల్యాలకు జవాబు చెప్పుకోవాల్సి వస్తోంది. సగటు ఓటరు ముందు దోషిగా నిలబడింది. ఓటరు జాబితాలోంచి పేర్లు తొలగిస్తున్నపుడు పాటించాల్సిన చట్టబద్ధ ప్రక్రియను తూతూ మంత్రంగా నిర్వహించారు. అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించకపోగా, ఎవరికి వారు ఆన్‌లైన్లో తనిఖీ చేసుకొని పేరు లేకుంటే, సంప్రదించి చేర్పించుకోవచ్చని బాధ్యతని ఓటరుపైకి నెట్టారు. వివిధ దశల్లో పాటించాల్సిన పారదర్శకతను మంటగలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కును హరించి అదనపు బాధ్యతను పౌరుల నెత్తిన రుద్దారు.

సవరించిన జాబితాల్లోనూ తప్పులా!

తప్పుడు, అక్రమ, రిపీట్, చెల్లని, దొంగ, బహుళ.... ఇలా వివిధ రూపాల్లో ఉన్న నకిలీ ఓట్లను తొలగించడానికి ఎన్నికల సంఘం అధికారులు వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ సమగ్రంగా లేదు. ఫలితంగా ఒకే వ్యక్తికి వివిధ పోలింగ్ స్టేషన్ల పరిధిలో పలు ఓట్లుంటున్నాయి. తండ్రి/భర్త పేరు మార్పుతో, ఇంటి నంబరు మార్పుతో, మగ–ఆడ అన్న లింగవైవిధ్యంతో ఒకరికే వేర్వేరు చోట్ల ఓట్లుంటున్నాయి. ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉండగలిగిన చిన్న ఇళ్లల్లో కూడా వందలాది ఓట్లుంటున్నాయి. ధ్రువీకరించడం తేలిగ్గా సాధ్యపడే కొన్ని తప్పిదాల్ని కూడా అధికార యంత్రాంగం ఇప్పుడు ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ పట్టుకోలేకపోతోంది. అది దుస్సాధ్యమైందేమి కాదు, ప్రయివేటు వ్యక్తులు, సంస్థల వద్ద కూడా లభ్యమయ్యే సాధారణ సాఫ్ట్‌వేర్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండు రాష్ట్రాల్లో ఓటర్లుగా ఉన్న ఒకే వ్యక్తిని కూడా ఇప్పుడు అధికారులు వాడుతున్న సాఫ్ట్‌వేర్ పట్టుకోలేకపోతోంది. ఫలితంగా రెండు, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల్లో ఓటున్న వారి సంఖ్య 18.5 లక్షలున్నట్టు ప్రయివేటు నిపుణుల సంస్థ తేల్చింది. ఓటరు ఐడి, ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, ఇంటి నంబరు, వయసు, జెండర్, పేరు వెనుక–ముందు... ఇలా పలు అంశాల్ని పరిగణనలోకి తీసుకొని లెక్కించినపుడు ఏపీలో పెద్ద సంఖ్య నకిలీ ఓట్లు దొరికాయి. 13 జిల్లాలు, 175 నియోజకవర్గాలు, 45,920 పోలింగ్ బూత్‌ల పరిధిలోఉన్న 3.6 కోట్ల ఓటర్ల సమాచారాన్ని తీసుకొని శాస్త్రీయంగా తనిఖీ–విశ్లేషణ చేసి మరో 34.17 లక్షల (వెరసి 52.67 లక్షల) నకిలీ ఓట్లున్నట్టు తేల్చారు. ఇదంతా బట్టబయలై జరిపిన తాజా సవరణ తర్వాత కూడా జాబితా తప్పుల తడికే! మళ్లీ ఒకే వ్యక్తి పేరిట నాలుగేసి ఓటరు కార్డులు కూడా జారీ చేశారు. సవరణ తర్వాత... అసలు ఇంటి నంబరు, నిజమైన వయసు, వాస్తవిక జెండర్‌తో సవరించిన పేర్లు జాబితాలోకి వచ్చాయి. అదే సమయంలో, పాత (నకిలీ) పేర్లూ తుది జాబితాలో కొనసాగుతున్నాయి. మీ ఇంట్లో, మీకు తెలియకుండా అయిదారుగురు పైశాచి (గోస్ట్) ఓటర్లుంటారు. ఇలాంటి 'బోగస్' ఓట్లు ఇంకెన్నో! మొత్తమ్మీద ఇదీ తెలుగునాట నెలకొన్న దుస్థితి!

పెత్తనం కోసం సంపద వికృత రూపం

అన్ని వ్యవస్థల మీద రాజకీయ పెత్తందారీతనం పెరిగి అటువైపు ఆకర్షణ అధికమైంది. ఏదో రూపంలో రాజకీయాధికారం దక్కించుకో వాలి. సంపద కలిగిన వారికి ఇదింకా మోజయింది. అడ్డదారి సంపాదన ఉన్న వారు వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసైనా అధికారం చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఓటరు జాబితాల్లో కూడికలు, తీసివేతలు చేస్తూ తమ ఓట్ల పంట పండించుకుంటున్నారు. లేదంటే, ప్రత్యర్థులకు ఓట్ల కరువు తీసుకువస్తున్నారు. మధ్యలో 'ఓటర్'ను బలిపశువు చేస్తున్నారు. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు ఈ పరిస్థితులకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిన్న ముగిసిన శాసనసభ ఎన్నికల్లో డబ్బు ఎంతగా ఖర్చయిందో అందరికీ తెలుసు. ఈ రోజు జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఎవరున్నా, తెరవెనుక ఆట నడుపుతున్న ఈ 'నికృష్ట సంపదే' వారిని ఆడిస్తోంది. పట్టణాలు, నగరాలు, పారిశ్రామిక వాడల నుంచి వనరులు గ్రామానికి వరదై పారుతున్నాయి. ఎక్కడికక్కడ డబ్బు, మద్యం ఏరులై ప్రవహిస్తోంది. ఓటుకింతని డబ్బు పెట్టి కొంటున్నారు. ఓటర్లనే కాదు, గంపగుత్తగా కుటుంబాలను, వాడలను వశపరచుకుంటున్నారు. ఏదో రూపంలో ప్రలోభపెడుతున్నారు. లొంగని చోట బయపెడుతున్నారు. పై స్థాయి నుంచే, ఓటర్లయిన పౌరుల చేతికి నికరంగా డబ్బు వచ్చేలా 'పథకాలు' పన్ని వేర్వేరు స్కీముల్లో వారిని ఇరికిస్తున్నారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే 'ఓటరు' స్వేచ్ఛను ఆట వస్తువు చేస్తున్నారు. కోరిన రీతిన వంచుతున్నారు. ఓటు విలువను పలుచన చేస్తున్నారు. ఓటరు చైతన్యమొకటే దీనికి విరుగుడు. ఓటరు గట్టిగా నిలబడాలి. డబ్బు పంచినా, ప్రలోభపెట్టినా తన 'ఓటు' హక్కు భంగపోకుండా స్వతంత్రంగా వ్యవహరించాలి. స్వేచ్ఛగా ఓటేయాలి. బాహ్య ప్రేరకాలెలా ఉన్నా... స్వేచ్ఛగా ఓటేసే తన హక్కుని అవి ప్రభావితం చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో తనకిష్టమైన పాలకులను నిర్ణ యించుకునేందుకు, తన మనోగతాన్ని వెల్లడి చేసేందుకు బలమైన ఆయుధం 'ఓటు'. లాటిన్ అమెరికా సాహితీ ప్రపంచంలో వేగుచుక్క అనదగ్గ కవి, రచయిత, జర్నలిస్టు, సామాజిక వేత్త అయిన జోస్ మార్టి (క్యూబా) మాటలతో ముగిస్తా. ''అన్నింటి కన్నా ఓటు అత్యంత సున్నితమైన విశ్వాసం. ఓటరు ప్రయోజనం మాత్రమే కాదు అతని జీవితం, పరువు, భవిష్యత్తు కూడా ఓటుతో ముడివడి ఉన్నాయి''

(నేడు జాతీయ ఓటరు దినోత్సవం)

ఈ-మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బడ్జెట్



"ఎన్నికలకు కొన్ని నెలల ముందు బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టడం అన్ని నియమాలకు, పార్లమెంటరీ సాంప్రదాయాలకు విరుద్ధం. ఐదేళ్లపాటు కొనసాగే ప్రభుత్వ పదవీకాలం ఈ ఏడాది మే నెలతో ముగుస్తుంది. ప్రభుత్వం ఐదు పూర్తి స్థాయి బడ్జెట్లను, ఒక ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టగలదు. మూడు నెలల గడువు పెట్టుకుని ఏకంగా సంవత్సరానికి సరిపడ బడ్జెట్ ప్రవేశపెట్టడం సరికాదు"

– ఆనంద్ శర్మ, రాజ్యసభ ఎంపీ

జపం



"ప్రియాంకా గాంధీ గేమ్ చేంజర్ కానట్టయితే పొద్దుటి నుండీ అన్ని టీవీ చానళ్లూ, బీజేపీ ప్రతినిధులు ఆమె పేరు ఎందుకు జపిస్తున్నట్టు? కనీసం ఆమె ప్రస్తుతం మన దేశంలో లేదు, ఇప్పటి వరకు ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అయినా, అందరూ ఎందుకంత బెంబేలెత్తుతున్నారు?"

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ప్రజా గొంతు



"నిన్న రాత్రి అనేక మందిని కలిశా. 'మేం నిన్ను ఎన్నుకుంటాం. మళ్లీ మా దగ్గరకు వచ్చి మా అవసరాలు తీరుస్తావని మాకు తెలుసు' అని ఓ తల్లి అరిచి చెప్పింది. ఎంతో ప్రేమ, నమ్మకం.. మరెంతో ఆశ. పార్లమెంట్‌లో ప్రజా గొంతు వినిపించాలన్న నా సంకల్పం రోజురోజుకూ బలోపేతం అవుతోంది"

– ప్రకాష్ రాజ్, సినీ నటుడు

భవిష్యత్



"ఐక్యతా విగ్రహం కోసం మూడు వేల కోట్లు, కుంభ మేళాకేమో రూ. 4,236 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వానికి, చిన్నారులకు వేయాల్సిన పోలియో వ్యాక్సిన్ కోసం డబ్బులు కేటాయించడానికి వచ్చేసరికి రూ. 280 కోట్ల లోటు బడ్జెట్ గుర్తొస్తుంది. ఇక చిన్నారుల భవిష్యత్‌ను కాపాడేదెవరు?"

– జిగ్నేష్ మేవానీ, ఎమ్మెల్యే

గోరక్షణ



"ఉజ్వలమైన మన ప్రజాస్వామ్య దేశంలో ఇది కేవలం మరో మామూలు రోజు మాత్రమే. హరియాణాలోని రోహ్‌తక్ సమీపంలో భలౌట్ గ్రామం దగ్గర పశువులను విక్రయించే నౌషద్ మహ్మద్ అనే 24 ఏళ్ల కుర్రాడిని గోరక్షకులు రెండు గంటలపాటు చితకబాదారు. రక్తమోడుతూ, ఒళ్లంతా గాయాలతో ఉన్న అతడిని పోలీసులు ఆసుపత్రికి తీసుకుపోకుండా, స్టేషన్‌కు తీసుకువెళ్లి గొలుసుతో కట్టిపడేశారు"

– రాణా అయూబ్, జర్నలిస్ట్

ఓటరు చేతిలో వజ్రాయుధం

ఓటు అనే రెండక్షరాలకు ప్రపంచ గతిని మార్చే శక్తి ఉంది. ఓటు వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తిస్తుంది, వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది. రాజ కీయ పార్టీల జాతకాలు మార్చాలన్నా.. భ్రష్టుపట్టిన వ్యవస్థకు చరమ గీతం పాడాలన్నా వజ్రాయుధం ఇదే. మంచి నాయకత్వం లేకుండా మంచి సమాజం ఏర్పడదు. వయోజనులైన ప్రతి వ్యక్తికీ ఎలాంటి భేదభావాలు లేకుండా ఓటు హక్కును కల్పించింది మన రాజ్యాంగం. ప్రజల గళం వినిపించాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటుకు నేతల రాతనే కాదు.. దేశ తలరాతనే మార్చే సత్తా ఉంది. కానీ ఓటు విలువ ఎంత మందికి తెలుసు అన్నదే పెద్ద ప్రశ్న.

ఓటు ఆవశ్యకత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకున్న పాత్ర గురించి యువ ఓటర్లను చైతన్యం చేయడంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటైన జనవరి 25ని జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రజాస్వామ్య పరిరక్షణకోసం నా వంతు కర్తవ్యాన్ని గుర్తించి ఉన్నతమైన నాయకున్ని ఎన్నుకుంటానని ఓటర్లతో ప్రమాణం కూడా చేయిస్తున్నది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష, ఆర్థిక భేదభావం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు ఓటు హక్కు పొందే అవకాశం భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 కల్పిస్తున్నది. 125 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో సుమారు 100 కోట్ల ఓటర్లు ఉన్నారు. ఇందులో కేవలం 50 కోట్ల లోపు ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అంటే మనమంతా సిగ్గుపడాల్సిన విషయం.

ఐదేళ్లకు ఒకసారి వచ్చినా మన జీవితాలను, తలరాతను మార్చేవి ఎన్నికలు. సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఓటు. ఓటు హక్కును యువత బాధ్యతగా వినియోగించుకొని సమాజానికి మేలు చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. ఎపుడూ నిరుత్సాహపడవద్దు. ఒక ఓటు దేశ గమనాన్నే మారుస్తుంది. యువతలో చైతన్యం వచ్చి.. ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకున్న నాడే దేశాభివృద్ధి సాధ్యం. పరిపాలన సజావుగా సాగాలన్నా, సరైన నేతలకు పగ్గాలు ఇవ్వాలన్నా అది ఓటు ద్వారానే సాధ్యమన్న సత్యాన్ని ఓటరు దినోత్సవం నాడైనా అందరూ మననం చేసుకోవాలి.

(నేడు జాతీయ ఓటరు దినోత్సవం)

కాళంరాజు వేణుగోపాల్, మార్కాపురం । 81062 04412

ఈవీఎంల హ్యాకింగ్‌పై సాక్ష్యాల్లేని ఆరోపణలు

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

ఎన్నికలలో రిగ్గింగ్ చేయడంవల్లనే కొన్నిపార్టీలకు సుడిగాలి విజయాలు సాధ్యమవుతున్నాయని ఏదో ఒక మూల అనుమానం చాలామందికి వస్తూనే ఉంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) వచ్చిన తరువాత ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేకుండా పోతున్నారు. ఎంపీ సుబ్రమణ్యస్వామితో కలిసి హైదరాబాద్‌కు చెందిన వి.వి.రావు ఈవీఎం లోపాలపై ఉద్యమం నిర్మించే కార్యక్రమం చేపట్టారు. వీరి కృషి వల్లే వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ప్రవేశ పెట్టారనీ అంటారు.

ఎన్నికల మోసాలను పేపర్ ఆడిట్ ట్రయల్ ద్వారా అరికట్టవచ్చుననీ అంటున్నారు. కాగితం లేని ఈవీఎంల కన్నా పరీక్షించే ఆస్కారం ఉన్న వీవీ ప్యాట్ ఈవీఎంలు చాలావరకు నయం. ఇదివరకు ఓట్ల సంఖ్యలో తేడా వస్తే మళ్లీ ఓట్లను లెక్కించే వీలుండేది. కానీ సైబర్ డబ్బాలలో 'స్టోర్డ్ ఓట్లు' అంటే పడి ఉన్న ఓట్లను ఎన్నిసారు లెక్కించినా ప్రయోజనం లేదు. కనుక ఈవీఎంను సైబర్ మాయల పేటిక అని అనుకోవచ్చు. మీట నొక్కితే ఏం జరుగుతుందో ఎవరికీ కనిపించదు. వీవీప్యాట్ ఉంటే మామూలుగా ఓట్లను మళ్లీ మళ్లీ లెక్కించినట్టే వీటిని కూడా లెక్కించవచ్చు అన్నారు గానీ, ఇటీవలి తెలంగాణ ఎన్ని కల్లో మళ్లీ లెక్కించమని అడిగితే ఎన్నికల సంఘం కుదరదని చెప్పేసింది.

ఎవరో కావాలని కుట్ర చేయకపోయినా, చెడిపోయినందుకు కూడా యంత్రం సరిగ్గా పనిచేయకపోవచ్చు. అందువల్ల కొందరు గెలవచ్చు మరికొందరు ఘోరంగా ఓడిపోనూవచ్చు. ఈ అనుమానాస్పదమైన వాతావరణంలో లండన్‌లో ఒకాయన తాను సయ్యద్ షుజా, సైబర్ నిపుణుడినని చెప్పుకుంటూ ఈవీఎంల లోగుట్టు విప్పి చూపిస్తానని సవాలు విసిరి జర్నలిస్టుల సమావేశం ఏర్పాటు చేశాడు. కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ప్రత్యేకంగా లండన్ వెళ్లి విలేకరులకు వీడియో ప్రదర్శన నిర్వహించే వేదిక మీద కూర్చున్నారు. షుజా లండన్ రాలేదు. కాలిఫోర్నియా నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్నాడు. సగం ముఖం దాచుకుని అంతగా వెలుగు లేని మసకమసక గదిలో కూచుని షుజా చాలా తీవ్రమైన ఆరోపణలు చేశారు. కానీ తన ప్రదర్శనలో విఫలమైనాడని పత్రికలు వెల్లడించాయి. షుజా ఆరోపణల తీవ్రత ఎంత గాఢంగా ఉందంటే దేన్ని నమ్మాలో తెలియక జనం గందరగోళంలో పడతారు. షుజా లేవనెత్తిన సంచలన భయానక ఆరోపణలు కొన్ని:

1. బీజేపీ ప్రభంజనం వీచిన 2014 లోక్‌సభ ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్ జరిగింది. *2.* ఈవీఎం టాంపరింగ్ వల్ల కాంగ్రెస్ 201 సీట్లను కోల్పోయింది. *3.* మోదీ కేబినెట్‌లో చేరిన గోపీనాథ్ ముండేకు 2014 రిగ్గింగ్ ఏ విధంగా జరిగిందో తెలుసు. అందుకే మంత్రి అయిన కొద్దిరోజులకే చనిపోయాడు. ఈ రహస్యం తెలుసుకునకనే ఆయన్ను చంపేశారు. *4.* ముండే మరణ ఘటనపైన ఎఫ్ఐఆర్ దాఖలు చేయడానికి ప్రయత్నించినందుకే ఎన్ఐఏ ఆఫీసర్ తాంజిల్ అహ్మద్‌ను చంపేశారు. *5.* కాంగ్రెస్ లీడర్ కపిల్ సిబల్ 2014 ఎన్నికలలో బీజేపీని గెలిపించేందుకు రిగ్గింగ్ చేయమని అడిగారు. *6.* 2015లో ఢిల్లీ ఎన్నికలలో ఈవీఎం రిగ్గింగ్‌ను షుజా అనుచరులు నిరోధించడం వల్లనే ఆప్ పార్టీ 70లో 67 స్థానాలను గెలిచింది. *7.* మధ్యప్రదేశ్, రాజస్తాన్ ఛత్తీస్‌గఢ్ ఎన్నికలలో బీజేపీ రిగ్గింగ్ ప్రయత్నాలను షుజా నిరోధించడం వల్లనే ఆ రాష్ట్రాలలో బీజేపీ గెలవలేకపోయింది. *8.* బీజేపీ ఈవీఎం హాక్ చేయడానికి రిలయన్స్ కమ్యూనికేషన్ వారు సహకరించారు. *9.* గౌరీ లంకేశ్ ఈ రిగ్గింగ్ కథనాన్ని ప్రచురించడానికి సిద్ధపడ్డారు. ఈ విషయమై ఆర్టీఐ కూడా వేశారు. అందుకే హత్యకు గురయ్యారు.

ఇందులో ఏ ఆరోపణలకు కూడా షుజా సాక్ష్యాలు చూపలేదు. షుజా మిగిలిన ఆరోపణలకు రుజువులు ఇచ్చినా ఇవ్వలేకపోయినా, కనీసం హాకింగ్ సాధ్యమని రుజువు చేస్తారనుకున్నారు. అక్కడా షుజా విఫలమైపోయారు. తాను పనిచేశానని ఆయన చెప్పుకున్న సంస్థలలో ఏ సంస్థా దాన్ని ధ్రువీకరించలేదు.


ఎన్నికల సంఘం వెంటనే ఈ ఆరోపణలు ఖండించింది. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎన్నికల సంఘం చేతులు కలపడం వల్లనే రిగ్గింగ్ సాధ్యమైందని ఆరోపణ చేసినందున వారు అధికారికంగా ఖండించడం సమంజసమే అనిపించినా, అసలు రిగ్గింగ్ జరిగే అవకాశం ఉందా లేదా అని ప్రజలకు విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఈ ఆరోపణల్లో లవలేశమైనా నిజం ఉండొచ్చునని అనుమానించే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత, ఈవీఎం ద్వారా ఎన్నికల ప్రజాస్వామ్యం మీద విశ్వాసం కలిగించే బాధ్యత ఎన్నికల సంఘం మీదే ఉంది.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర మాజీ సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

త్యాగరాజ స్వామి

త్యాగరాజ స్వామి సాటిలేని గానకళా కోవిదుడనీ, స్వరార్ణవపు లోతులు తెలిసిన గజ ఈతగాడనీ గుర్తింపు, గౌరవమూ, భక్త్యాదరాలూ తెలుగు రాష్ట్రాలలో కంటే, బయటే ఎక్కువయితే కావచ్చు. నిధి నిక్షేపాల కంటే రాముడి సన్నిధి సేవలే ఎక్కువ ఆనందప్రదాలని తెలుసుకొని అకుంఠిత దీక్షతో 96 కోట్ల తారకమంత్ర జపం చేసిన సాధకుడి సాధనలను అనుసరిద్దామన్న ఆదర్శం అణగారిపోతే పోయి ఉండవచ్చు. కనీసం, తన కీర్తనల ద్వారా తెలుగు తెలియని వారికి కూడా తెలుగు భాష మీద అపారమైన గౌరవాదరాలు ఆర్జించి పెట్టినందుకన్నా తెలుగు తెలిసిన వారు ఆ నాద యోగికి కృతజ్ఞులుగా ఉండాలి. దేశ విదేశాలలో పుష్య బహుళ పంచమి (జనవరి 25, 2019) నాడు జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో తమకు చేతనయిన పాలు -కనీసం టీవీ ప్రేక్షకులుగానో, రేడియో శ్రోతలుగానో- పంచు కోవటం భావ్యం.

ప్రకాశం జిల్లా కంబం ప్రాంతం నుంచి చోళ సీమలో తంజావూరుకు వలస వెళ్లిన కాకర్ల రామ బ్రహ్మం, సీతమ్మ దంపతులకు 1967, మే 4వ తేదీన తిరువారూర్ గ్రామంలో త్యాగయ్య జన్మించారు. తిరువారూరు గ్రామానికి అట్టే దూరంలేని


జ్యోతిర్మయం

తిరువయ్యూరు గ్రామంలో. వారసులు లేక త్యాగయ్య వంశం అంతరించింది. అయితే ఆయన శిష్య పరంపర ద్వారా ఆయన యశస్సూ, ఆయన కీర్తనలూ చిరస్థాయిగా నిలిచిపోయాయి.

త్యాగరాజ స్వామికి సంగీత విద్యలో గురువు శొంఠి వెంకట రమణయ్య. రాజ సత్కారాలు పొందేందుకు అవకాశాలు ఎన్ని వచ్చినా త్యాగరాజు వాటిని పట్టించుకోలేదు. శ్రీరాముడి నిరంతర ధ్యానంలో కాలం గడిపారు. అనర్ఘ రత్నాల వంటి వేలాది కీర్తనలు రచించి, పాడి వాటితోనే శ్రీరామచంద్రమూర్తిని అలంకరించారు. ఆయన కీర్తనలు పాడటమేగానీ రాయలేదు. ఆయన శిష్యులు వాటిని విని, నేర్చుకొని వ్యాప్తి చేయటమే. అందుకే 24,000 కృతులలో ఇప్పుడు దాదాపు 850 మాత్రమే లభిస్తున్నాయి. ఈ 800 కృతులతోనే 200 ఏళ్లుగా ఎన్నో తరాల కర్ణాటక సంగీత విద్వాంసులు తమ విద్వత్తునూ, కళనూ ప్రదర్శించి, సంగీత రసజ్ఞులను మెప్పించి కీర్తి పొందుతున్నారు.

అందుకే త్యాగరాజ స్వామి బ్రహ్మైక్యం చెందిన పుష్య బహుళ పంచమి తిథి (1847) రోజున సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులందరూ వేలాది సంఖ్యలో తిరువయ్యూరులో త్యాగరాజ స్వామి సమాధి ముందు ఆయన రచించిన కీర్తనలు పాడుతూ, పెద్ద ఎత్తున ఆరాధనోత్సవం జరుపుతారు. అందరు మహా విద్వాంసులు కలిసి ఆ సందర్భంగా అయ్యవారు రచించిన పంచరత్న కీర్తనలు పాడటం శరీరం పులకరింపజేసే సన్నివేశం. ఈ గౌరవం ఈ వసుధలో ఎవరికీ లేనిది!

– ఎం. మారుతి శాస్త్రి

ఓటు మీ హక్కు .. వినియోగించుకోండి

- రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు లేఖలు
- ప్రజా స్పందన బాగుంది..
- ఎపిక్ కార్డులు రాలేదని ఫిర్యాదులు
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్



సాక్షి, హైదరాబాద్ : ఓటరు జాబితాలో పేరు నమోదు.. పొరపాట్ల సవరణ.. చిరునామా మార్పు తదితరాల గురించి ఎంతగా ప్రచారం చేస్తున్నా అది ప్రజలందరికీ చేరడం లేదని, వీటిపై వారందరికీ అర్థమయ్యేలా సరళమైన తెలుగుభాషలో ఓటరు నమోదుపై చైతన్యం కలిగేలా ఇంటింటికీ పోస్టుకార్డుల పంపిణీని చేపట్టామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. అంతే కాకుండా తమవైపు నుంచి ప్రజలకు చేరవేస్తున్న సమాచారంతో పాటు వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తెలుసుకునేందుకు కూడా ఉపకరిస్తుందని సీఈఓ చిరునామాతో రిప్లయ్ పోస్టుకార్డుతో కూడిన లేఖలను పంపామన్నారు. 'ఓటు మీ హక్కు.. ఓటు వేయడం మీ బాధ్యత' అంటూ రజత్‌కుమార్ స్వీయ సంతకంతో కూడిన లేఖల్ని రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వే మేరకు రాష్ట్రంలోని కోటి ఐదు లక్షల కుటుంబాలకు చేరేలా వీటిని పంపించినట్లు తెలిపారు. సంక్రాంతికన్నా ముందుగానే పంపాలనుకున్నప్పటికీ, ఆలోగా అన్ని పోస్టు కార్డుల్ని పోస్టల్‌శాఖ తమకు సమకూర్చలేకపోయిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు పోయిందని, ఓటు వేయలేకపోయామని పలువురు వేదన వ్యక్తం చేయడంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఏ ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు ఈ లేఖలు ఉపకరించగలవన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ ఆలోచన రావడానికి కారణం.. ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి గురువారం రజత్‌కుమార్ 'సాక్షి'కి వెల్లడించారు.

ఓటర్ల ఇళ్ల వద్దకు బూత్‌స్థాయి అధికారులు

రాష్ట్రంలోనే కాకుండా ముఖ్యంగా నగరంలో బీఎల్‌ఓలు (బూత్‌స్థాయి అధికారులు) తమ ఇళ్లకు రాలేదని, ఇంటింటికీ సర్వే చేయకుండానే ఓట్లు తొలగించారని పలువురు తమ దృష్టికి తేవడంతో ఈ రకంగానైనా బీఎల్‌ఓలు ప్రతీ ఇంటికీ వెళ్తారనే ఉద్దేశంతోనూ తిరుగు పోస్టుకార్డుతో కూడిన లేఖల పంపిణీని బీఎల్‌ఓల ద్వారా చేపట్టామన్నారు.ప్రతి ఇంటికి వెళ్లి లేఖను ఇవ్వడంతోపాటు వారి నుంచి అకనాలెడ్జ్‌మెంట్‌కూడా తీసుకోవాల్సి ఉన్నందున కచ్చితంగా వెళతారనే ధీమా వ్యక్తం చేశారు. ఈ రకంగానైనా బీఎల్‌ఓలకు, ఓటర్లకు మధ్య సంబంధం ఏర్పడుతుందన్నారు. తమ లక్ష్యాన్ని నూరు శాతం పూర్తిచేసేవారికి ప్రోత్సాహక బహుమతులిచ్చే ఆలోచన ఉందని చెప్పారు.

వివరాలతో లేఖలు..

ఓటరు నమోదుపై చాలామందికి సందేహాలున్నాయని, వాటిని నివృత్తి చేసేందుకూ, వారికి సులభంగా అర్థమయ్యేలా కొత్తగా పేరు నమోదు చేసుకోవాలంటే ఏ ఫారం నింపాలి.. చిరునామా మారితే ఏ ఫారం భర్తీచేయాలి.. పొరపాట్ల సవరణకు ఏ ఫారం వినియోగించాలో లేఖలో వివరించామన్నారు. ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేయవచ్చో కూడా తెలిపామన్నారు. పోలింగ్‌కు ముందు నామినేషన్ల గడువు వరకు ఓటరు జాబితాలో ఎప్పుడైనా పేరు నమోదు చేసుకోవచ్చనని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మాత్రం ఇప్పుడే సరిచూసుకోవాలని రజత్‌కుమార్ ప్రజలను కోరారు. ఎన్నికలకు ఒకటి రెండు రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే ఓటు వేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.



లేఖలకు ఓటర్ల నుంచి ధన్యవాదాలు

లేఖలు పంపినందుకు ధన్యవాదాలు అంటూ ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, తాను దాదాపు వంద లేఖల్ని చదివానని తెలిపారు. కొందరు ఖాళీ రిప్లయ్ కార్డులు కూడా పంపారని, చాలామంది ఎపిక్‌కార్డులు రాలేదని ఫిర్యాదు చేశారన్నారు. ప్రకటనల కోసం చేస్తున్న ఖర్చులో భాగంగానే ఇంటింటికీ పోస్టుకార్డు పంపినట్లు తెలిపారు. వాట్సాప్ మెసేజ్‌లు, ఎస్‌ఎంఎస్‌ల గురించి కూడా ప్రస్తావన వచ్చినప్పటికీ, బీఎల్‌ఓలు ప్రజలను నేరుగా కలుసుకునేందుకు పోస్టుకార్డుల్ని పంపిణీ చేశామన్నారు. ఉర్దూ చదివే వారికోసం ఉర్దూలోనూ ఈ లేఖలు పంపించనున్నట్లు తెలిపారు.

ఓటు నమోదుపై ప్రజలకు ఏమాత్రం అవగాహన లేదనడం కూడా సరికాదని, అసెంబ్లీ ఎన్నికల ముందు రెండునెలల్లో ఇరవై లక్షలమందికి పైగా నమోదు చేసుకున్నారని చెప్పారు.దివ్యాంగులు, థర్డ్‌జెండర్‌లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు చేపట్టిన కార్యక్రమాలు అసెంబ్లీ పోలింగ్‌లో మంచి ఫలితమిచ్చాయని చెప్పారు.

ఇక బస్టాండ్‌లో సినిమాలు

- మొత్తం 23 ప్రాంతాల్లో మినీ థియేటర్లు
- 15 ప్రాంతాల్లో ఏర్పాటుకు టీఎఫ్‌డీసీ సుముఖం
- ఏటా రూ. 3.11 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా
- అధ్యయనానికి విజయవాడ వెళ్లనున్న ఆర్టీసీ అధికారులు



విజయవాడ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మినీ థియేటర్

సాక్షి, హైదరాబాద్: బస్టాండ్లలో వివిధ కారణాల వల్ల వేచి ఉండాల్సిన ప్రయాణికులకు శుభవార్త. తమ ప్రాంగణాల్లో వినోదాన్ని అందించేందుకు మినీ థియేటర్లు నిర్మించాలని తెలంగాణ ఆర్టీసీ నిర్ణయించింది. ఆర్టీసీ ప్రతిపాదనకు తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ముందుకు వచ్చింది. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయి, టికెట్టేతర ఆదాయం కోసం వివిధ మార్గాలు అన్వేషిస్తోన్న ఆర్టీసీకి ఈ ఆలోచన కాసులు కురిపిస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. తాజాగా మినీ థియేటర్ల నిర్మాణానికి చకచకా అడుగులు వేస్తోంది.

త్వరలో విజయవాడకు బృందం..

టికెట్టేతర ఆదాయం పెంపులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలను వేలం వేసిన ఆర్టీసీ, ఇకపై మినీ థియేటర్లను ఏర్పాటు చేయనుందని సంస్థ తాత్కాలిక ఎండీ సునీల్ శర్మ వెల్లడించారు. ఇప్పటికే ఇందుకోసం ఆర్టీసీకి చెందిన 23 స్థలాలను గుర్తించామని, ఇందులో 15 ప్రాంగణాల్లో మినీ థియేటర్లు నిర్మించేందుకు టీఎఫ్‌డీసీ ముందుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ థియేటర్ల ద్వారా ఏటా రూ. 3.11 కోట్ల ఆదాయం సమకూరనుందని అంచనా వేస్తున్నామన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పండిట్‌నెహ్రూ బస్టాండ్‌లో ఇలాంటి మినీ థియేటర్ నడుస్తోంది. ఈ మినీ థియేటర్ నిర్వహణ పనితీరును పరిశీలించేందుకు త్వరలోనే ఈడీ పురుషోత్తమ్ నేతృత్వంలోని బృందం విజయవాడ వెళుతుందని ఆయన వివరించారు.

ఏయే ప్రాంతాల్లో..

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కొల్లూరు, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, ధర్మపురి, హుజూరాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, జడ్చర్ల, షాద్‌నగర్, నర్సాపూర్, సంగారెడ్డి, నాగార్జున సాగర్, కోదాడ, ఆర్మూర్, బోధన్, చేవెళ్ల, తాండూరు, వికారాబాద్, స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ఈ-కామర్స్‌లోకి 'గిరిజన' బ్రాండ్స్

- గిరిపుత్రుల ఉత్పత్తులన్నీ ఇక అమెజాన్ ద్వారా అమ్మకాలు
- ఒప్పందం కుదుర్చుకోనున్న గిరిజన సంక్షేమ శాఖ

సాక్షి, హైదరాబాద్: గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ఉత్పత్తులన్నీ వినియోగదారుల ముంగిట్లోకి తెచ్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ కార్యాలయాల వరకే పరిమితమైన అమ్మకాలను, ఆన్‌లైన్‌కు విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు ఈ-కామర్స్‌తో గిరిజన సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకోనుంది. దీంతో రెండ్రోజుల్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

సాంప్రదాయ ఉత్పత్తుల పేరుతో..

జీసీసీ ద్వారా తేనె, సబ్బులు, షాంపూలు, కారం, పసుపు, మసాలా పొడులు విక్రయిస్తున్నారు. వీటికి సంబంధించి ఐటీడీఏ పరిధిలో పలు చోట్ల ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఉత్పత్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా గిరిజనుల సంస్కృతులకు సంబంధించి చిత్రకళను అభివృద్ధి చేస్తున్నారు. ఔత్సాహికులను గుర్తించి వారితో పెయింటింగ్స్ వేయించి విక్రయించే వెసులుబాటు కల్పించారు. తాజాగా జీసీసీ ఉత్పత్తులతోపాటు గిరిజన సాంస్కృతిక చిత్రాలను కూడా అమెజాన్ వెబ్‌సైట్ ద్వారా విక్రయించనున్నారు. వీటిని ట్రైబల్ ట్రెడిషన్ ప్రొడక్ట్స్ పేరిట ప్రత్యేకంగా వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు.

పరిశీలన పూర్తి...

అమెజాన్‌తో అవగాహన నేపథ్యంలో కంపెనీ అధికారులు పలుమార్లు జీసీసీని సందర్శించారు. అదేవిధంగా పెయింటింగ్స్‌ను సైతం పరిశీలించారు. అవగాహన కుదిరితే ఉత్పత్తుల్లో శాంపిల్‌ను గోడౌన్‌లో అందుబాటులో పెట్టాల్సి ఉంటుంది. మిగతా వాటిని డిమాండ్‌కు తగినట్లు సరఫరా చేయాలి. అమెజాన్ వెబ్‌సైట్‌లో గిరిజన సంక్షేమ శాఖ సెల్లర్ కేటగిరీలో కనిపిస్తుంది. ప్రస్తుతం జీసీసీ నుంచి వచ్చే తేనెతో పాటు మిగతా వాటికి మంచి డిమాండ్ ఉంది. దీంతో వార్షిక టర్నోవర్ రూ.200 కోట్లకు చేరింది. ఆన్‌లైన్ విక్రయాలు మొదలుపెడితే టర్నోవర్ రెట్టింపు అయ్యే అవకాశాలున్నట్లు సంక్షేమ శాఖ అంచనా వేస్తోంది. అవగాహన ప్రక్రియ పూర్తయితే వచ్చేనెల మొదటి వారం నుంచి గిరిజన ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి.

అక్రమ లే అవుట్‌లకు అనుమతిస్తే కొరడా

పంచాయతీ పాలకవర్గాన్ని రద్దు చేసేలా చట్టంలో నిబంధనలు

సాక్షి, హైదరాబాద్: నిర్దేశిత నిబంధనల ప్రకారం లేని లే అవుట్‌లకు అనుమతి ఇస్తే గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని రద్దు చేసే నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టంలో చేర్చింది. నగరాలు, పట్టణాల శివారుల్లోని గ్రామాల్లో అక్రమ లే అవుట్లు విచ్చలవిడిగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం 2018 మార్చి 31 వరకు ఉండే లే అవుట్ల జాబితాలను కొత్త పాలకవర్గాలు ప్రకటించి.. అనంతరం వాటిపై చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోని వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చేందుకు ముందుగా వ్యవసాయ భూమి చట్టం కింద రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇలా భూ మార్పిడి ప్రక్రియ తర్వాతే లే అవుట్ ప్రతిపాదన దరఖాస్తును గ్రామపంచాయతీలకు ఇవ్వాలి. గ్రామపంచాయతీలు దీన్ని ఏడు రోజుల్లో జిల్లా టౌన్, కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అనుమతి జారీ చేసే సంస్థలకు పంపాలి. ఈ గడువులోపు గ్రామపంచాయతీ నిర్ణయం తీసుకోకున్నా అనుమతి ఇచ్చినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని చట్టంలో పేర్కొన్నారు. లే అవుట్లలో డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు వ్యవస్థ ఏర్పాటు చేయాలని సాంకేతిక కమిటీ లే అవుట్ నిర్వాహకులకు చెబుతుంది. అనంతరం లే అవుట్ పరిధిలోని సామూహిక స్థలాలు, రోడ్లను గ్రామపంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలి. అన్నింటినీ పరిశీలించి డీటీసీపీ నెలలోపు ఆమోదించాల్సి ఉంటుంది. లే అవుట్ నిర్వాహకులు విక్రయానికి ప్రతిపాదించే మొత్తం స్థలంలో 15 శాతాన్ని గ్రామపంచాయతీకి తనఖా పెట్టాలి. అయితే గ్రామ కంఠం స్థలానికి ఈ నిబంధనలు వర్తించవు. లే అవుట్‌లో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ఎవరికైనా విక్రయిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. డీటీసీపీ కమిటీ ఆదేశాలు లేకుండా లే అవుట్‌కు అనుమతి ఇస్తే గ్రామపంచాయతీ పాలకవర్గం రద్దవుతుంది.

చట్టంలో క్రమబద్ధీకరణ అంశం..

అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ అంశాన్నీ చట్టంలో పొందుపరిచారు. లే అవుట్‌లో నిర్దేశిత అవసరాలకు అనుగుణంగా వసతులు లేనప్పుడు అది అక్రమం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వసతుల కల్పనకు అవకాశం కల్పిస్తారు. నిబంధనలకు అనుగుణంగా వసతులు కల్పించిన తర్వాత లే అవుట్లను క్రమబద్ధీకరిస్తారు. అయితే లే అవుట్‌కు వినియోగించే స్థలానికి అప్పటి మార్కెట్ విలువతో పోల్చితే పది శాతం మొత్తాన్ని గ్రామపంచాయతీకి చెల్లిస్తే క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఉంటుంది. అక్రమ లే అవుట్‌లో వసతులు కల్పించే విషయంలో విఫలమైతే దాన్ని అక్రమంగానే నిర్ధారిస్తారు. ఎంత మొత్తం చెల్లించినా దీన్ని క్రమబద్ధీకరించే అవకాశం ఉండదు.

'ఆ అధ్యాపకులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలి'

హైదరాబాద్: శ్రీ చైతన్య, నారాయణ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఇంక్రిమెంట్‌లతోపాటు అరియర్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం డిమాండ్ చేసింది. లేకుంటే ఫిబ్రవరి 1 నుంచి సత్యాగ్రహ దీక్షలు చేస్తామని హెచ్చరించింది. గురువారం హైదర్‌గూడలో టీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీ మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఆ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ అధ్యాపకులకు జీతాలు తక్కువగా ఇస్తున్నారని ఆరోపించారు. పీహెచ్‌డీ చేసిన అధ్యాపకులకు జీతం రూ.7వేలుగా ఉండేదని, తమ సంఘం పోరాటంతో ఏటా ఇంక్రిమెంట్ ఇస్తామని చెప్పి మాటతప్పాయని మండిపడ్డారు. ఈ రెండు సంస్థల్లో లైంగిక, మానసిక వేధింపులు చోటుచేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అధ్యాపకులు తమ యాజమాన్యాలకు భయపడకుండా ఏకతాటిపైకి వచ్చి ఈ దీక్షలను విజయవంతం చేయాలన్నారు.

నౌహీరా షేక్‌పై తొలి చార్జిషీట్

- ముంబై కోర్టులో దాఖలు చేసిన ఈఓడబ్ల్యూ
- ఆమె చదివింది తొమ్మిదో తరగతి వరకేనని నిర్ధారణ
- ప్రస్తుతం ఏపీ సీఐడీ అదుపులో నిందితురాలు
- హైదరాబాద్‌కు తరలించడానికి సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: స్కీముల పేరుతో స్కాములకు పాల్పడిన హీరా ఇస్లామిక్ బిజినెస్ గ్రూప్ సీఈఓ చిత్తూరు జిల్లా వాసి నౌహీరా షేక్‌పై తొలి అభియోగపత్రం(చార్జిషీట్)ను ఎకనమికల్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అధికారులు ముంబైలో దాఖలు చేశారు. అక్కడ నమోదైన రూ.500 కోట్ల కుంభకోణంపై అధికారులు దర్యాప్తు పూర్తిచేసి బుధవారం ముంబై కోర్టులో 3 వేల పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది.

నౌహీరాకు నో డాక్టరేట్

నౌహీరా అరెస్టయ్యేంత వరకూ డాక్టర్ నౌహీరాగానే చలామణి అయింది. గతేడాది అక్టోబర్‌లో సీసీఎస్ అధికారులు ఈమెను అరెస్టు చేసి విచారణ చేపట్టగా అసలు ఈమెకు డాక్టరేటే లేదని తేల్చారు. తొలుత పీహెచ్‌డీ చేశానని చెప్పి, తర్వాత మాటమార్చి తన సేవలకు మెచ్చి దుబాయ్‌కి చెందిన ఓ సంస్థ గౌరవ డాక్టరేట్ ఇచ్చిందని చెప్పింది. ముంబైలోనూ ఆమెపై కేసులు నమోదు కావడం, ఆమెను అక్కడికి తరలించారు. ఈఓడబ్ల్యూ విచారణలో ఆమె 9వ తరగతి వరకే చదివినట్లు తేలింది.

కూరగాయల దుకాణంతో..

చదువు మానేసిన నౌహీరా తన తల్లికి సహాయంగా కొద్దికాలం కూరగాయల దుకాణం నడిపింది. తర్వాత పాత బట్టల క్రయవిక్రయాలు చేసింది. 1990ల్లో మహిళలతో ఓ చిన్న గ్రూప్ ఏర్పాటు చేసిన ఆమె వివాహాది శుభకార్యాలకు బంగారం విక్రయించడం మొదలెట్టింది. 2008లో హైదరాబాద్‌కు మకాం మార్చి హీరా గ్రూప్ ఏర్పాటు చేసింది. 2014 నాటికి ఈ గొడుగు కింద 17 సంస్థలు వచ్చి చేరాయి. సౌతాఫ్రికాలో బంగారు గనులు లీజుకు తీసుకున్నామని, పెట్టుబడులకు లాభాలు మాత్రమే ఇస్తున్నానంటూ ప్రచారం చేసి అనేక మందిని ఆకర్షించింది. అది కూడా వాస్తవం కాదని, కొన్నాళ్లు ముంబైకి చెందిన ఇద్దరు వ్యాపారుల నుంచి బంగారం ఖరీదు చేసిందని, ఆపై అదీ మానేసినట్లు విచారణలో తేలింది. ముంబైకి చెందిన వారి నుంచి డబ్బు గుంజడానికి 2 బ్యాంకు ఖాతాలను వినియోగించి వాటిలో డిపాజిట్ అయిన మొత్తాన్ని ఆమె సొంత ఖాతాకు మళ్లించింది. ముంబై కేంద్రంగా నౌహీరాతో పాటు ఆ గ్రూప్‌నకు 200 బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు ఈఓడబ్ల్యూ గుర్తించింది. వీటితో 75 ఖాతాల్లో జరిగిన లావాదేవీలను పరిశీలించగా కేవలం రూ.17 కోట్లు లెక్కతేలింది. మిగిలిన మొత్తాన్ని ఎలా లావాదేవీలు చేశారనే అంశంపై అధికారులు దృష్టి పెట్టారు.

ఆస్తుల్ని గుర్తించిన పోలీసులు..

ఈ సంస్థకు సంబంధించి రూ.40 కోట్ల విలువైన ఆస్తుల్ని ముంబై పోలీసులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో కోర్టు విచారణ ప్రారంభంకావాలంటే నౌహీరాను మరోసారి ముంబైకు తరలించి కోర్టులో హాజరుపరచాల్సి ఉంటుంది. ప్రస్తుతం నౌహీరా షేక్ ఆంధ్రప్రదేశ్ సీఐడీ అధికారుల అదుపులో ఉంది. అక్కడి కేసుల విచారణ పూర్తయిన తర్వాత పీటీ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నౌహీరా స్కామ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించాలని హీరా గ్రూప్ బాధితుల సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్‌కు చెందిన ఎంఐఎం నేత షాబాజ్ అహ్మద్ ఖాన్ డిమాండ్ చేస్తున్నారు.

6 ప్రశ్నలపై అప్పీలుకా? అమలుకా?

- పోలీస్ ఉద్యోగాల భర్తీ వ్యవహారంపై సందిగ్ధం
- వాటికి మార్కులు కలపాలన్న హైకోర్టు...
- హైకోర్టు ఆదేశాలపై అప్పీల్‌కే మొగ్గు చూపుతున్న బోర్డు



సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగాల భర్తీపై రోజురోజుకూ సందిగ్ధత పెరుగుతూ వస్తోంది. సబ్‌ఇన్‌స్పెక్టర్ల ఎంపిక పరీక్ష ప్రశ్నపత్రంలో ఆరు ప్రశ్నలకు మార్కులు కలపాల్సిందేనని హైకోర్టు నుంచి నియామకాల బోర్డుకు ఆదేశాలు జారీ అయినా అధికారులు మాత్రం ముందుకు వెళ్లలేకపోతున్నారు.దీనితో అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది.18వేల పైచిలుకు పోస్టుల భర్తీలో ఆరు ప్రశ్నల వివాదం అటు అధికారులను, ఇటు అభ్యర్థులను ఇప్పట్లో ఓ స్పష్టతకు వచ్చేలా చేయడం లేదు.

సిలబస్‌లో లేని ప్రశ్నలు ఇవ్వడంతో..

సిలబస్‌లో లేని ప్రశ్నలను ఇవ్వడం సరైంది కాదని, వాటికి మార్కులు కలపాలని న్యాయస్థానం బోర్డును ఆదేశించింది.కోర్టు ఆదేశాలను బోర్డు అమలు చేసి నియామక ప్రక్రియలో ముందుకెళ్తుందా అన్న దానిపై సరైన సమాధానం రావడం లేదు. ఇప్పుడు అమలుచేస్తే రేపు కానిస్టేబుల్ పోస్టుల అంశంలో కూడా మళ్లీ ఏదైనా తీర్పు వస్తే అమలుచేయాల్సి వస్తుందన్న ఆలోచనలో కూడా బోర్డు అధికారులున్నట్టు తెలిసింది. ప్రస్తుతం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై అప్పీలుకు వెళ్లాలని బోర్డు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే గనుక జరిగితే రిక్రూట్‌మెంట్ వ్యవహారం మరికొన్ని రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

నోటిఫికేషన్ ఇచ్చి 8 నెలలు...

పోలీస్, జైళ్లు, అగ్నిమాపక శాఖల్లో ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల భర్తీకి గత ఏడాది మే 31వ తేదీన నియామక బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రెండు విభాగాల్లోని ఉద్యోగాలకు ప్రాథమిక రాతపరీక్ష నిర్వహించి గతేడాది అక్టోబర్‌లో ఫలితాలు విడుదల చేశారు. భర్తీ ప్రక్రియలో తర్వాతి దశ అయిన శారీరక కొలతలు /శారీరక సామర్థ్య పరీక్షలను డిసెంబర్‌లో నిర్వహించేందుకు ప్రణాళిక విడుదల చేశారు. ఇంతలోనే సిలబస్‌లోని ప్రశ్నల వల్ల కోర్టులో పిటిషన్, ఆదేశాలు ఇలా రెండు నెలలు గడిచిపోయాయి. తీరా ఇప్పుడు అప్పీల్‌కు వెళ్లడం, రాష్ట్రంలో వరుస ఎన్నికలు వస్తుండటంతో నియామక ప్రక్రియ మే తర్వాతే జరుగుతుందన్న అనుమానాలు అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీస్తున్నాయి. దీనితో వారు కోచింగ్ సెంటర్లలో వేలకు వేలు కట్టి పొందుతున్న శిక్షణ ఆపేసుకోవడమా? లేకా కొనసాగించాలా అన్న అంశాలపై తేల్చుకోలేక పోతున్నారు. అటు బోర్డు అధికారులు సైతం అభ్యర్థులకు సరైన వివరణ ఇవ్వలేకపోవడం అధికారులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది.

2012 నుంచీ నడుస్తున్న కథ

ఉమ్మడి రాష్ట్రంలో 2012లో పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చారు. ఇది 2012దే అయినా సాంకేతికపరమైన అంశాలతో కోర్టుల చుట్టూ తిరిగి చివరకు 2014లో ప్రక్రియ పూర్తిచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నియామక ప్రక్రియను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి కొత్త విధానాలను తీసుకువచ్చారు. ఈ మేరకు 2015లో నోటిఫికేషన్ ఇచ్చినా దాని ప్రక్రియ మాత్రం 2017లో పూర్తయ్యింది. దాన్ని తిరిగి 2018లో విడుదల చేసి కూడా ఎనిమిది నెలలు గడిచిపోయి కేవలం ప్రాథమిక పరీక్ష పూర్తికే పరిమితమైంది.దీనితో ఈ నోటిఫికేషన్‌పై జరగాల్సిన భర్తీ ఈ ఏడాదిలో అయినా పూర్తవుతుందా? లేదా ఆనవాయితీగా ఆలస్యప్రక్రియే కొనసాగుతుందా అన్న దానిపై అటు అభ్యర్థుల్లోనూ, ఇటు అధికారుల్లోనూ ఉత్కంఠ రేపుతోంది.

రోబో 2.0 రీలోడెడ్..



ఆ పని.. ఈ పని అని లేదు.. అన్నింటా మేమే అన్నట్లు తయారయ్యాయి ఈ రోబోలు.. కొత్త కొత్త రంగాల్లోకి దూసుకుపోతున్నాయి.. రోబో 2.0 రీలోడెడ్ టైపన్నమాట. ఇంతకీ విషయమేమిటంటే.. అమెజాన్ ప్రైమ్.. దీని గురించి తెలియని వారుండరు. తెలియని విషయమేమిటంటే.. ఇప్పుడా అమెజాన్ ప్రైమ్ డెలివరీలు మనుషులు కాకుండా రోబోలు చేయనున్నాయి. ఇందుకోసం అమెజాన్ తన పరిశోధన కేంద్రంలో ప్రత్యేకమైన సెల్ఫ్ డ్రైవింగ్ డెలివరీ రోబోలను తయారుచేసింది. అంతేకాదు.. త్వరలో 6 స్కౌట్ రోబోలు వాషింగ్టన్‌లోని స్నహామిష్ కౌంటీలో డెలివరీలు కూడా ప్రారంభిస్తాయని ప్రకటించింది. బ్యాటరీ సాయంతో పనిచేసే ఈ రోబోలు తమంతట తామే అడ్రస్‌కు వెళ్లి.. సరుకులు ఇచ్చి వస్తాయి. ఎవరినీ గుద్దేసే ప్రసక్తే లేదు.. ఎదురుగా ఎవరైనా వస్తే.. సైడిచ్చి మరీ ముందుకెళ్తాయి. అయితే, సదరు వినియోగదారులు అసలైనవారో కాదో అన్న విషయం ఇదెలా నిర్ధారించుకుంటుందన్న వివరాలను మాత్రం అమెజాన్ తెలియజేయలేదు. గతంలో వచ్చిన ఫుడ్ డెలివరీ రోబోలో అయితే వినియోగదారులు తమ మొబైల్‌కు వచ్చే.. ఓ ప్రత్యేకమైన కోడ్‌ను రోబో స్క్రీన్ మీద ఎంటర్ చేయాల్సి ఉంటుంది. తొలి దశలో తమ సిబ్బంది వీటిని పర్యవేక్షిస్తారని.. తదనంతర దశలో ఇవి తమంతట తాము వెళ్లి డెలివరీ చేస్తాయని అమెజాన్ తెలిపింది. రోబోలే కాదు.. డెలివరీ డ్రోన్‌లను కూడా తాము తయారుచేస్తున్నామని.. తదనంతర దశలో వాటినీ ఉపయోగిస్తామని పేర్కొంది.



ఎయిర్‌పోర్టులో పార్కింగ్ అంటే పెద్ద పరేషానీనే.. అయితే, ఆ పనిని కూడా సునాయాసంగా చేయడానికి రోబోలు వచ్చేశాయి. చూశారుగా.. దీని పేరు స్టాన్. ఈ ఆగస్టులో బ్రిటన్‌లోని గాట్విక్ ఎయిర్‌పోర్టులో ఈ రోబో వ్యాలెట్‌లు రంగంలోకి దిగనున్నాయి. వీటిని ఫ్రాన్స్‌కు చెందిన స్టాన్లీ రోబోటిక్స్ కంపెనీ తయారుచేసింది. ఆగస్టు నుంచి 3 నెలలపాటు వీటిని ప్రయోగాత్మకంగా పరీక్షించి చూడనున్నారు. ఇంతకీ ఇదేం చేస్తుందో తెలుసా? మీరు మీ కారును డ్రాపింగ్ జోన్‌లో వదిలేస్తే.. ఇది దాన్ని తీసుకెళ్లి.. జాగ్రత్తగా పార్క్ చేసి పెడుతుంది. కారు వద్దకు వెళ్లేందుకు.. ఆ కారును పార్కింగ్ ప్లేస్ వద్దకు తీసుకెళ్లేందుకు స్టాన్.. సైన్యంలో వాడే అత్యున్నత స్థాయి జీపీఎస్ టెక్నాలజీని వినియోగించుకుంటుంది. కారు షేప్, సైజును ఇవి స్కాన్ చేసుకుని.. దానికి తగ్గట్లుగా జాగా చూసుకుని పార్క్ చేస్తాయి. దీని వల్ల ప్రయాణికులకు సౌలభ్యం మాట పక్కనపెడితే.. మామూలుగా మనం.. 170 కార్లు పార్క్ చేసే స్థలంలో.. ఇవి 270 కార్లను పట్టించేస్తాయట. అదీ ఒకదానికి ఒకటి తగలకుండానే.. మళ్లా అవసరం పడితే.. వాటిని అక్కడి నుంచి తెచ్చి.. మనకు అందుబాటులో ఉంచుతాయి. బాగుంది కదూ..



నీటిలో విమానం ఎందుకబ్బా..

ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన సముద్రగర్భ థీమ్ పార్క్‌ను బహ్రెయిన్ ప్రభుత్వం నిర్మిస్తోంది. అండర్ వాటర్ థీమ్ పార్క్‌కు ఈ విమానానికి ఏం సంబంధం అనేగా మీ ప్రశ్న.. ఈ థీమ్ పార్క్‌లో పగడపు దిబ్బలు వంటివాటితోపాటు అసలైన బోయింగ్ 747 విమానాన్ని కూడా పెట్టనున్నారు. ఇందుకోసం త్వరలో దీన్ని నీటిలో ముంచేయనున్నారు. ఇలాంటిది ప్రపంచంలో మరెక్కడా లేదట. కొన్ని ప్రైవేటు కంపెనీలతో కలిసి ఈ ప్రాజెక్టును బహ్రెయిన్ ప్రభుత్వమే చేపడుతోంది. మొత్తం లక్ష చదరపు మీటర్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్నారు. సముద్రంలోని జీవజాతులకు ఇబ్బంది లేకుండా పర్యావరణ అనుకూల విధానాల్లో దీన్ని నిర్మిస్తున్నారట. మరికొన్ని నెలల్లో ఈ థీమ్ పార్క్ ప్రారంభమవనుంది.



ఎగిరే కారు..

ఇప్పటివరకూ ఎగిరే కారును డిజైన్లలోనే చూశాం.. ఇదిగో ఇప్పుడు నిజంగా చూసేయండి.. అమెరికాలోని వర్జీనియాలో ఈ ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కారు నమూనాను బోయింగ్ కంపెనీ విజయవంతంగా పరీక్షించింది. దీన్ని 'పీఏవీ' అని పిలుస్తున్నారు. ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టం ఆధారంగా ఇది నడుస్తుంది. ఒకేసారి 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. రద్దీగా ఉండే పట్టణాలు, నగరాల్లో దీన్ని ఉపయోగించవచ్చని బోయింగ్ తెలిపింది. దీని పొడవు 30 అడుగులు, వెడల్పు 28 అడుగులు. తొలి టెస్ట్ ఫ్లైట్ సక్సెస్ అయింది. అంటే.. ఈ కారు ఆకాశంలో ఝామ్మంటూ దూసుకుపోయే రోజు త్వరలోనే వచ్చేసినట్లే..

– సాక్షి సెంట్రల్ డెస్క్

నాగర్‌కర్నూల్ డీఈఓపై వేటు

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) సహదేవుడుపై వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ శ్రీధర్.. డీఈఓను పాఠశాల విద్యాశాఖ సంచాలకుడి కార్యాలయానికి సరెండర్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, కీలకమైన 18 ఫైళ్లను పరిశీలించి ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉపాధ్యాయులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు డీఈఓపై ఆరోపణలు వచ్చాయి.

కలప దందాపై సర్కార్ సీరియస్

రెండు జిల్లాల్లో ఇంటిదొంగలపై కొరడా

- ఇచ్చోడ సీఐ, నేరడిగొండ ఎస్సైలను డీఐజీ కార్యాలయానికి అటాచ్
- నిజామాబాద్ ఎఫ్‌డీఓ, ఎఫ్ఆర్వో, డీఎఫ్ఆర్వోలపై సస్పెన్షన్ వేటు
- కస్టడీలోకి ఆర్ఎస్ఐ, సామిల్ యజమాని



కలపను స్వాధీనం చేసుకున్న అధికారులు

నిర్మల్: ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల మధ్య కొనసాగుతున్న కలప అక్రమ రవాణా వ్యవహారాన్ని సర్కారు తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ నెల 19న నిర్మల్‌లో కలపను పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. ఈ దందాలో అటవీ, పోలీసు శాఖలకు చెందిన పలువురు ఇంటిదొంగలు భాగస్వాములుగా ఉండటం సంచలనంగా మారింది. ఏళ్లుగా సాగుతున్న ఈ కలప స్మగ్లింగ్ రాకెట్‌లో మరింత మంది ప్రమేయం ఉన్నట్లు తెలుతుండటంతో ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు చేపట్టింది. కలప స్మగ్లింగ్‌లో పాల్గొన్న నిజామాబాద్ ఏఆర్ ఎస్సై షకీల్‌పాషా, సహకరించిన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఎఫ్ఎస్ఓ రాజేందర్‌లను వెంటనే సస్పెండ్ చేశారు. కేసును లోతుగా విచారించగా.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సీఐ సతీశ్‌కుమార్, నేరడిగొండ ఎస్సై హరిశేఖర్‌లు పరోక్షంగా సహకరించినట్లు సందేహాలు రావడంతో వారిని గురువారం తన కార్యాలయానికి అటాచ్ చేస్తూ కరీంనగర్ రేంజ్ డీఐజీ ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. ఇక నిజామాబాద్ జిల్లాలో స్మగ్లర్లతోపాటు స్థానిక సామిల్ యజమానులకు పరోక్షంగా సహకరించారన్న ఆరోపణలతో నిజామాబాద్ ఎఫ్‌డీఓ వేణుబాబు, సౌత్ రేంజ్ ఎఫ్ఆర్వో రవిమోహన్‌భట్, డిప్యూటీ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌లను సస్పెండ్ చేస్తూ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఆదిలాబాద్ టు నిజామాబాద్ వయా నిర్మల్

ఈ నెల 19న రూ.16.52 లక్షల విలువైన కలపను ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రాంతం నుంచి నిజామాబాద్‌కు వాహనాల్లో తరలిస్తుండగా నిర్మల్ పోలీసులు పట్టుకోవడంతో ఈ రాకెట్ బయటపడింది. నిర్మల్ ఎస్పీ శశిధర్‌రాజు నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు బృందాలను పంపించి విచారణ చేయించారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన పలు సామిల్‌ల యజమానులు, స్మగ్లర్లు, ఏఆర్ ఎస్సై కలిసి ఆదిలాబాద్ జిల్లా నుంచి కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం ప్రాంతానికి చెందిన ముల్తానీలతో టేకు చెట్లను నరికిస్తూ.. స్థానిక ఉట్నూర్ ఎఫ్ఎస్ఓ రాజేందర్, నిర్మల్‌జిల్లా సోన్ వద్ద గల చెక్‌పోస్టులో సహాయకుడు సద్దాంల సహకారంతో గుట్టుగా నిజామాబాద్ జిల్లాకు తరలిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఆర్ ఎస్సై షకీల్‌పాషా స్వయంగా అక్రమ రవాణాలో ఉండి, సామిల్‌లకు కలప చేరుస్తున్నట్లు స్పష్టమైంది. ఈ మేరకు నిజామాబాద్‌లో అటవీ శాఖాధికారులు ఒక సామిల్‌ను సీజ్ చేశారు. కేసు నమోదైన తర్వాత నుంచి పరారీలో ఉన్న ఏఆర్ ఎస్సై షకీల్‌పాషా, సామిల్ యజమాని అఫ్జల్‌ఖాన్‌లను గురువారం నిర్మల్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఉట్నూర్ ఎఫ్ఎస్ఓ రాజేందర్ ఇప్పటికీ పరారీలోనే ఉన్నట్లు వారు పేర్కొన్నారు. విచారణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు.

మల్లన్న సాగర్ పనులు అడ్డుకున్న నిర్వాసితులు

తొగుట: కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ పనులను భూ నిర్వాసితులు గురువారం అడ్డుకున్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని నిలదీశారు. వ్యవసాయ భూమిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు పరిహారం కోసం తాము కోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో కోర్టు పనులు నిలిపివేసిందని వారు చెప్పారు. అయినా కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు అనుమతి వచ్చాక పనులు నిర్వహించాలని వారు యంత్రాలను అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. కాంట్రాక్టర్ కూడా వెళ్లిపోయాడు.

పంచలోహ విగ్రహాల చోరీ ముఠా అరెస్టు

రూ.10 లక్షల బంగారం.. 20 లక్షల విలువైన రెండు విగ్రహాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పంచలోహ విగ్రహాలు, బంగారు నగలు

గోదావరిఖని: ఆలయాల్లోని విలువైన విగ్రహాలతోపాటు, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేసి దోచుకున్న సొత్తును బంగారం వ్యాపారులకు విక్రయిస్తున్న ఐదుగురి సభ్యుల ముఠాను పెద్దపల్లి జిల్లా రామగుండం సీసీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. కమిషనర్ వి.సత్యనారాయణ ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన గుమ్మడి సారయ్య, తాండూర్ ఐబీకి చెందిన తోడేటి శేఖర్, కాసిపేటకు చెందిన సిరివేని గోపాల్, కొటాలకు చెందిన నాయిని పోశం, పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన తోట రమేశ్ జిల్లా కేంద్రం పెద్దపల్లిలో గురువారం అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పోలీసులు ప్రశ్నించారు. అయితే.. సమాధానాలకు పొంతన లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఆలయాల్లోని అతి విలువైన పురాతన విగ్రహాలతోపాటు, తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేస్తున్నట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.20 లక్షల విలువైన శివపార్వతుల విగ్రహాలు, రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులకు విక్రయించిన రూ.10 లక్షల విలువైన 30 తులాల బంగారం కూడా ఆరుగురు వ్యాపారుల నుంచి రికవరీ చేశామని కమిషనర్ వివరించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరి హత్య

వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు


మక్తల్ /నాగర్‌కర్నూల్ క్రైం : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం జరిగిన రెండు హత్యలు కలకలం సృష్టించాయి. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం గుర్లపల్లికి చెందిన చెన్నప్ప తనభార్య నాగేంద్రమ్మతో కలసి పొలంలో పనిచేసుకుంటుండగా ఇద్దరి మధ్య కుటుంబ విషయమై మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో చెన్నప్ప ఆవేశంతో కట్టెతో దాడి చేయగా తలకు తీవ్ర గాయమైన నాగేంద్రమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. ఇక నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో ఓ మహిళ హత్య జరగ్గా .. ఈ ఘటనకు ఆమె కుమారుడే బాధ్యుడని తెలుస్తోంది. తాడూరు మండలం యత్మతాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(52) జిల్లా కేంద్రంలో తన కొడుకు వెంకటేశ్‌తో కలసి అద్దె ఇంట్లో ఉంటోంది. వెంకటేశ్‌కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తల్లితో తరచూ గొడవ పడేవాడు. రోజూ పనికి వెళ్లే లక్ష్మమ్మ ఇంట్లో గురువారం ఉదయం అలికిడి లేకపోవడంతో చుట్టుపక్కల వారు ఇంటికి వచ్చి చూశారు. లక్ష్మమ్మ హత్యకు గురై ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు కొడుకే బాధ్యుడిగా భావిస్తూ పోలీసులు విచారణ చేపట్టారు.

చదువు ఒత్తిడితో విద్యార్థి ఆత్మహత్య

ఐదో అంతస్తు నుంచి దూకి.. నేరుగా నీటి సంపులో పడి మృతి



కరీంనగర్ క్రైం: పాఠశాల భవనం ఐదో అంతస్తు నుంచి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం కరీంనగర్‌లోని పద్మనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మోతె గ్రామానికి చెందిన గొల్ల సుదర్శన్, రేఖ దంపతుల రెండో కుమారుడు అశ్విత్ (14) కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో చదువుతూ అదే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ పాఠశాల భవనం 1, 2 అంతస్తుల్లో తరగతులు నిర్వహిస్తుండగా, 3,4 అంతస్తుల్లో హాస్టల్ ఏర్పాటు చేశారు. ఐదవ అంతస్తును రీడింగ్ రూంగా వినియోగిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు విద్యార్థులు, ఉపాధ్యాయులంతా నిద్రలేచి స్టడీ అవర్స్‌కు సిద్ధమవుతున్నారు. 5.22 గంటలకు పాఠశాల ఆవరణలో ఉన్న నీటి సంపు వద్ద పెద్ద శబ్దం వచ్చింది. కానీ దానిని సిబ్బంది అంతగా పట్టించుకోలేదు. 7.45 గంటలకు అశ్విత్ కనిపించడం లేదని గుర్తించిన సిబ్బంది.. అనుమానంతో సంపు వద్దకు వెళ్లి చూడగా అందులో అశ్విత్ కనిపించాడు. వెంటనే అతడిని బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. తమ కుమారుడు మానసికంగా ఇబ్బందులు పడుతూ చదువు ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవారెడ్డి తెలిపారు.



పులి చర్మం పట్టివేత

మందమర్రి రూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని రామన్‌కాలనీలో గురువారం సాయంత్రం అటవీశాఖ అధికారులు పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు వ్యక్తులు కలసి పులి చర్మాన్ని అమ్మకానికి పెట్టారు. విషయం తెలియడంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన టైగర్ హంటింగ్ అండ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అటవీశాఖ అధికారులకు పట్టించేందుకు ఆపరేషన్ చేపట్టారు. వారితో రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు బేరం కుదిరినట్లు సమాచారం. రెండ్రోజుల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ ఏరియాలోకి రావాలని చెప్పారు. దీంతో అక్కడికి వచ్చి అమ్మకందారులతో ఫోన్‌లో మాట్లాడుతూ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే.. అక్కడ అవకాశం కుదరకపోవడంతో బుధవారం మందమర్రిలో పులి చర్మాన్ని అప్పగిస్తామని చెప్పారు. దీంతో ఇక్కడి అటవీశాఖ అధికారుల సహకారంతో మాటు వేశారు. గురువారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా రామారావుపేటకు చెందిన మేకల నర్సయ్య పట్టణంలో ఎవరూ లేని ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. దీంతో పులి చర్మంతోపాటు అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పులిచర్మం నాలుగైదు సంవత్సరాల వయస్సు పులిదై ఉంటుంది.

సాక్షి స్పోర్ట్స్

శుక్రవారం
25-1-2019



సస్పెన్షన్ ఎత్తివేత

వ్యాఖ్యల వివాదంలో రాహుల్, పాండ్యాలకు ఊరట

- క్రికెట్ పరిపాలక కమిటీ నిర్ణయం
- న్యూజిలాండ్ బయల్దేరనున్న హార్దిక్
- 'ఎ' జట్టు తరఫున బరిలోకి రాహుల్
- బీసీసీఐ ప్రకటన

న్యూఢిల్లీ: టీవీ షోలో మహిళల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు యువ క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలపై విధించిన నిరవధిక నిషేధాన్ని క్రికెట్ పరిపాలక కమిటీ (సీవోఏ) గురువారం ఎత్తివేసింది. దీంతో వీరిద్దరు మళ్లీ క్రికెట్ మైదానంలోకి దిగే అవకాశం లభించింది. నిషేధం తొలగించడంతో హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్ వెళ్లి జట్టుతో కలుస్తాడని... రాహుల్ భారత 'ఎ'జట్టు తరఫున బరిలోకి దిగుతాడని బీసీసీఐ ప్రకటించింది. 'కోర్టు సహాయకుడి (అమికస్ క్యూరీ)గా నియమితులైన పీఎస్ నర్సింహ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నాం. దీని ప్రకారం ఇద్దరు క్రికెటర్లపై నిషేధం విధిస్తూ ఈ నెల 11న ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేస్తున్నాం. సుప్రీం కోర్టు అంబుడ్స్‌మన్‌ను నియమించిన తర్వాత వీరిద్దరిపై విచారణ కొనసాగుతుంది' అని సీవోఏ తరపున బీసీసీఐ అధికారి ఒకరు ప్రకటించారు.


రెండు వారాల ఉత్కంఠకు తెర...

మహిళలతో సంబంధాలపై టీవీ షోలో సరదాగా మాట్లాడే క్రమంలో మహిళలపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో రాహుల్, పాండ్యాలను ఆస్ట్రేలియా పర్యటన నుంచి ఈ నెల మొదట్లో అకస్మాత్తుగా స్వదేశానికి పిలిపించారు. తొలుత సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ రెండు మ్యాచ్‌ల నిషేధంతో సరిపెట్టాలని భావించినా, మరో సభ్యురాలు డయానా ఎడుల్జీ న్యాయ సలహాకు పట్టుబట్టారు. దీంతో ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్ ముందు యువ క్రికెటర్ల కెరీర్ సందిగ్ధంలో పడింది. అయితే, సీవోఏ అతిగా స్పందించి తీవ్ర చర్యలు తీసుకుందని విమర్శలు వచ్చాయి. దిగ్గజ ఆటగాళ్లు గంగూలీ, ద్రవిడ్ సైతం కుర్రాళ్లు తప్పులు తెలుసుకుని ముందుకుసాగే అవకాశం ఇవ్వాలని సూచించారు. ఇదే సమయంలో బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా సైతం విచారణ కొనసాగిస్తూనే రాహుల్, పాండ్యాలపై నిషేధాన్ని తొలగించాలని కోరారు. మొత్తానికి కోర్టు సహాయకుడి బాధ్యతల స్వీకారంతో కథ సుఖాంతమైంది. దీనిపై ఖన్నా మాట్లాడుతూ..'రాహుల్, పాండ్యా ఇప్పటికే తగినంత శిక్ష అనుభవించారు. ఈ పరిణామంతో పరిణతి చెందుతారు. ఇకపై ప్రపంచకప్ సన్నాహం మీద దృష్టిపెడతారు. అక్కడ హార్దిక్ కీలకం కానున్నాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కోర్టు కేసు ఎదుర్కొంటూ కూడా దేశానికి ఆడుతున్నాడు. దీనినే మన క్రికెటర్లకు ఎందుకు వర్తింపచేయకూడదు.' అని పేర్కొన్నారు.

నాదల్ నిర్దాక్షిణ్యంగా...

ఫైనల్ చేరిన స్పెయిన్ బుల్

- సెమీస్‌లో సిట్సిపాస్‌పై ఘన విజయం
- తుది పోరుకు క్విటోవా, ఒసాకా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్



నేటి షెడ్యూల్

పురుషుల సింగిల్స్ రెండో సెమీస్

నొవాక్ జొకోవిచ్ X లుకాస్ పుయి

మ.గం.2 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

నాదల్

ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లో రోజర్ ఫెడరర్‌నే చిత్తు చేసి సంచలనం సృష్టించిన గ్రీకు వీరుడు సిట్సిపాస్ ఆటలు స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ ముందు సాగలేదు. ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో సిట్సిపాస్‌కు కొత్త పాఠాలు నేర్పిస్తూ నాదల్ చెలరేగాడు. నిర్దాక్షిణ్యమైన ఆటతో విజయాన్ని అందుకొని పదేళ్ల తర్వాత మరోసారి టైటిల్ వేటలో నిలిచాడు. టోర్నీలో ఇప్పటి వరకు ఒక్క సెట్ కూడా కోల్పోని నాదల్ భీకర ఫామ్ ముందు సిట్సిపాస్ పూర్తిగా చేతులెత్తేశాడు. మహిళల విభాగంలో పెట్రా క్విటోవా, నయోమి ఒసాకా ఫైనల్ చేరి ఆఖరి సమరానికి సిద్ధమయ్యారు. వీరిద్దరిలో ఎవరి గెలిస్తే వారు హలెప్ స్థానంలో కొత్త వరల్డ్ నంబర్‌వన్‌గా నిలుస్తారు.



సిట్సిపాస్

మెల్‌బోర్న్: కెరీర్‌లో ఒకే ఒక్క సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన రాఫెల్ నాదల్ (స్పెయిన్) మరో టైటిల్ విజయానికి మరింత చేరువయ్యాడు. నాలుగు సార్లు ఈ టోర్నీ ఫైనల్లో ఓడిన అతను... మళ్లీ ఇక్కడ విజయం సాధించగలిగితే ఓపెన్ ఎరాలో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను కనీసం రెండేసి సార్లు నెగ్గిన తొలి ఆటగాడిగా నిలుస్తాడు. నాదల్ అద్భుత ఫామ్‌ను చూపించేలా సెమీ ఫైనల్ సాగింది. ఈ మ్యాచ్‌లో అతను 6-2, 6-4, 6-0తో స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)ను చిత్తుగా ఓడించాడు. 1 గంటా 46 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ఆద్యంతం రాఫెల్ దూకుడు కొనసాగింది. ఫైనల్ చేరే క్రమంలో వరుసగా 63 గేమ్‌లలో నాదల్ తన సర్వీస్‌ను కోల్పోకపోవడం విశేషం.

తొలి సెట్ మూడో గేమ్‌లో సిట్సిపాస్ సర్వీస్‌ను బ్రేక్ చేసి తన ధాటిని మొదలు పెట్టిన నాదల్ ఏ దశలోనూ ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. పదునైన సర్వీస్‌లతో దూసుకుపోయిన అతను 4-2తో ముందంజ వేశాడు. రెండు డబుల్ ఫాల్ట్‌లతో పాటు పేలవ డ్రాప్‌షాట్‌లతో సిట్సిపాస్ తొలి సెట్‌లో పూర్తిగా వెనుకబడిపోయాడు. రెండో సెట్‌లో మాత్రం కొంత పోటీనిచ్చిన గ్రీక్ ఆటగాడు 4-4 వరకు సమంగా నిలిచాడు. అయితే బ్రేక్ సాధించిన నాదల్ తన సర్వీస్‌ను నిలబెట్టుకున్నాడు. మూడో సెట్‌లోనైతే తిరుగులేని ఆటతో మూడు సార్లు సర్వీస్ బ్రేక్ చేసిన నాదల్... ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా ఇవ్వలేదు. నాదల్ 28 విన్నర్లు కొట్టగా, సిట్సిపాస్ 17కే పరిమితం కావడం ఇద్దరి ఆట మధ్య తేడాను చూపిస్తోంది. ఈ టోర్నీలో హోరాహోరీ మ్యాచ్‌లు ఆడటంతో నాదల్‌తో పోలిస్తే దాదాపు పది గంటలు ఎక్కువగా కోర్టులో గడిపిన సిట్సిపాస్‌పై తీవ్ర అలసట కూడా ప్రభావం చూపించింది.

తొలిసారి ఫైనల్‌కు...



క్విటోవా



ఒసాకా

మహిళల విభాగంలో ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) కెరీర్‌లో మొదటి సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. సెమీస్‌లో క్విటోవా 7-6 (7/2), 6-0తో డానియెల్ కొలిన్స్‌ను చిత్తు చేసింది. 1 గంటా 34 నిమిషాల పాటు ఈ పోరు సాగింది. తొలి సెట్ ఇద్దరి మధ్య హోరాహోరీగా సాగింది. 4-4తో స్కోరు సమంగా నిలిచిన స్థితిలో ఉష్ణోగ్రత తీవ్రంగా పెరిగిపోవడంతో రాడ్ లేవర్ ఎరీనా పై కప్పును మూసేశారు. తిరిగొచ్చిన తర్వాత కొలిన్స్ ఆట గతి తప్పింది. సహనం కోల్పోయిన ఆమె రెండో సెట్‌కు ముందు అంపైర్‌తో కూడా వాదనకు దిగింది. రెండో సెట్‌లో క్విటోవాకు ఎదురు లేకుండా పోయింది. రెండు సార్లు వింబుల్డన్ చాంపియన్‌గా నిలిచిన క్విటోవా 2016లో కత్తిపోటుకు గురైంది. పునరాగమనం తర్వాత ఆమె అత్యుత్తమ ప్రదర్శన ఇదే కావడం విశేషం. మరో సెమీస్‌లో నాలుగో సీడ్, యూఎస్ ఓపెన్ డిఫెండింగ్ చాంపియన్ నయోమి ఒసాకా (జపాన్) 6-2, 4-6, 6-4తో ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేసింది. క్వార్టర్స్‌లో సెరెనాను కంగు తినిపించిన ప్లిస్కోవా గట్టిగా పోరాడినా జపాన్ స్టార్ ముందు తలవంచక తప్పలేదు.



తీవ్ర దుమారం రేపిన టి20 ప్రపంచ కప్ సెమీఫైనల్ వివాదం తర్వాత... ఆడిన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు దుమ్మురేపింది. ఒక రోజు ముందు పురుషుల జట్టు ఏ విధంగానైతే సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిందో... అదేచోట, అదే తరహాలో చెలరేగి ఆడి ఆతిథ్య న్యూజిలాండ్‌పై తొలి వన్డేలో ఘన విజయం సాధించింది. తొలుత స్పిన్‌త్రయం విజృంభించి ప్రత్యర్థిని కుప్పకూల్చగా... తర్వాత ఓపెనింగ్ ద్వయం విరుచుకుపడి సునాయాసంగా జట్టును లక్ష్యానికి చేర్చింది.

అమ్మాయిలూ అదరగొట్టారు

స్మృతి అద్భుత శతకం, రాణించిన జెమీమా • కివీస్‌పై 9 వికెట్లతో భారత్ ఘన విజయం • కుప్పకూల్చిన స్పిన్నర్లు ఏక్తా, పూనమ్



జెమీమా

నేపియర్ : భారత మహిళల క్రికెట్ జట్టు కివీస్ పర్యటనను ఘన విజయంతో ప్రారంభించింది. బౌలింగ్‌లో స్పిన్నర్లు ఏక్తా బిష్త్ (2/32), పూనమ్ యాదవ్ (3/42), దీప్తి శర్మ (2/27) మాయాజాలం... బ్యాటింగ్‌లో ఓపెనర్లు స్మృతి మంధాన (104 బంతుల్లో 105; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అద్భుత శతకానికి తోడు జెమీమా రోడ్రిగ్స్ (94 బంతుల్లో 81; 9 ఫోర్లు) దుమ్మురేపడంతో గురువారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్‌ను 9 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు టీమిండియా స్పిన్నర్ల ధాటికి 48.4 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ సుజీ బేట్స్ (54 బంతుల్లో 36; 2 ఫోర్లు) టాప్ స్కోరర్. స్మృతి, జెమీమా జోరుతో 33 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 193 పరుగులు చేసి భారత్ లక్ష్యాన్ని అందుకుంది. రెండో వన్డే ఈ నెల 29న మౌంట్ మాంగనీలో జరుగుతుంది.

మంత్రం వేసిన స్పిన్ త్రయం

ఓపెనర్లు బేట్స్, సోఫీ డివైన్ (38 బంతుల్లో 28; 1 ఫోర్, 1 సిక్స్) నిలకడతో కివీస్ ఇన్నింగ్స్ సాఫీగానే ప్రారంభమైంది. తొలి వికెట్‌కు వీరిద్దరు 61 పరుగులు జోడించారు. అయితే, డివైన్‌ను రనౌట్ చేసి దీప్తి శర్మ ఈ భాగస్వామ్యాన్ని విడగొట్టింది. లారెన్ డౌన్ (0) పూనమ్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయింది. బేట్స్... దీప్తి బౌలింగ్‌లో వెనుదిరిగింది. ఈ దశలో కెప్టెన్ సాటర్‌వైట్ (45 బంతుల్లో 31; 3 ఫోర్లు), అమెలియా కెర్ (60 బంతుల్లో 28) కాసేపు పోరాడారు. వీరిద్దరిని పెవిలియన్ పంపి పూనమ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. తర్వాత బిష్త్ ప్రతాపం చూపడంతో మరెవరూ క్రీజులో నిలవలేకపోయారు. హనా రౌయి (25) పోరాటంతో ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

వారిద్దరే కొట్టేశారు

ఛేదనలో స్మృతి, జెమీమా ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడారు. తొలి రెండు ఓవర్లు ఆచితూచి ఆడిన వీరు తర్వాత ఓవర్‌కు కనీసం ఒక ఫోర్ చొప్పున కొడుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. స్మృతి... హడెల్‌స్టన్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు, సిక్స్ బాదింది. 43 బంతుల్లోనే ఆమె అర్ధ సెంచరీ పూర్తయింది. మరో ఎండ్‌లో పూర్తి సహకారం అందించిన జెమీమా 61 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకుంది. వీరి దూకుడుతో టీమిండియా స్కోరు 18వ ఓవర్లోనే వంద దాటింది. అనంతరం ఈ ఇద్దరు తడబాటు లేకుండా బ్యాటింగ్ కొనసాగించారు. 101 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న స్మృతి... లక్ష్యానికి మూడు పరుగుల ముందు కెర్ బౌలింగ్‌లో ఔటైంది. జెమీమా విజయ లాంఛనాన్ని పూర్తి చేసింది.

క్వార్టర్స్‌లో సింధు, సైనా

- శ్రీకాంత్ కూడా
- ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ

జకార్తా: కొత్త సీజన్‌ను టైటిల్‌తో ప్రారంభించాలని భావిస్తోన్న భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆ దిశగా దూసుకెళ్తోంది. ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నమెంట్‌లో సింధు క్వార్టర్స్‌కు చేరుకుంది. లీ జురుయ్‌తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో గెలిచేందుకు శ్రమించిన సింధు... ప్రిక్వార్టర్స్‌లో సులువుగా గెలుపొందింది. సింధుతో పాటు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండోసీడ్ సింధు 23-21, 21-7తో గ్రెగోరియా మరిస్కా టుంజుంగ్ (ఇండోనేసియా)పై 37 నిమిషాల్లోనే విజయం సాధించింది. తొలి గేమ్‌లో గట్టి పోటీనిచ్చిన గ్రెగోరియా రెండో గేమ్‌లో సింధు ధాటికి తేలిపోయింది. మరో మ్యాచ్‌లో లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ 21-17, 21-15తో ఫిత్రియాని ఫిత్రియాని (ఇండోనేసియా)పై 43 నిమిషాల్లోనే గెలుపొందింది. ముఖాముఖీ రికార్డులో సైనా 5-0తో ఆధిక్యంలో నిలిచింది. మరోవైపు పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ 21-14, 21-9తో ఆసియా క్రీడల కాంస్య పతక విజేత కెంటా నిషిమోటో (జపాన్)ను చిత్తుగా ఓడించాడు. పురుషుల డబుల్స్ విభాగంలో భారత జోడీకి నిరాశ ఎదురైంది. డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో మను అత్రి-సుమీత్ రెడ్డి (భారత్) ద్వయం 14-21, 21-17, 10-21తో ఐదో సీడ్ కిమ్ ఆస్ట్రుప్-ఆండర్స్ స్కారుప్ రస్‌మసెన్ (డెన్మార్క్) జోడీ చేతిలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

7 వికెట్లతో చెలరేగిన ఉమేశ్

- తొలి ఇన్నింగ్స్‌లో కేరళ 106కే ఆలౌట్
- సౌరాష్ట్రతో మ్యాచ్‌లో కర్ణాటక 264/9
- రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్



వాయనాడ్: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ టోర్నీ రంజీట్రోఫీ 68 ఏళ్ల చరిత్రలో తొలిసారి సెమీఫైనల్ చేరిన కేరళ ఆనందాన్ని టీమిండియా పేసర్ ఉమేశ్ యాదవ్ (7/48) ఆవిరి చేశాడు. గురువారం ఇక్కడ ప్రారంభమైన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ తరపున బరిలో దిగిన అతడు నిప్పులు చెరిగే బంతులతో ప్రత్యర్థిని కుప్పకూల్చాడు. దీంతో కేరళ మొదటి ఇన్నింగ్స్‌లో 28.4 ఓవర్లలో 106 పరుగులకే ఆలౌటైంది. ఏడో నంబర్ బ్యాట్స్‌మన్ విష్ణు వినోద్ (37 నాటౌట్) టాప్ స్కోరర్. ఉమేశ్ ధాటికి... విష్ణు, కెప్టెన్ సచిన్ బేబీ (22), పేసర్ బాసిల్ థంపి (10) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. రజనీష్ గుర్బానీ (3/38) మిగతా మూడు వికెట్లను పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భను కేరళ పేసర్లు సందీప్ వారియర్ (2/46), దినేశన్ నిధీశ్ (2/53) ఇబ్బంది పెట్టారు. అయితే, కెప్టెన్ ఫైజ్ ఫజల్ (75) అర్ధ సెంచరీతో పాటు వెటరన్ వసీం జాఫర్ (34) రాణించడంతో ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఆ జట్టుకు ఇప్పటికే 65 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది.

కర్ణాటక 30/4 నుంచి 264/9కు...

బెంగళూరు: మరో సెమీస్‌లో సౌరాష్ట్ర పేసర్ జైదేవ్ ఉనాద్కట్ (4/50) మెరుపు బౌలింగ్‌కు తొలుత తడబడిన కర్ణాటక తర్వాత నిలదొక్కుకుంది. ఉనాద్కట్... ఓపెనర్లు ఆర్.సమర్థ్ (0), మయాంక్ అగర్వాల్ (2), సిద్ధార్థ్ (12)లను స్వల్ప వ్యవధిలోనే ఔట్ చేయడం, కరుణ్ నాయర్ (9)ను చేతన్ సకారియా వెనక్కి పంపడంతో కర్ణాటక 30 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఆల్ రౌండర్ శ్రేయస్ గోపాల్ (182 బంతుల్లో 87; 9 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ మనీశ్ పాండే (67 బంతుల్లో 62; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు వీరిద్దరు 106 పరుగులు జోడించారు. చివరకు పాండేను ఉనాద్కట్ పెవిలియన్ చేర్చి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. వెటరన్ ఆఫ్ స్పిన్నర్ కమలేశ్ మక్వానా (3/73)... శ్రేయస్ గోపాల్‌తో పాటు కృష్ణప్ప గౌతమ్ (2), అభిమన్యు మిథున్ (4) వికెట్లను పడగొట్టినా మరో ఎండ్‌లో వికెట్ కీపర్ శ్రీనివాస్ శరత్ (177 బంతుల్లో 74 బ్యాటింగ్; 11 ఫోర్లు) పట్టుదల చూపి అర్ధ శతకం సాధించాడు. దీంతో కర్ణాటక 264/9తో రోజును ముగించింది.

శ్రీలంక 144 ఆలౌట్

బ్రిస్బేన్: బౌన్సీ పిచ్‌పై ఆస్ట్రేలియా పేస్ త్రయం కమిన్స్ (4/39), రిచర్డ్‌సన్ (3/26), స్టార్క్ (2/41) రాణించడంతో గురువారం ఇక్కడ ప్రారంభమైన తొలి టెస్టులో శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే ఆలౌటైంది. ఈ డే నైట్ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక... ఆసీస్ బౌలింగ్ ధాటికి నిలవలేకపోయింది. తిరిమానె (12)ను ఔట్ చేసి కమిన్స్ ప్రత్యర్థి పతనానికి శ్రీకారం చుట్టాడు. ఓపెనర్ కరుణరత్నె (24) కొంతసేపు నిలిచినా, కెప్టెన్ చండిమాల్ (5), కుశాల్ మెండిస్ (14), రోషన్ సిల్వా (9), ధనంజయ డిసిల్వా (5) పెవిలియన్‌కు వరుస కట్టారు. 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన దశలో వికెట్ కీపర్ డిక్‌వెలా (78 బంతుల్లో 64; 6 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి అర్ధశతకం సాధించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్... ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. ఓపెనర్ మార్కస్ హారిస్ (40 బ్యాటింగ్), నైట్ వాచ్‌మన్ నాథన్ లయన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రోచ్ గర్జన... ఇంగ్లండ్ 77 ఆలౌట్



రోచ్

బ్రిడ్జిటౌన్: వెస్టిండీస్ పేసర్ కీమర్ రోచ్ (5/17) అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను హడలగొట్టాడు. అతడి ధాటికి ఇక్కడ జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు గురువారం ఆ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 77 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా వెస్టిండీస్‌కు 212 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఇంగ్లండ్ జట్టులో ఓపెనర్లు బర్న్స్ (2), జెన్నింగ్స్ (17), కెప్టెన్ రూట్ (4), బెయిర్ స్టో (12), స్టోక్స్ (0), మొయిన్ అలీ (0), బట్లర్ (4), ఫోక్స్ (2) అంతా విఫలమయ్యారు. రోచ్ ఐదు వికెట్లను 31 బంతుల వ్యవధిలో 9 పరుగులిచ్చి పడ గొట్టడం విశేషం. అంతకుముందు ఆతిథ్య జట్టు 289 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మైర్ (81; 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) దూకుడైన ఇన్నింగ్స్, షై హోప్ (57), చేజ్ (54) అర్ధ సెంచరీలతో విండీస్ గౌరవప్రదమైన స్కోరు చేసింది. అండర్సన్ (5/46)కు ఐదు, స్టోక్స్ (4/59)కు నాలుగు వికెట్లు దక్కాయి.

దేశాన్ని అప్పుల్లోకి నెట్టిన ప్రధాని

- మోదీ తప్పుడు విధానాలతో పెరిగిన 49% అప్పులు
- టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ తప్పుడు ఆర్థిక విధానాలతో దేశాన్ని అప్పుల్లోకి నెట్టారని, ఈ నాలుగున్నరేళ్లలో 49% అప్పులు పెరిగిపోయాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రోజుకు రూ.1,707 కోట్లు అప్పు చేస్తున్నారని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. గోల్డ్‌బాండ్ల ద్వారా మోదీ రూ.10వేల కోట్ల అప్పులు తెచ్చారని ఆరోపించారు. నాలుగేళ్ల క్రితం రూ. 54,90,763 కోట్ల అప్పుల్లో ఉన్న దేశం 2018, సెప్టెంబర్ నాటికి రూ.82,03,253 లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందని వివరించారు.

తగ్గిపోయిన 'రిజర్వు నిధి'

మోదీ ఆర్థిక విధానాల కారణంగా దేశంలో ఉన్న రిజర్వు ఫండ్, డిపాజిట్లు కూడా తగ్గుముఖం పడుతున్నాయని నారాయణరెడ్డి ఆరోపించారు. 2014 జూన్ నెలలో రూ.2.21 లక్షల కోట్ల రిజర్వు ఫండ్ ఉంటే ఇప్పుడది రూ.2.14 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. బీజేపీ పాలనలో దేశం ఆర్థికంగా ప్రగతి పథంలో దూసుకెళుతోందని ఆపార్టీ నేతలు చెబుతున్నవి డొల్లమాటలేననడానికి ఈ లెక్కలే నిదర్శనమన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ లాంటి తప్పుడు విధానాలు, ప్రణాళికల అమలులో లోపించిన చిత్తశుద్ధి దేశాన్ని అప్పుల్లోకి నెట్టి ఆర్థిక మందగమనానికి దారితీశాయని పేర్కొన్నారు. మళ్లీ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే దేశం ఆర్థికంగా గాడిలో పడుతుందని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు.


మెదక్ నుంచి పోటీ చేస్తే గెలిపిస్తాం

- ప్రియాంక లేదా రాహుల్ ఇక్కడి నుంచి పోటీచేయాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తూర్పు యూపీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన ప్రియాంక లేదా ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీలు మెదక్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తే గెలిపిస్తామని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చిన కుటుంబం నుంచి పోటీ చేస్తే ఏకగ్రీవం చేయించే బాధ్యతను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తీసుకోవాలని, బీజేపీని కూడా ఆయనే ఒప్పించాలని కోరారు. అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంకను రాజకీయాల్లోకి తీసుకురావడంలో రాహుల్‌గాంధీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పారు. ప్రియాంకలో ఇందిరాగాంధీ కనపడుతుందని, ఆమె ప్రభావం దేశవ్యాప్తంగా పనిచేయడంతోపాటుగా కార్యకర్తల్లో మనోస్థైర్యాన్ని నింపుతుందని తెలిపారు. తెలంగాణలోనూ ప్రియాంక ప్రభావం ఉంటుందని జోస్యం చెప్పారు. సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్కకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఆయన్ను వ్యతిరేకిస్తే రాహుల్‌గాంధీని, ఆయన నిర్ణ యాన్ని వ్యతిరేకించినట్టేనన్నారు. భట్టిలో తాము రాహుల్‌ను చూసు కుంటామని సరదాగా వ్యాఖ్యానించారు.

ఓటర్ దినోత్సవంలో పాల్గొనం: చాడ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్ ఏకపక్ష, అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా ఓటర్ దినోత్సవంలో పాల్గొనడానికి తమ పార్టీ నిరాకరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) రజత్‌కుమార్‌కు ఆయన లేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 22 లక్షల నుంచి 30 లక్షల వరకు ఓట్లు గల్లంతైనట్టు తేలిందన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు, చనిపోయినవారి పేర్లు జాబితాలో కొనసాగడం వంటి వాటిని ఈసీ దృష్టికి తీసుకెళ్లినా వాటికి సవరణలు చేయలేదన్నారు. జరిగిన తప్పులకు సీఈఓ కేవలం క్షమాపణలతో సరిపుచ్చడం సమంజసమేనా అని ప్రశ్నించారు. ఓటరు జాబితా తప్పుల తడకగా మారడానికి ఎవరు బాధ్యులో చెప్పాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలకు ఎలా విశ్వాసం కలిగిస్తారన్నారు. 'అర్హులైన ఒక్క ఓటరు పేరును కూడా జాబితాలో లేకుండా వదలొద్దనే'అంశంపై శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం మంచిదే అయినా అందుకు భిన్నంగా రాష్ట్రంలో పరిణామాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఓటర్ నమోదుకు స్పష్టమైన విధానాలు లేవని, ఓటరు జాబితాలో అవకతవకలు ఉన్నాయని పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఈసీ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

వర్సిటీ ఉద్యోగాల భర్తీలో అన్యాయం: జాజుల



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రీయ, వివిధ వర్సిటీల్లో ఉద్యోగాల భర్తీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా కేంద్రం కొత్త పాలసీని అమలు చేస్తూ రిజర్వేషన్ వర్గాల ఉద్యోగాలకు గండికొడుతోందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్, బోధన సిబ్బంది ఉద్యోగాల్లో ఒక వర్సిటీని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లు అమలు చేసేవారని, కానీ ఇప్పుడు ఒక డిపార్టుమెంట్‌ను యూనిట్‌గా తీసుకొని ఉద్యోగాలు భర్తీ చేయడం వల్ల రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. వీరికి న్యాయం చేయకపోతే ఫిబ్రవరి 12న కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు.

ఆ స్కామ్ విచారణ వేగం పెంచండి

గవర్నర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి చెందాల్సిన మొత్తాలను తిరిగి బడా కాంట్రాక్టర్లకు చెల్లించిన వాణిజ్య పన్నుల (కమర్షియల్ ట్యాక్స్) శాఖ కుంభకోణంపై విచారణను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ నరసింహన్‌ను ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి గవర్నర్‌కు బుధవారం ఒక విజ్ఞాపన పత్రం పంపారు. వ్యాట్ కింద కాంట్రాక్టర్లు చెల్లించిన మొత్తాలను వాణిజ్య పన్నుల శాఖలోని కొందరు అధికారులు తిరిగి అదే కాంట్రాక్టర్లకు చెల్లించారని, దీనిపై విచారణ జరిపిన విజిలెన్స్ రూ.500 కోట్ల కుంభకోణం జరిగిందని తేల్చిందని తెలిపారు. అయితే దీనిపై కొందరు అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కేసు విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించేలా చూడాలని గవర్నర్‌ను కోరారు.

ఫైర్ సిబ్బందికి రాష్ట్రపతి పురస్కారాలు

సాక్షి, న్యూఢిల్లీ: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఫైర్ సర్వీస్ సిబ్బందికి రాష్ట్రపతి పురస్కారాలు వరించాయి. తెలంగాణ నుంచి ఫైర్‌సర్వీస్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ చింతలపల్లి, లీడ్ ఫైర్‌మన్ లంకా నరసింహా రెడ్డిలకు విశిష్ట సేవా పురస్కారాలు దక్కాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డులను ప్రకటించారు.

ఒకరిద్దరి తప్పుల్ని అందరికీ ఆపాదించవద్దు...

'సాక్షి' కథనంపై ఇరాన్ కాన్సులేట్ జనరల్ వివరణ

సాక్షి, హైదరాబాద్: భారత్‌కు వచ్చిన ఒకరిద్దరు ఇరానియన్లు చేసిన తప్పులను ఇరానియన్లందరితోపాటు ఆ దేశానికీ ఆపాదించవద్దని హైదరాబాద్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పేర్కొంది. ఈ నెల 5న 'నేరాలకు వీసా'శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆ కార్యాలయం వివరణ ఇచ్చింది. భారత్‌కు వీసా తీసుకుంటున్న ఇరానియన్లు అంతా నేరాలు చేసేవారు కాదని, ఒకరో.. ఇద్దరో నేరాలు చేస్తే చట్ట ప్రకారం న్యాయస్థానాలు చర్యలు తీసుకుంటాయని వివరించింది. ఇరానియన్లు నేరాలు చేయడానికే వస్తున్నారనే భావన ప్రజల్లోకి వెళితే అది ఇరు దేశాల సంబంధ బాంధవ్యాలపై ప్రభావం చూపుతుందని స్పష్టంచేసింది. హైదరాబాద్‌లోనూ ఇరాన్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొంది. భారత్–ఇరాన్ దేశాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, గతేడాది ఇరాన్ అధ్యక్షుడు ఈ దేశానికీ.. అందులోనూ దక్షిణాదికి రావడమే దానికి నిదర్శనమని తెలిపింది.

నను బ్రోవమని చెప్పవే..

- ఆదరణ లేక.. ఎవరూ పట్టించుకోక శిథిలమవుతున్న త్రికూటాలయం
- వెలవెలబోతున్న కాకతీయుల కళావైభవానికి ప్రతీక
- ప్రభుత్వం పరిరక్షించాలంటున్న చరిత్రకారులు

అనన్యసామాన్యమైన పోరాట పటిమ, అపూర్వ పరిపాలనా దక్షత, అద్వితీయ కళాపిపాస కలిగిన కాకతీయుల చరిత్రకు సాక్ష్యాలు వారి కళారూపాలు. కాకతీయుల కళామణిహారం లోంచి జాలువారిన ఆణిముత్యాలుగా, కాకతీయుల ప్రతిభకు తార్కాణాలుగా అనేక ఆలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి. నాడు కళకళలాడిన ఆ ఆలయాలు నేడు పూజలు లేక వెలవెలబోతున్నాయి. అలాంటి ఆలయమే త్రికూటాలయం.. – సాక్షి, హైదరాబాద్


త్రికూటాలయం..

ఎక్కడ ఉంది..


శిథిలమవుతున్న ఆలయం

కరీంనగర్‌కు 60 కిలోమీటర్ల దూరంలో భీమదేవరపల్లి మండలంలో ఉన్న ముత్తారం గ్రామంలో కాకతీయుల కాలం నాటి త్రికూటాలయం ఉంది. ఆలయం తూర్పు ముఖ ద్వారాన్ని కలిగి ఉంది. ఇటువంటి ఆలయాలను మనం కొత్తపల్లి, నగునూరు గ్రామాల్లో కూడా చూడవచ్చు. ఆలయానికి తూర్పు వైపు ఉన్న ప్రవేశ మండపం, మధ్యలో ఉన్న ముఖ మండపం శిథిలావస్థకు చేరుకున్నాయి. మధ్య మండపానికి పడమర, ఉత్తరం, దక్షిణం దిక్కులకు మూడు గర్భ గృహాలు, వాటి ముందు అంతరాలయాలు ఉన్నాయి. ఆలయ నిర్మాణం బట్టి 13వ శతాబ్దానికి చెందినదిగా చెప్పవచ్చు. ఆలయ ఉపపీఠం నక్షత్రాకారంలో ఉండి, చుట్టూ పద్మాలు చెక్కిన పట్టికలతో నిర్మించారు. పడమర, దక్షిణ దిక్కుల్లో శివలింగాలు ఉండగా, ఉత్తర గర్భ గుడిలో విష్ణువు ఉన్నారు. ఆలయంలో ఉన్న రెండు శివలింగాలు కాకతీయ శైలిలో చెక్కబడి ఉన్నాయి. ఉత్తర గర్భ గుడిలో ఉన్న ఆలయంలో నాలుగు అడుగుల ఎత్తు ఉన్న విష్ణు మూర్తి విగ్రహం నిలబడి ఉన్న భంగిమలో నాలుగు చేతులతో ఉంది. పైన ఒక చేతిలో శంఖము, మరొక చేతిలో చక్రము ఉన్నాయి. కింది రెండు చేతులు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. విష్ణు మూర్తికి రెండు వైపులా చామరదారిణిలు ఉన్నాయి. కుడివైపు కింది భాగంలో గరుత్మంతుడు ఉన్నాడు. త్రికూటాలయానికి ఉత్తర దిక్కులో కొంత దూరంలో చెట్టు కింద ఒక పెద్ద వినాయకుడి విగ్రహం ఉంది. ఇది హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో ఉన్న విగ్రహాన్ని పోలి ఉంటుంది.


శిథిలమైన శివలింగం

కాలగర్భంలో కలిసిపోతున్న ఆలయాలు

ప్రజలు, పాలకుల నిర్లక్ష్యం వల్ల కాకతీయుల కాలంలో నిర్మించిన ఇలాంటి చారిత్రాత్మక ఆలయాలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం నెలకొంది. అద్భుత శిల్పకళతో నిర్మించిన ఈ ఆలయాలు శిథిలావస్థకు చేరాయి. గుప్తనిధులు ఉన్నాయనే ఉద్దేశంతో దుండగులు ఆలయంలో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపారు. శివలింగాన్ని బయటికి పెకలించి వేశారు. ఆలయానికి అక్కడక్కడా పగుళ్లు వచ్చాయి. కాకతీయుల కాలంలో ఘనంగా పూజలు అందుకున్న ఈ ఆలయం నేడు ధూప దీప నైవేద్యాలకు కూడా నోచుకోవడం లేదు. ఇది ఇలానే కొనసాగితే అద్భుత చరిత్ర, శిల్ప సంపద కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పురావస్తు శాఖను పటిష్టపరిచి వీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– రామోజు హరగోపాల్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్

ఈవీఎం వద్దు.. బ్యాలెట్ ముద్దు

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో మహాకూటమి నేతల డిమాండ్...

- ఓట్ల గల్లంతులో తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి
- ఈ ఆందోళన దేశవ్యాప్త ఉద్యమానికి నాంది

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఈవీఎంల పనితీరుపై ప్రజలు, రాజకీయపార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున బ్యాలెట్ పేపర్ విధానం తీసుకురావాలని మహాకూటమి నేతలు డిమాండ్ చేశారు. అబివృద్ధి చెందిన దేశాల్లోనే ఈవీఎంలను పక్కన పెట్టి బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుపుతున్నారని గుర్తు చేశారు. ఈవీఎంలపై హైదరాబాద్‌లో జరిగిన ఆందోళన దేశవ్యాప్త ఉద్యమానికి నాంది అని పేర్కొన్నారు. ఓటరు జాబితా అవకతవకలపై ఎన్నికల కమిషనర్ క్షమాపణ చెప్పినంత మాత్రాన సరిపోదని, తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వైఫల్యాలను నిరసిస్తూ టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ అధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద గురువారం ధర్నా జరిగింది.

ఈసీ విఫలం: ఉత్తమ్

ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మార్జిన్ ఒక శాతం కంటే తక్కువ ఉంటే రీకౌంటింగ్ చేయాల్సి ఉండగా వీవీ ప్యాట్‌ల రీకౌంటింగ్‌కు ఈసీ ఒప్పుకోకపోవడం శోచనీయమన్నారు. మధ్యప్రదేశ్‌లో వీవీ ప్యాట్‌ల లెక్కింపు జరిగిందని, రాజస్తాన్‌లోనూ రీకౌంటింగ్‌కు అనుమతి ఇవ్వడం వల్ల మరుసటి రోజువరకు ఓట్ల లెక్కింపు సాగిందని, తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కచోట కూడా వీవీ ప్యాట్‌ల లెక్కింపు జరగలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కేసీఆర్, అసదుద్దీన్ బీజేపీ వ్యతిరేకఓట్లను చీల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారు. స్వతంత్ర వ్యవస్థ అయిన ఈసీపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయంటే ప్రజలకు ఆ వ్యవస్థపై నమ్మకం పోయినట్లు అర్థమని, అందుకే దేశవ్యాప్తంగా బ్యాలెట్ విధానాన్ని తీసుకు రావాలన్నారు.



గురువారం ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో అఖిలపక్ష నేతలు

తప్పుదోవ పట్టించారు: కోదండరాం

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ అందరికీ ఓటుహక్కు ఉన్నదా, లేదా అనే దానిని బట్టి ఏ దేశమైనా ప్రజాస్వామ్య దేశమా, కాదా అనేది నిర్ధారణ అవుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 65 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, కోర్టులను కూడా తప్పుదోవ పట్టించారని అన్నారు. ఓట్ల గల్లంతుపై ప్రజా ఆందోళనలు చేయకుండా వదిలిపెడితే న్యాయం జరగదని పేర్కొన్నారు. 31, 32 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు, కౌంటింగ్‌లో వచ్చిన ఓట్ల మధ్య తేడా ఉందని, దీంతో కొన్నిస్థానాల్లో ఫలితాలు తారుమారయ్యాయని, దీనిపై ఇప్పటివరకు ఈసీ స్పష్టమైన కారణాలు చెప్పలేదన్నారు. ట్యాపింగ్, ట్రాకింగ్, ట్యాంపరింగ్‌లను నమ్ముతున్న సీఎం కేసీఆర్ తాను అనుకున్న ఎన్నికల ఫలితాలను సాధించుకుంటున్నారని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈవీఎంల దుష్ఫలితాలపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టాలని, ఇందుకు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఎవరు ఓడిపోతారు, ఎంత తేడాతో ఓడిపోతారనే విషయాలను ముందే చెప్పడంలో అంతర్యం ఏంటని టీపీసీసీ నేత పొన్నాల లక్ష్మయ్య నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీ నంది ఎల్లయ్య, సీపీఐ నేత అజీజ్ పాషా, టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెసు నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, నిరంజన్, వినోద్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, ఆప్ ఇన్‌చార్జ్ ఎం.డి.మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచినా.. జెండా ఎగరేయరు!

- రిపబ్లిక్ డే జెండావిష్కరణకు కొత్త సర్పంచ్‌లు దూరం
- 3 విడతల పంచాయతీ ఎన్నికలు ముగిశాకే ప్రమాణ స్వీకారం
- దీంతో ఈ సారి పంచాయతీల ప్రత్యేకాధికారులకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఎగరేసే మొదటి అవకాశాన్ని కొత్త సర్పంచ్‌లు కోల్పోతున్నారు. ఈ నెల 26న జాతీయ జెండాను ఎగరేసే అవకాశం వారికి దక్కడం లేదు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, శుక్రవారం రెండో విడత ముగిశాక ఎన్నికయ్యే సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఈ సారి జెండా ఎగురవేసే అవకాశం లేనట్టే. ఇక మూడో విడత ఎన్నికలు ఈ నెల 30న జరగనుండటంతో అప్పుడు గెలిచే వారికి ఆ అవకాశం ఎలాగో ఉండదు. ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసే దాకా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం లేదు. మూడు విడతల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సర్పంచ్‌ల ప్రమాణానికి ఓ తేదీని నిర్ణయిస్తుంది. వారు ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి ఐదేళ్ల వరకు సంబంధిత పదవుల్లో కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.

ఈ సారి ప్రత్యేకాధికారులే

అయితే కొత్తగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వారితో జాతీయ జెండావిష్కరణ చేయించొచ్చా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ అధికారులు స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తున్న వారే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జెండా ఎగరేయాలని సూచించారు. ఆ తర్వాతనే సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు తమ హోదాల్లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుంటుందని స్పష్టతనిచ్చారు. ఈ అంశాన్ని కొందరు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు సమాచారం. పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిశాక పంచాయతీరాజ్ శాఖ విడిగా ప్రకటించే తేదీన సర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం చేస్తారని.. ఆ రోజు నుంచి బాధ్యతలు స్వీకరించినట్టు అవుతుందని ఎస్ఈసీ అధికారులు వివరణ ఇచ్చారు.

నేడే రెండో విడత 'పంచాయతీ'

- 3,342 సర్పంచ్ స్థానాలకు 10,668 మంది అభ్యర్థులు
- 26,191 వార్డులకు 63,480 మంది పోటీ
- మొత్తం 29,964 కేంద్రాల్లో పోలింగ్.. 673 చోట్ల వెబ్‌కాస్టింగ్

సాక్షి, హైదరాబాద్: రెండోవిడత గ్రామ పంచాయతీ ఎన్నికలు శుక్రవారం(నేడు) జరగనున్నాయి. మండల, గ్రామస్థాయిల్లో ఎన్నికల వ్యయపరిశీలకులు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసు సోదాలు, నిఘా కొనసాగుతున్నా కిందిస్థాయిలో డబ్బు, మద్యం పంపిణీ యథేచ్ఛగా సాగుతున్నట్టు వార్తలొస్తున్నాయి. బుధవారం వరకు దాదాపు రూ. రెండున్నర కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ)కు పోలీసు శాఖ నివేదికలు సమర్పించిన విషయం తెలిసిందే. అయితే, పోలీసులకు పట్టుబడిన డబ్బు, మద్యం నామమాత్రమేనని, రెండోవిడత ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాల పర్వం కొనసాగుతున్నట్టుగా గ్రామస్థాయిల నుంచి సమాచారం వస్తోంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతోంది. ఈ ప్రక్రియ ముగియగానే ఫలితాలను ప్రకటిస్తారు. ఆ వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటుంది. అనివార్య కారణాలతో ఉప సర్పంచ్ ఎన్నిక జరగకపోతే, మరుసటిరోజు దానిని నిర్వహించాల్సి ఉంటుందని ఎస్ఈసీ ఇదివరకే తెలియజేసింది. ఎన్నికల విధుల నిర్వహణకు పెద్దసంఖ్యలో అధికారులు, సిబ్బందితోపాటు బందోబస్తు కోసం 20 వేల మందికిపైగా పోలీసుల సేవలను వినియోగించుకుంటున్నారు. రెండోవిడత ఎన్నికల్లో భాగంగా 29,964 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నట్టు, 673 చోట్ల వెబ్ కాస్టింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్టు ఎస్ఈసీ వెల్లడించింది. ఓటింగ్ స్లిప్పులు అందనివారు టీపోల్ యాప్‌తో తమ ఓటరు స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కూడా కమిషన్ కల్పించింది.

3,342 సర్పంచ్, 26,191 వార్డులకు ఎన్నికలు...

మూడు విడతలుగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జరగనున్న రెండోదశలో మొత్తం 4,135 సర్పంచ్‌స్థానాలకు 783 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 36,602 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. వీటిని మినహాయించాక మొత్తం 3,342 సర్పంచ్ స్థానాలకు 10,668 మంది, 26,191 వార్డులకు 63,480 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. రెండో విడతలో భాగంగా కోర్టు కేసులు, ఇతరత్రా కారణాలతో ఐదు పంచాయతీల్లో, 94 వార్డుల్లో ఎన్నికలు జరగడంలేదు.

మూడో విడతలో 573 సర్పంచ్‌లు ఏకగ్రీవం

ఈ నెల 30న జరగనున్న మూడోదశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 373 సర్పంచ్ అభ్యర్థులు, 8,956 మంది వార్డుమెంబర్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎస్ఈసీ తెలిపింది. ఈ ఎన్నికల్లో భాగంగా 4,116 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నోటిఫై చేయగా 573 ఏకగ్రీవాలు కావడం, పది చోట్లా కోర్టు కేసులు, ఇతరత్రా కారణాలతో ఎన్నికలు జరగడంలేదు. ఈ నెల 22న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక మొత్తం 3,529 సర్పంచ్ స్థానాలకు 11,667 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మూడో విడతలో మొత్తం 36,729 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వాటిలో 8,956 వార్డులు ఏకగ్రీవం కాగా, వివిధ కారణాలతో 185 చోట్ల ఎన్నికలు జరగడం లేదు. దీంతో మొత్తం 27,583 వార్డు మెంబర్ స్థానాలకు 67,516 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

నల్లగొండకు అత్యధికం

వరంగల్ అర్బన్ జిల్లాకు అత్యల్పంగా కేటాయింపు • కొత్త జిల్లాలకు రెవెన్యూ సిబ్బంది పంపిణీ పూర్తి

సాక్షి, హైదరాబాద్: కొత్త జిల్లాల వారీగా రెవెన్యూ సిబ్బంది కేటాయింపుపై స్పష్టత వచ్చింది. కొత్తగా ఏర్పాటైన 31 జిల్లాల్లో (ములుగు, నారాయణపేట మినహా) జిల్లాలకు అవసరమైన రెవెన్యూ సిబ్బందిని నిర్ధారిస్తూ సర్క్యులర్ విడుదలైంది. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక గణాంక శాఖ డైరెక్టర్, సర్వే సెటిల్‌మెంట్స్ కమిషనర్ కార్యాలయాలకు ఈ సర్క్యులర్ ఇప్పటికే చేరింది. దీని ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, మండల కార్యాలయాల్లో కలిపి మొత్తం 9,891 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉంది. జిల్లా రెవెన్యూ అధికారులు (డీఆర్వో), డిప్యూటీ కలెక్టర్లు (ఆర్డీవో), అడ్మినిస్ట్రేటివ్ అధికారులు/తహసీల్దార్లు, సీనియర్ స్టెనోగ్రాఫర్స్, జూనియర్ అసిస్టెంట్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్స్, రికార్డ్ అసిస్టెంట్లు, డ్రైవర్, జమేదార్లు, ఆఫీస్ సబార్డినేట్లు, చౌకీదార్లు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు, ఉపగణాంక అధికారులు, మండల సర్వేయర్లు, మండల ప్రణాళిక, గణాంక అధికారులు, చైన్‌మెన్లు.. ఇలా మొత్తం 18 కేటగిరీల్లో సిబ్బందిని పంపిణీ చేశారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాకు 482 మందిని కేటాయించగా, అత్యల్పంగా వరంగల్ అర్బన్ జిల్లాకు 200 మందిని కేటాయించారు. కొత్త జిల్లాలకు సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు 2016లో ఇచ్చిన జీవో నంబర్ 157 ద్వారా మంజూరు చేసిన 284 పోస్టులను కూడా ఇందులో కలిపినట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది పంపిణీపై కలెక్టర్లు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

జిల్లాకో డీఆర్వో

రాష్ట్రంలోని 31 జిల్లాలకు 31 మంది డీఆర్వోలను కేటాయించారు. రంగారెడ్డి (5), కామారెడ్డి (4), నల్లగొండ, నాగర్‌కర్నూలు, సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు ముగ్గురు చొప్పున, వనపర్తి, గద్వాల, వరంగల్ (అర్బన్), రాజన్నసిరిసిల్ల జిల్లాలకు ఒక్కరు చొప్పున ఆర్డీవోలను కేటాయించారు. మిగిలిన జిల్లాలకు ఇద్దరు ఆర్డీవోలను మంజూరు చేశారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ స్టెనోగ్రాఫర్, జూనియర్ స్టెనోగ్రాఫర్, ఒక జమేదార్ పోస్టునిచ్చారు. తహశీల్దార్ స్థాయి అధికారులను అత్యధికంగా నల్లగొండ (40), రంగారెడ్డి (38) జిల్లాలకు కేటాయించారు. అత్యల్పంగా వరంగల్ అర్బన్ (18), గద్వాల (19)కు మంజూరు చేశారు. ఒక్కో మండలానికి ఒకరు చొప్పున సర్వేయర్లు, మండల గణాంక అధికారులను కేటాయించారు. ఒకరి నుంచి నలుగురు వరకు అదనంగా చైన్‌మెన్లను ఒక్కో మండలానికి మంజూరు చేశారు. దాదాపు ప్రతి జిల్లాకు నాలుగు రికార్డు అసిస్టెంట్ పోస్టులను కేటాయించగా, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నాగర్‌కర్నూలు, నల్లగొండ జిల్లాలకు ఐదుగురు చొప్పున, వనపర్తి, గద్వాల, వరంగల్ అర్బన్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ముగ్గురు చొప్పున కేటాయించారు. రంగారెడ్డిలో మాత్రం అత్యధికంగా ఏడుగురు రికార్డు అసిస్టెంట్లు ఉండనున్నారు. ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు, ఉపగణాంక అధికారులను కేటాయించారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నాగర్‌కర్నూలు, నల్లగొండ జిల్లాలకు 3, రంగారెడ్డికి 5 పోస్టులు మంజూరు చేశారు.

రానున్నది 'హంగ్'!

సార్వత్రిక ఎన్నికలకు ముహూర్తం ముంచుకొస్తున్న వేళ రెండు ప్రముఖ ఆంగ్ల వార్త చానెళ్లు ఎన్నికల ఫలితాలపై అంచనాలను వెలువరించాయి. 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో కార్వీతో కలిసి ఇండియా టుడే టీవీ, 'నేషనల్ అప్రూవల్ రేటింగ్స్' పేరుతో సీ ఓటర్‌తో కలిసి రిపబ్లిక్ టీవీ.. దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే సాధించే సీట్ల సంఖ్యలో స్వల్ప తేడాలున్నా.. రెండు సంస్థలు రానున్నది హంగేనని తేల్చాయి. ఎన్డీయే 2014 కన్నా 99 సీట్లు కోల్పోయి 237 స్థానాలు గెలుచుకుంటుందని ఇండియాటుడే.. 103 స్థానాలు కోల్పోయి 233 సీట్లను గెలుచుకుంటుందని రిపబ్లిక్ టీవీ తేల్చాయి. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ గతం కన్నా 106 సీట్లు పెంచుకుని 166 వద్ద నిలుస్తుందని ఇండియాటుడే.. 60 నుంచి 167 స్థానాలకు దూసుకుపోతుందని రిపబ్లిక్ టీవీ అంచనా వేశాయి. రెండు సంస్థలు కూడా రెండు కూటములకు చెందని ఇతర పార్టీలే కీలకమని తేల్చిచెబుతున్నాయి.

రిపబ్లిక్ టీవీ అంచనా ప్రకారం.. తెలుగు రాష్ట్రాల్లో, తెలంగాణలో టీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్సీపీలు మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోనున్నాయి. తెలంగాణలోని మొత్తం 17 సీట్లలో 16 టీఆర్ఎస్, 1 ఏఐఎంఐఎం గెలుచుకోనున్నాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 25 సీట్లలో వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్సీపీ 19 సీట్లలో, టీడీపీ 6 స్థానాల్లో విజయం సాధించనున్నాయి.

సర్వే సంస్థ	ఎన్డీఏ	యూపీఏ	ఇతరులు
రిపబ్లిక్ టీవీ	233	167	143
ఇండియాటుడే	237	166	140

- ఇండియాటుడే- కార్వీ; రిపబ్లిక్ టీవీ- సీ ఓటర్ సర్వేల్లో వెల్లడి
- కీలకం కానున్న కాంగ్రెసేతర, బీజేపీయేతర పార్టీలు
- రెండు సర్వేల్లోనూ 140 సీట్లకు పైగా ఇతరులకు
- ఎన్డీయేకు 233, యూపీఏకు 167: రిపబ్లిక్ టీవీ
- తెలంగాణలో టీఆర్ఎస్‌కు 16, ఎంఐఎంకు 1;
- ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్సీపీకి 19, టీడీపీకి 6
- బీజేపీ కూటమికి 237, కాంగ్రెస్ కూటమికి 166 సీట్లని తేల్చిన ఇండియా టుడే సర్వే





న్యూఢిల్లీ: మరో మూణ్నెళ్లలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ అధికార ఎన్డీయే కూటమికి చేదువార్త. ఇండియా టుడే- కార్వీ సంస్థలు సంయుక్తంగా మూడ్ ఆఫ్ ది నేషన్ (ఎంవోటీఎన్) పేరుతో నిర్వహించిన సర్వేలో.. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే అధికార కూటమికి 237 సీట్లు మాత్రమే వస్తాయనీ, గత ఎన్నికలతో పోలిస్తే ఆ కూటమి 99 సీట్లు కోల్పోనుందని తేలింది. అటు యూపీఏ కూటమి కూడా ఎన్డీయే కన్నా తక్కువ సీట్లే గెలుస్తుందనీ, అయితే గతంతో పోలిస్తే ఈ కూటమికి 106 సీట్లు అధికంగా, 166 సీట్లు వస్తాయని సర్వే అంటోంది. రెండు కూటముల్లో దేనికీ సాధారణ ఆధిక్యం (272 సీట్లు) రాదు కాబట్టి పార్లమెంటులో హంగ్ తప్పదని ఎంవోటీఎన్ సర్వే జోస్యం చెబుతోంది. పార్టీల వారీగా చూస్తే బీజేపీకి 202 స్థానాలు, కాంగ్రెస్‌కు 96 స్థానాలు వస్తాయని తేలింది. ఎన్డీయే, యూపీఏల్లో ఏ కూటమిలోనూ లేని ఇతర పార్టీలకు మాత్రం దాదాపు గత ఎన్నికల్లో వచ్చినన్ని సీట్లే ఇప్పుడూ వచ్చే అవకాశముందంది. ఆ పార్టీలన్నీ కలిపి 140 సీట్ల వరకు గెలుస్తాయనీ, ప్రభుత్వ ఏర్పాటుకు వీటి మద్దతు తప్పనిసరని సర్వే పేర్కొంది. అంటే దాదాపు 100 సీట్లు ఈ ఎన్నికల్లో ఎన్డీయే నుంచి చేజారి యూపీఏ ఖాతాలో చేరనున్నాయి. ప్రస్తుతం ఇరు కూటముల్లోనూ లేని ఎస్పీ–బీఎస్పీ–ఆర్ఎల్డీ కూటమి, తృణమూల్, పీడీపీలు యూపీఏలో చేరితే ఆ కూటమికి అధికారం వస్తుందని తెలిపింది. గత ఎన్నికల్లో బీజేపీ ఒక్కటే 282 సీట్లు గెలవగా, ఎన్డీయే కూటమికి కలిపి 336 సీట్లు వచ్చాయి.


ఎన్డీయేకు తగ్గనున్న ఓట్ల శాతం

సీట్లతోపాటు ఎన్డీయే కూటమికి ఓట్ల శాతం కూడా తగ్గనుందని ఎంవోటీఎన్ సర్వే అంటోంది. ఎన్డీయేకు 35 శాతం, యూపీయేకు 33 శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది. ఈ సర్వేలో బీజేపీకి కాస్త ఉపశమనం కలిగించే అంశమేదైనా ఉందంటే.. యూపీఏ కన్నా ఆ కూటమికి ఎక్కువ సీట్లు, ఓట్లు వస్తుండటమే. ఈ అంచనాలన్నీ ఎన్డీయే, యూపీఏల్లో ప్రస్తుతం ఉన్న పార్టీల ఆధారంగా లెక్కించినవే. ఎన్నికల ముందు కూటముల్లో మార్పులు జరిగితే తామ అంచనాలు పూర్తిగా మారిపోయే అవకాశం కూడా ఉందని సర్వే స్పష్టం చేసింది.

ఏ కూటమిలో ఏ పార్టీలు..

ఎన్డీయే: బీజేపీ, డీఎండీకే, పీఎంకే, ఆలిండియా రంగస్వామి కాంగ్రెస్, అప్నాదళ్, బోడో పీపుల్స్ ఫ్రంట్, జేడీ(యూ), ఎల్జేపీ, నాగా పీపుల్స్ ఫ్రంట్, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఆర్‌పీఐ(ఏ), శిరోమణి అకాలీ దళ్, సిక్కిం డెమోక్రటిక్ పార్టీ
యూపీఏ: కాంగ్రెస్, డీఎంకే, జేడీ(ఎస్), కేరళ కాంగ్రెస్ (మణి), ఐయూఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్, ఎన్సీపీ, ఆర్జేడీ, జేఎంఎం.
ఇతరులు: వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్, శివసేన, టీడీపీ, ఏఐఎంఐఎం, అన్నాడీఎంకే, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), ఆప్, ఏజీపీ, ఫార్వర్డ్ బ్లాక్, తృణమూల్, బీజేడీ, ఏఐయూడీఎఫ్, సీపీఐ, సీపీఎం, ఐఎన్ఎల్డీ, పీడీపీ, ఎంఎన్ఎస్, ఎన్ఎల్పీ, ఎస్పీ–బీఎస్పీ–ఆర్ఎల్డీ కూటమి.

ఎవరికి ఎన్ని సీట్లు?



సర్వే జరిగిందిలా..

'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో భాగంగా ఏపీ, తెలంగాణ, అస్సాం, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గుజరాత్, యూపీ సహా 19 రాష్ట్రాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మొత్తం 97 లోక్‌సభ స్థానాలు, 194 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సర్వే సాగింది.ఓ ప్రశ్నావళిని రూపొందించి దాని ఆధారంగా ప్రజలను ర్యాండమ్‌గా ఇంటర్వ్యూ చేశారు. ఈ సర్వేలో 69 శాతం గ్రామీణ, 31 శాతం పట్టణ వాసులు పాల్గొన్నారు. ఈ సర్వేతో పాటు యూపీలోని 20 లోక్‌సభ స్థానాల్లో 1,103 ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రశ్నావళిని స్థానిక భాషల్లోకి అనువాదంచేసి అందించారు. ఈ సర్వేను 2018, డిసెంబర్ 28 నుంచి 2019, జనవరి 8 మధ్యకాలంలో నిర్వహించారు. ఈ సర్వేలో 19 రాష్ట్రాలకు చెందిన 13,179 మంది పాల్గొన్నారు.


మళ్లీ ఎన్డీఏనే రావాలి!

ఈరోజే లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి ఓటు వేస్తామని సర్వేలో పాల్గొన్న 60% మంది చెప్పారు. ఇక 32% ఎన్డీఏకు ఓటు వేయబోమని తేల్చి చెప్పారు. 8% మాత్రం ఎవరికి ఓటేసేది వెల్లడించలేదు. సర్వేలో అభిప్రాయాలను లెక్కలోకి తీసుకుంటే ఈసారి ఎన్డీఏ సర్కారుకు 237 సీట్లు వచ్చే చాన్సుంది.


ప్రాంతాల వారీగా సీట్లు, ఓట్ల శాతం

ఎన్డీయే | యూపీఏ | ఇతర పార్టీలు


ఉత్తర భారతంలో..




దక్షిణ భారతంలో..



పశ్చిమలో..



తూర్పున..



ఎన్డీయేకు మైనస్.. యూపీయేకు ప్లస్

కోల్‌కతాలో తృణమూల్ నేతృత్వంలో విపక్షాల మెగా ర్యాలీ, యూపీలో కాంగ్రెస్ లేకుండానే ఎస్పీ–బీఎస్పీ కూటమి ఏర్పాటు, క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక ఆగమనం తదితరాల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ పరిణామాలు చకచకా మారిపోతున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఏ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయో అంచనావేస్తూ రిపబ్లిక్ టీవీ, సీ ఓటర్ ఉమ్మడిగా జరిపిన సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి. పలు మిత్ర పక్షాలు దూరం కావడంతో గతంతో పోలిస్తే ఎన్డీయేకు ఈసారి 103 స్థానాలు తగ్గే అవకాశాలున్నాయి. ఒక్క యూపీలోనే ఎస్పీ–బీఎస్పీ దెబ్బకు 45 సీట్లు కోల్పోయే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రధాన విపక్షం కాంగ్రెస్ గొప్పగా పుంజుకుని 160కి పైగా సీట్లు దక్కించుకోవచ్చు. హంగ్ ఏర్పడే నేపథ్యంలో 140 సీట్లు కైవసం చేసుకునే ఇతరులు ప్రభుత్వ ఏర్పాటులో కీలకం కానున్నారు. ఇదే జరిగితే తెలుగు రాష్ట్రాల పార్టీలు టీఆర్ఎస్, వైఎస్సార్సీపీలు కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు మార్గం సుగమం చేసుకున్నట్లే.

ఆయా రాష్ట్రాల్లో రిపబ్లిక్ టీవీ సర్వే ఫలితాలు

రాష్ట్రం	ఎన్డీయే	యూపీయే	ఇతరులు
ఉత్తరప్రదేశ్(80)	25	4	51(ఎస్పీ-బీఎస్పీ)
మహారాష్ట్ర(48)	16	28	4(శివసేన)
పశ్చిమబెంగాల్(42)	7	1	34(టీఎంసీ)
బిహార్(40)	35	5	0
తమిళనాడు(39)	0	39	0
ఆంధ్రప్రదేశ్(25)	0	0	19(వైఎస్సార్సీపీ), 6(టీడీపీ)
తెలంగాణ(17)	0	0	16(టీఆర్ఎస్), 1(ఎంఐఎం)
కర్ణాటక(28)	14	14	0
గుజరాత్(26)	24	2	0
మధ్యప్రదేశ్(29)	23	6	0
రాజస్తాన్(25)	18	7	0
ఢిల్లీ(7)	7	0	0

దక్షిణాదిలోనే యూపీయే

మిగతా అన్ని చోట్లా ఎన్డీయేకే ఆధిక్యం

ఎంవోటీఎన్ సర్వే ప్రాంతాలవారీ ఫలితాలను చూస్తే ఒక్క దక్షిణాదిలో తప్ప ఉత్తర, పశ్చిమ, తూర్పు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమికే అధిక ఓట్లు, సీట్లు వస్తున్నాయి.
ఉత్తర భారతం: ఈ ప్రాంతంలోని ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్, హరియాణ, ఢిల్లీ, పంజాబ్‌లలో ఎంవోటీఎన్ సర్వే జరిగింది. ఇక్కడ ఎన్డీయేకు 40% ఓట్లు, 66 సీట్లు వస్తాయనీ, అటు యూపీఏకు కేవలం 23% ఓట్లు, 20 సీట్లు సర్వే తెలిపింది. ఇక ఇతర పార్టీలకు 37% ఓట్లు, 65 సీట్లు వస్తాయంది. యూపీఏ కన్నా ఇతర పార్టీలకే ఇక్కడ అధిక సీట్లు రానున్నాయి.
పశ్చిమ భారతం: గుజరాత్, మహారాష్ట్రలతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లను కూడా ఈ సర్వే పశ్చిమ ప్రాంతంగా పేర్కొంది. ఇక్కడ ఇతరుల పాత్ర పెద్దగా ఉందనీ, యూపీఏ కన్నా ఎన్డీయేకు ఓట్ల శాతం కొంచెం ఎక్కువగా ఉంటున్నప్పటికీ సీట్ల సంఖ్యలో మాత్రం భారీ వ్యత్యాసం ఉంటుందని తెలిపింది. ఎన్డీయేకు 46% ఓట్లు, 76 సీట్లు, యూపీఏకు 42% ఓట్లు, 40 సీట్లు, ఇతరులకు 12 శాతం ఓట్లు తప్ప సీట్లేవీ రావని సర్వే అంటోంది.
తూర్పు భారతం: బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, అస్సాం, జార్ఖండ్‌ల్లో సర్వే జరిగింది. ఇక్కడా ఎన్డీయేదే పై చేయి. ఎన్డీయే కూటమికి 37% ఓట్లు, 69 సీట్లు, యూపీఏకు 25% ఓట్లు, 28 సీట్లు, ఇతర పార్టీలకు 38% ఓట్లు, 45 సీట్లు వస్తాయని ఎంవోటీఎన్ సర్వే పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో బీజేపీ గతంలో కన్నా ఇప్పుడు బలపడినట్లుగా సర్వే తెలిపింది.
దక్షిణ భారతం: యూపీఏకు ఆధిక్యం ఉన్న ప్రాంతం ఇదొక్కటే. అదే సమయంలో దక్షిణాదిలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి పరిస్థితి దారుణంగా ఉంది. బీజేపీ 18 శాతం ఓట్లతో 26 సీట్లు సాధిస్తుందనీ, ఇతర పార్టీలు 39 శాతం ఓట్లు తెచ్చుకుని 30 సీట్లు గెలుస్తాయని సర్వే తెలిపింది. యూపీఏకు 43 శాతం సీట్లు, 78 సీట్లు వస్తాయంది.




గురువారం ఢిల్లీలో 'ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు' అందుకున్న చిన్నారులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

యూపీఏ+ఎస్పీ+బీఎస్పీ+టీఎంసీ=269

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏతో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ), తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీలు జతకడితే నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కావడం కష్టమేనని ఇండియాటుడే 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో తేలింది. ప్రస్తుతమున్న విభేదాలను పక్కన పెట్టేలా ఈ మూడు పార్టీల అధినేతలను రాహుల్ గాంధీ ఒప్పించగలిగితే కొత్తగా ఏర్పడే మహాకూటమి లోక్‌సభ ఎన్నికల్లో 269 స్థానాలు దక్కించుకుంటుందని సర్వే తెలిపింది. అదే సమయంలో ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి కేవలం 219 స్థానాలకు పరిమితమవుతుందని వెల్లడించింది. ఈ ఎన్నికల్లో మిగిలిన పార్టీలకు 55 స్థానాలు దక్కుతాయని అంచనా వేసింది. మ్యాజిక్ ఫిగర్ 272 సీట్లకు కొద్దిదూరంలోనే ఆగిపోయినప్పటికీ ఇతర పార్టీల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం మహాకూటమికే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడింది. ఇక ఓట్ల శాతం విషయానికి వస్తే ఈ ఎన్నికల్లో ఎన్డీయేకు 35 శాతం, యూపీఏ, ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ కూటమికి 44 శాతం వరకూ దక్కించుకునే అవకాశముందని తెలిపింది.

అమెరికా బ్యాంకులో కాల్పులు



జెఫెన్ జేవర్

మయామి/వాషింగ్టన్: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం సెబ్రింగ్ పట్టణంలోని ఓ బ్యాంకులో దుండగుడు గురువారం జరిపిన కాల్పుల్లో ఐదుగురు మరణించారని పోలీసులు చెప్పారు. సెబ్రింగ్‌కు చెందిన 21 ఏళ్ల జెఫెన్ జేవర్‌ను నిందితుడిగా గుర్తించామని వెల్లడించారు. కాల్పులు వెనుక నిందితుడి ఉద్దేశమేంటో ఇంకా తెలియదనీ, విచారణ జరుగుతోందని సెర్బింగ్ పోలీస్ చీఫ్ తెలిపారు. అమెరికాలో ఆయుధాల వాడకానికి నిబంధనలు కొంత సరళంగా ఉండటంతో చాలా మంది దగ్గర తుపాకులు ఉంటాయి. నిబంధనలను కఠినతరం చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం ఒక్క 2017 ఏడాదిలోనే వివిధ కాల్పుల ఘటనల్లో అమెరికాలో మొత్తం 40 వేల మంది మరణించారు. నిందితుడికి వేగంగా, కఠినమైన శిక్ష పడేలా చూస్తామని ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీశాంటిస్ చెప్పారు.

1978 తర్వాత వచ్చిన వారికి నో 'కోటా'

నిర్ణయించిన గుజరాత్ ప్రభుత్వం

అహ్మదాబాద్: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 1978 తర్వాత రాష్ట్రానికి వచ్చి స్థిరపడిన వారికి (సెటిలర్లకు) ఈడబ్ల్యూఎస్ కింద వచ్చే రిజర్వేషన్లు అమలు కావని స్పష్టం చేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నితిన్ పటేల్ ఈ మేరకు వెల్లడించారు. రిజర్వేషన్లకు కావాల్సిన అర్హతల విషయంలో రూ. 8 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండాలనే నిబంధనను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. సొంతిళ్లు, భూమి విషయాల్లో కేంద్రం విధించిన నిబంధనలను రాష్ట్రంలో వర్తింపజేయబోమని వెల్లడించారు.

మలేసియా రాజుగా సుల్తాన్ అబ్దుల్లా

కౌలాలంపూర్: మలేసియా కొత్త రాజుగా సుల్తాన్ అబ్దుల్లా సుల్తాన్ అహ్మద్ షా నియమితులయ్యారు. రాజుగా ఉన్న సుల్తాన్ మహమ్మద్–5 పదవి నుంచి తప్పుకోవడంతో కొత్త చక్రవర్తిని ఎన్నుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అంతకుముందు సుల్తాన్ మహమ్మద్–5 మెడికల్ లీవ్‌ను తీసుకున్నారు. ఈ సమయంలోనే రష్యాకు చెందిన మాజీ మిస్ మాస్కోను పెళ్లాడినట్లు వార్తలొచ్చాయి. అయితే మహమ్మద్–5 పదవీకాలం పూర్తికాకుండానే వైదొలిగారు.

యూపీలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి

- ప్రియాంక, సింధియాల లక్ష్యమిదే
- అమేథీ బహిరంగ సభలో రాహుల్



అమేథీ: ఉత్తరప్రదేశ్‌లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత ప్రియాంక గాంధీపై ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి బలంగంతో బరిలోకి దిగుతామని చెప్పారు. తన నియోజకవర్గం అమేథీలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ గురువారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. 'ప్రియాంక గాంధీ, జ్యోతిరాదిత్య సింధియాకు ఓ లక్ష్యం నిర్దేశించాం. అదేంటంటే, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడమే. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యల మాదిరిగా నేను 'బీజేపీ ముక్త్ భారత్' అని నినాదం ఇవ్వను. బీజేపీ పట్ల గౌరవంతో మాట్లాడతా. గుజరాత్, యూపీ, తమిళనాడు..ఇలా రాష్ట్రమేదైనా కాంగ్రెస్ పూర్తి బలంతో, దూకుడుగానే పోరాడుతుంది. యూపీలో అసెంబ్లీ ఎన్నికలు(2022లో జరగనున్నాయి) పూర్తయిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తారు' అని రాహుల్ అన్నారు. అమేథీ నియోజకవర్గానికి తన తల్లి సోనియా, సోదరి ప్రియాంక సైనికుల వంటి వారని అభివర్ణించారు.

మోదీ విద్వేషానికి ప్రతీక: రఫేల్ ఒప్పందం, బడా పారిశ్రామికవేత్తల రుణాల ఎగవేత వ్యవహారంలో ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు కొనసాగించారు. వాచ్‌మెన్ అని చెప్పుకునే వ్యక్తి దొంగ అని నిరూపితమైందని ప్రధాని మోదీపై పరోక్షంగా మండిపడ్డారు. మోదీ విద్వేషానికి ప్రతీక అని, 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్ని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు.

ప్రియాంక ప్రభావం ఉండదు: బీజేపీ
ప్రియాంక గాంధీ రాజకీయ ఆగమనంతో రాబోయే లోక్‌సభ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం ఉండదని బీజేపీ పేర్కొంది. ఆమెను తూర్పుయూపీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన తరువాత ఢిల్లీలో నెలకొన్న సందడి, ఆ ప్రాంతంలో కనిపించలేదని తెలిపింది.

అహ్మద్ వనీకి 'అశోక చక్ర'



న్యూఢిల్లీ: ఉగ్రవాదం బాటవీడి సైన్యంలో చేరి అమరుడైన లాన్స్‌నాయక్ నజీర్ అహ్మద్ వనీ(38)కి కేంద్రం అశోకచక్ర పురస్కారాన్ని ప్రకటించింది. 2018, నవంబర్ 25న షోపియాన్ జిల్లాలోని హీరాపూర్ గ్రామంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తీవ్రంగా గాయపడ్డ అహ్మద్ వనీ ప్రాణాలు కోల్పోయారు. శరీరంలోకి బుల్లెట్లు దిగి రక్తం కారుతున్నప్పటికీ ఓ లష్కరే కమాండర్ సహా ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చిన తర్వాతే ఆయన నేలకొరిగారు. ఈ నేపథ్యంలో వనీ చూపిన ధైర్యసాహసాలకు గానూ శాంతి సమయంలో అందించే అత్యున్నత సైనిక పురస్కారం అశోకచక్రను ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వనీ భార్య మహజబీన్‌కు ఈ పురస్కారాన్ని అందించనున్నారు. 2004లో వనీ ఆర్మీలోని 'జమ్మూకశ్మీర్ 162 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్'లో చేరారు. ఉగ్రవాదులపై పోరాటంలో చూపిన తెగువకు గానూ 2007, 2018లో సేనామెడల్‌ను అందుకున్నారు. కుల్గామ్ జిల్లాలోని ఛెకీ అష్మూజీ గ్రామానికి చెందిన వనీకి భార్య మహజబీన్‌తో పాటు కుమారులు అథర్, షహీద్ ఉన్నారు.

ఆయనకు డ్యూటీనే అత్యుత్తమం
నజీర్ వనీ కుటుంబాన్ని అమితంగా ప్రేమించేవారని ఆయన భార్య, ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మహజబీన్ తెలిపారు. వనీ ధైర్యవంతుడైన సైనికుడనీ, తన రాష్ట్రంలో శాంతి కోసం పరితపించేవాడని ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. జీవితాంతం వనీ పలు ప్రమాదాలను ఎదుర్కొన్నాడనీ, చాలామందికి స్ఫూర్తిగా నిలిచాడని జవాన్లు అన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణపై స్టేకు ససేమిరా



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టానికి చేసిన సవరణలపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వేధింపుల కేసులో నిందితులకు ముందస్తు బెయిలు ఇవ్వొద్దనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం ఈ సవరణల్లో పునరుద్ధరించిన సంగతి తెలిసిందే. 2018 మార్చి 20వ తేదీన ఎస్సీ, ఎస్టీ చట్టంలో సుప్రీంకోర్టు సవరణలు చేసింది. ఈ సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను ఒకేసారి విచారిస్తామని జస్టిస్ ఏకే సిక్రి నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు విచారణకు ప్రత్యేక ధర్మాసనాన్ని పునర్ నియమించాలని సూచించింది. ఈ పిటిషన్లపై విచారణకు జస్టిస్ యూయూ లలిత్‌ను చేర్చి తిరిగి ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. గతేడాది ఎస్సీ, ఎస్టీ చట్టంపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో జస్టిస్ లలిత్ భాగమైనందున ఆయనను ఇందులో చేర్చాలని సూచించింది. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని, దీనికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై తక్షణ అరెస్టులను నిలువరించాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను తోసిపుచ్చుతూ కేంద్ర ప్రభుత్వం నూతన సవరణలు చేపట్టిన సంగతి తెలిసిందే.

కొలిక్కిరాని సీబీఐ కొత్త చీఫ్ ఎంపిక

మళ్లీ భేటీకానున్న ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ

న్యూఢిల్లీ: సీబీఐ నూతన డైరెక్టర్ ఎంపిక కోసం ప్రధాని మోదీ నేతృత్వంలోని గురువారం జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశం ఏ నిర్ణయం తీసుకోకుండానే అసంపూర్ణంగా ముగిసింది. 'పదవికి అర్హులైన జాబితాలోని అధికారుల పేర్లపై సెలక్షన్ కమిటీ సభ్యులు గురువారం చర్చించారు. త్వరలోనే మరోసారి కమిటీ సమావేశమై కొత్త చీఫ్ పేరును ప్రకటిస్తుంది' అని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసంలో జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు సీజే రంజన్ గొగోయ్, లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్నారు. 'కేవలం పేర్లపైనే చర్చ జరిగింది. జాబితాలోని అధికారుల కెరీర్, అనుభవం తదితర వివరాలను పొందుపరచలేదు. అందుకే సంబంధిత వివరాలను కోరాం. వచ్చే వారం కమిటీ సమావేశం ఉండొచ్చు' అని ఖర్గే అన్నారు.

'సీబీఐ' విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ సిక్రీ



న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించడాన్ని సవాల్ చేస్తూ వచ్చిన పిటిషన్ విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ తప్పుకున్నారు. గత సోమవారమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ కూడా ఈ కేసును తాను విచారించబోనంటూ తప్పుకోవడం తెలిసిందే. సీబీఐకి కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసే అత్యున్నత స్థాయి కమిటీలో జస్టిస్ గొగోయ్ సభ్యుడు కాగా, సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తొలగించిన అత్యున్నత స్థాయి కమిటీలో జస్టిస్ సిక్రీ కూడా ఉన్నారు. ఈ కారణాలనే చూపుతూ వీరిద్దరూ ఈ కేసు విచారణ నుంచి తప్పుకున్నారు. ఈ కేసును జస్టిస్ సిక్రీ విచారిస్తే తమకేమీ అభ్యంతరం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది దుష్యంత్ దవే, అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ చెప్పినప్పటికీ పక్కకు తప్పుకునేందుకే జస్టిస్ సిక్రీ మొగ్గు చూపారు.



ఢిల్లీలో ప్రసంగిస్తున్న సీఈసీ సునీల్ అరోరా

మళ్లీ బ్యాలెట్‌కు నో

ఈవీఎంలపై కావాలనే బురదచల్లుతున్నారు • కేంద్ర ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) విశ్వసనీయతపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) సునీల్ అరోరా స్పందించారు. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలన్న కొన్ని రాజకీయ పక్షాల డిమాండ్‌కు తలొగ్గబోమని స్పష్టం చేశారు. మళ్లీ బ్యాలెట్ బాక్సులను వినియోగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈవీఎంలను కొందరు ఫుట్‌బాల్‌లా ఆడుకుంటున్నారనీ, వాటి పనితీరుపై ఉద్దేశపూర్వకంగానే బురద చల్లుతున్నారని మండిపడ్డారు.

బ్యాలెట్‌తో సిబ్బందికి నరకమే..
ఢిల్లీలో గురువారం జరిగిన 'మేకింగ్ అవర్ ఎలక్షన్స్ ఇన్‌క్లూజివ్ అండ్ యాక్సెసబుల్' అనే కార్యక్రమంలో అరోరా మాట్లాడుతూ.. 'నేను ఒక విషయాన్ని స్పష్టం చేయదలచుకున్నాను. ఇప్పుడే కాదు.. భవిష్యత్‌లో కూడా మేం బ్యాలెట్ పేపర్ల విధానానికి మొగ్గుచూపబోం. మనుషుల సాయంతో బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం, కౌంటింగ్‌లో తీవ్రమైన ఆలస్యం.. ఇదంతా పోలింగ్ సిబ్బందికి నరకంలా ఉంటుంది. రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి విమర్శలు, సలహాలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇదే సమయంలో బెదిరింపులు, ఒత్తిడి, విజ్ఞప్తులకు తలొగ్గి ఈవీఎంలను వదిలి బ్యాలెట్ విధానానికి మళ్లే ప్రసక్తే లేదు. మనం ఈవీఎంలను ఫుట్‌బాల్‌గా ఎందుకు మార్చేశాం? వాటిపై ఉద్దేశపూర్వకంగా బురదచల్లే కార్యక్రమం కొనసాగుతోంది' అని తెలిపారు.

ఒకే ఫలితం రావాలి కదా..
ఈవీఎంల సమర్థతపై స్పందిస్తూ..'2014 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన కొన్నిరోజులకే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భిన్నమైన ఫలితాలు వచ్చాయి. ఆ తర్వాత హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, త్రిపుర, నాగాలాండ్, మిజోరంతో పాటు తాజాగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్తాన్.. ఇలా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోరకంగా ఎన్నికల ఫలితాలు నమోదయ్యాయి. నిజంగా ఈవీఎంలలో సమస్య ఉంటే ఇక్కడంతా ఒకేరకమైన ఫలితాలు రావాలి కదా. ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)లో రూపొందిస్తారు. వీటిని హ్యాక్ లేదా ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం. ఇటీవల రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 1.76 లక్షల పోలింగ్ కేంద్రాల్లో కేవలం ఆరంటే ఆరు చోట్ల మాత్రమే ఈవీఎంల్లో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ విషయంలో అలసత్వం చూపకుండా మేం వెంటనే స్పందించి పరిస్థితిని చక్కదిద్దాం' అని అరోరా వెల్లడించారు. ఇక వీవీప్యాట్ యంత్రాలకు సంబంధించి చిన్నచిన్న ఘటనలు నమోదయ్యాయని అంగీకరించారు. వీవీప్యాట్ యంత్రాల వినియోగం విషయంలో ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామనీ, ఈ తప్పుల నుంచి నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు.

'బ్యాలెట్'తోనే ఎన్నికలు జరపండి



త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈవీఎంల సమర్థతపై తలెత్తిన వివాదంతో మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే నీలినీడలు కమ్ముకున్నాయని వ్యాఖ్యానించారు. రాజకీయ అవసరాల కోసం సాంకేతికను దుర్వినియోగం చేస్తున్నారనీ, ఇందులో తమకు ఎలాంటి అనుమానం లేదని స్పష్టం చేశారు. విద్యావంతులైన ప్రజలు ఈవీఎంలకు వ్యతిరేకంగా గొంతు విప్పాలన్నారు. హ్యాకర్ సయిద్ షుజా చేసిన ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం 25-1-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
87 ▲	18 ▲
36,195	10,850

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,052	▲	28
డోజోన్స్	24,505	▼	70
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,819	▼	24
డాక్స్	11,130	▲	59
షాంఘై	2,592	▲	11
నికాయ్	20,575	▼	19

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో ● కొనుగోలు ● అమ్మకం

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.55	72.1
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.1	94.2
€	యూరో	ఎస్‌బీఐ	80.25	82.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63	68
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.8	51.9
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.8	54.1
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.65	20.7
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.4	11.1

‘యస్’ బాస్.. రవ్‌నీత్ సింగ్ గిల్!

- సీఈఓగా నియామకానికి ఆమోదం తెలిపిన ఆర్‌బీఐ
- మార్చి 1 నుంచి రాణా కపూర్ స్థానంలో పగ్గాలు
- అనిశ్చితి తొలగడంతో జోరుగా పెరిగిన షేరు
- ఈ క్యూ3లో 7 శాతం తగ్గిన నికర లాభం
- ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సెగతో పెరిగిన కేటాయింపులు





ముంబై: ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన యస్ బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓగా రవ్‌నీత్ సింగ్ గిల్ నియామకానికి ఆర్‌బీఐ ఆమోదం తెలిపింది. ఈ నెల 31తో పదవీ కాలం పూర్తవుతున్న రాణా కపూర్ స్థానంలో రవ్‌నీత్ సింగ్ గిల్ రానున్నారు. ప్రస్తుతం ఆయన డాయిష్ బ్యాంక్ ఇండియా అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రవ్‌నీత్ సింగ్ గిల్ నియామాకానికి ఆర్‌బీఐ ఆమోదం తెలిపిందని, మార్చి 1వ తేదీకి ముందే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని యస్ బ్యాంక్ తెలిపింది. 29న బ్యాంక్ డైరెక్టర్ల బోర్డ్ సమావేశం జరుగుతుందని పేర్కొంది.

28 ఏళ్ల బ్యాంకింగ్ అనుభవం...

2012, ఆగస్టు నుంచి రవ్‌నీత్ సింగ్ గిల్ డాయిష్ బ్యాంక్ ఇండియా సీఈఓగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆయనకు దాదాపు 28 ఏళ్ల అపారమైన అనుభం ఉంది. యస్ బ్యాంక్ ప్రమోటర్లలో ఒకరైన రాణా కపూర్‌ను సీఈఓ, ఎమ్‌డీ పదవి నుంచి వైదొలగాలని గత ఏడాది సెప్టెంబర్‌లోనే ఆర్‌బీఐ ఆదేశించింది. కపూర్ పదవీ కాలాన్ని మరో మూడేళ్లపాటు పొడిగించాలన్న బోర్డ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. దీనికి గల కారణాలను ఆర్‌బీఐ వెల్లడించకపోయినప్పటికీ, కపూర్ హయాంలో మొండి బకాయిల విషయంలో అవకతవకలు జరిగాయని అందుకే ఆర్‌బీఐ ఆయన పదవీ కాలాన్ని పొడిగించ లేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. అప్పటి నుంచి చూస్తే ఈ షేర్ ధర మూడింట రెండొంతులకు పైగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో యస్‌బ్యాంక్ సీఈఓ విషయమై అనిశ్చితి తొలగిపోవడంతో యస్ బ్యాంక్ షేర్ జోరుగా పెరిగింది. బీఎస్‌ఈలో 8% లాభంతో రూ.214 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 19% ఎగసి రూ.235ను తాకింది. షేర్ జోరు కారణంగా యస్ బ్యాంక్ మార్కెట్ క్యాప్ ఒకేరోజు రూ.3,839 కోట్లు పెరిగి రూ.49,460 కోట్లకు చేరింది.

నికర వడ్డీ ఆదాయం 41 శాతం అప్...

యస్ బ్యాంక్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 7 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.1,077 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.1,002 కోట్లకు తగ్గిందని యస్ బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం 7 శాతం ఎగసి రూ.3,557 కోట్లకు పెరిగిందని బ్యాంక్ ప్రస్తుత సీఈఓ రాణా కపూర్ పేర్కొన్నారు. నికర వడ్డీ ఆదాయం 41 శాతం పెరిగి రూ.2,666 కోట్లకు చేరింది. 42 శాతం వృద్ధితో రుణాలు రూ.2,43,885 కోట్లకు, డిపాజిట్లు 30 శాతం వృద్ధి చెంది రూ.2.22,758 కోట్లకు చేరాయి. గత క్యూ3లో 3.5 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ3లో 3.3 శాతానికి తగ్గిందని వెల్లడించారు.

తగ్గిన రుణ నాణ్యత..

యస్ బ్యాంక్ రుణ నాణ్యత ఒకింత తగ్గింది. గత క్యూ3లో 1.72%గా ఉన్న స్థూల మొండిబకాయిలు ఈ క్యూ3లో 2.1 శాతానికి పెరిగాయి. నికర మొండి బకాయిలు 0.93% నుంచి 1.18%కి చేరాయి.

తప్పని ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సెగ !

ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఒక మౌలిక రంగ దిగ్గజ గ్రూప్ కంపెనీలకు(ఐఎల్అండ్ఎఫ్ఎస్‌గా అంచనా) రూ.571 కోట్ల మేర రుణాలిచ్చామని, అందుకని నికర కేటాయింపులు రూ.550 కోట్లకు పెరిగాయని రాణా కపూర్ పేర్కొన్నారు.

ఇండిగో కొత్త సారథి రణజయ్ దత్తా

ఐదేళ్లు సీఈవోగా ఉంటారని ప్రకటించిన కంపెనీ



న్యూఢిల్లీ: విమానయాన రంగంలో ఎంతో అనుభవం ఉన్న రణజయ్ దత్తాను నూతన సీఈవోగా ఐదేళ్ల కాలానికి నియమించినట్లు ఇండిగో ప్రకటించింది. ఆదిత్య ఘోష్ ఇండిగోను వీడిన ఎనిమిది నెలల తర్వాత ఎట్టకేలకు సంస్థ ఈ నియామకాన్ని పూర్తి చేసింది. ఇక, సెబీ మాజీ చైర్మన్ ఎం.దామోదరన్‌ను కంపెనీ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపింది. ఇండిగో సహ వ్యవస్థాపకుడు, తాతాల్కిక సీఈవో రాహుల్ భాటియా నుంచి దత్తా ఈ బాధ్యతలను స్వీకరించనున్నారు. అంతర్జాతీయ మార్గాల్లో ఈ ఏడాది పెద్ద ఎత్తున విస్తరణ ఉంటుందని కంపెనీ తెలిపింది. రణజయ్ దత్తా ప్రస్తుతం యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆ సంస్థలో ఆయన 20 ఏళ్ల నుంచి పనిచేస్తూ.. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ప్లానింగ్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మెయింటెనెన్స్), వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్), వైస్ ప్రెసిడెంట్ (ఐటీ) వంటి కీలక పదవులను నిర్వహించారు. ఎయిర్ సహారా సంస్థకు ప్రెసిడెంట్‌గా రెండేళ్లు పనిచేశారు. ఎయిర్ కెనడా, యూఎస్ ఎయిర్‌వేస్ సంస్థలకు అడ్వైజర్‌గానూ వ్యవహరించారు. ‘‘ఇండిగో ప్రపంచ స్థాయి ఎయిర్‌లైన్ సంస్థగా అపూర్వ విజయం సాధించింది. ఈ సంస్థలో నాకు భాగస్వామ్యం కల్పించినందుకు సంతోషంగా ఉంది. ప్రపంచంలోనే అధికంగా వృద్ధి చెందుతున్న సంస్థల్లో ఇండిగో ఒకటి. భవిష్యత్తులో మరింత వేగంగా వృద్ధిని సాధించేందుకు అవకాశాలు ఉన్నాయి’’ అని దత్తా పేర్కొన్నారు. ఇండిగోకు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మాతృ సంస్థ. డిసెంబర్‌తో ముగిసిన కాలానికి ఈ సంస్థ నికర లాభం 75 శాతం క్షీణించి రూ.190 కోట్లకు పరిమితమయింది. ఇండిగోకు ప్రెసిడెంట్, హోల్‌టైమ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఆదిత్య ఘోష్ ఇటీవలే హోటల్ అగ్రిగేటర్ ఓయోలో చేరిన సంగతి తెలిసిందే.

మెర్సిడెస్ బెంజ్.. ‘వీ క్లాస్’

లగ్జరీ ఎంపీవీ ప్రారంభ ధర రూ.68.4 లక్షలు



ముంబై: దేశ లగ్జరీ కార్ల మార్కెట్‌లో 40 శాతం వాటాతో అగ్రగామి సంస్థగా ఉన్న జర్మనీ కార్ల కంపెనీ మెర్సిడెస్ బెంజ్ బహుళ వినియోగ వాహన విభాగంలోకి(ఎంపీవీ) తిరిగి అడుగుపెట్టింది. కొత్తగా వీ–క్లాస్ శ్రేణిలో 6 సీట్ల ఎక్స్‌క్లూజివ్, 7 సీట్ల ఎక్స్‌ప్రెషన్ పేరుతో రెండు కార్లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 90కి పైగా దేశాల్లో ఈ సంస్థ వీ క్లాస్ శ్రేణి కార్లను విక్రయిస్తోంది. స్పానిష్ ప్లాంట్ నుంచి వీటిని దేశంలోకి దిగుమతి చేసుకుంటామని ప్రకటించింది. 2.2 లీటర్ల డీజిల్ ఇంజిన్లతో కూడిన వీటి ధరలు రూ.68.40–81.90 లక్షల మధ్య ఉన్నాయి. ఈ ఏడాది 10 కొత్త మోడళ్ల విడుదల ప్రణాళికలతో ఉన్న ఈ సంస్థ నుంచి తొలి విడుదల వీ క్లాస్ కావడం గమనార్హం. ఈ ఏడాది మరో 20 పట్టణాలకు విస్తరించనున్నట్టు కంపెనీ తెలిపింది. మెర్సిడెస్ బెంజ్ ఆర్ క్లాస్ పేరుతో గతంలో ఎంపీవీ విభాగంలో కార్లను ప్రవేశపెట్టగా, తగిన అమ్మకాలు లేకపోవడంతో తప్పుకుంది. 2018లో 15,538 వాహనాలను విక్రయించి వరుసగా నాలుగో ఏడాది లగ్జరీ కార్ల విభాగంలో ఈ సంస్థ తొలి స్థానంలో నిలిచింది.

చందా కొచర్‌పై సీబీఐ కేసు

- వీడియోకాన్‌తో క్విడ్ ప్రో కో వ్యవహారం...
- రుణాలిచ్చి ముడుపులు తీసుకున్నారని ఆరోపణ
- ఎఫ్ఐఆర్‌లో భర్త దీపక్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ ధూత్
- వీడియోకాన్, న్యూపవర్ కార్యాలయాల్లో సోదాలు
- కామత్ సహా పలువురు బ్యాంకర్ల పాత్రపై విచారణకు అవకాశం



న్యూఢిల్లీ: వీడియోకాన్ గ్రూప్‌నకు మంజూరు చేసిన రుణాల వివాదంలో ప్రైవేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచర్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. క్రిమినల్ కుట్ర, మోసం, అవినీతి ఆరోపణలతో చందా కొచర్‌తో పాటు ఆమె భర్త దీపక్ కొచర్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌లపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. కొచర్ తన పదవీకాలంలో వీడియోకాన్ గ్రూప్‌నకు రూ. 1,875 కోట్ల మేర ఆరు రుణ ప్రతిపాదనలను క్లియర్ చేశారని ఎఫ్ఐఆర్‌లో అభియోగాలు ఉన్నాయి. ఈ లావాదేవీల కారణంగా బ్యాంక్‌కు రూ. 1,730 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. వీడియోకాన్ గ్రూప్, దాని అనుబంధ కంపెనీలకు ఇచ్చిన రూ. 1,875 కోట్ల విలువ చేసే ఆరు రుణాలను క్లియర్ చేసిన కమిటీలో సభ్యులైన ప్రస్తుత ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో సందీప్ బక్షితో పాటు ఇతర అధికారులు సంజయ్ చటర్జీ, జరీన్ దారువాలా, రాజీవ్ సబర్వాల్, కేవీ కామత్, హోమీ ఖుస్రోఖాన్‌ల పాత్రపై కూడా దృష్టి సారించనున్నట్లు సీబీఐ వర్గాలు వివరించాయి. ఎఫ్ఐఆర్ దరిమిలా గురువారం వీడియోకాన్ గ్రూప్, దీపక్ కొచర్‌కు చెందిన న్యూపవర్ రెన్యూవబుల్స్, ధూత్ ఒకప్పుడు ప్రమోట్ చేసిన సుప్రీమ్ ఎనర్జీ సంస్థ ముంబై, ఔరంగాబాద్ కార్యాలయాల్లో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు.

క్విడ్ ప్రో కో వివాదం..

వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాల మంజూరుకు చందా కొచర్ తోడ్పడినందుకు గాను ప్రతిగా ఆమె భర్త దీపక్ కొచర్‌కు చెందిన న్యూపవర్‌లో తన సుప్రీం ఎనర్జీ సంస్థ ద్వారా ధూత్ రూ.64 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఆరోపణలున్నాయి. 2017 డిసెంబర్‌లో సీబీఐ ఈ వివాదంపై ప్రాథమిక విచారణ ప్రారంభించింది. బ్యాంకు నియమ, నిబంధనలకు విరుద్ధంగా ఈ రుణాలు మంజూరైనట్లు ఆరోపణలు ఉన్నాయని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఇలా వీడియోకాన్ గ్రూప్‌నకు ఇచ్చిన రుణాల్లో అధిక భాగం లోన్‌లు మొండిబాకీలుగా మారడంతో బ్యాంక్‌కు దాదాపు రూ. 1,730 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సీబీఐ వర్గాలు వివరించాయి. ఎఫ్ఐఆర్‌లో చందా, దీపక్, ధూత్‌లతో పాటు న్యూపవర్ రెన్యూవబుల్స్, సుప్రీం ఎనర్జీ, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్‌పై అభియోగాలు ఉన్నాయి.

షేర్లు 3 శాతం దాకా డౌన్..

కొచర్, ధూత్‌లపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో గురువారం ఐసీఐసీఐ బ్యాంక్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ షేర్లు ఒకదశలో సుమారు మూడు శాతం దాకా పడ్డాయి. బీఎస్ఈలో వీడియోకాన్ ఇండస్ట్రీస్ షేరు 2.73% క్షీణించి రూ.2.85 వద్ద, ఐసీఐసీఐ షేరు 0.72% పడి రూ.365 వద్ద క్లోజయ్యాయి.

ఇంత జాప్యం ఎందుకు..

ఐసీఐసీఐ కేసులో రిజర్వ్ బ్యాంక్ వ్యవహరించిన తీరును ప్రభుత్వ రంగ(పీఎస్‌బీ) బ్యాంకర్లు ఆక్షేపించారు. చందా కొచర్‌పై చర్యలకు జాప్యం జరగడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల విషయంలో ఆర్‌బీఐ వేర్వేరుగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ బ్యాంకులను నియంత్రించేందుకు తగినన్ని అధికారాల్లేవన్న ఆర్‌బీఐ.. మరి ప్రైవేట్ బ్యాంకులపై పూర్తి అధికారాలున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. విధానపరమైన చిన్న చిన్న లోపాలకు కూడా పీఎస్‌బీల్లో టాప్ అధికారులపై తక్షణం చర్యలు తీసుకుంటున్న ఆర్‌బీఐ.. స్పష్టమైన ఆధారాలున్నా కొచర్ విషయంలో మాత్రం ఆ పని చేయలేదని బ్యాంకర్లు వ్యాఖ్యానించారు. ప్రక్రియాపరమైన వైఫల్యాల కారణంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎండీ, ఇద్దరు ఈడీలపై సత్వరం వేటేసిన ఆర్‌బీఐ.. కొచర్ విషయంలో మీనమేషాలు లెక్కపెట్టుకుం టూ కూర్చుందని ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ సమాఖ్య ఏఐబీవోసీ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

విచారణ క్రమం ఇదీ....

- ఈ వివాదంలో వేణుగోపాల్ ధూత్‌తో పాటు వీడియోకాన్ గ్రూప్ సంస్థలు, ఐసీఐసీఐ మాజీ సీఈవో చందా కొచర్, ఆమె భర్త దీపక్ కొచర్, ఆయనకు చెందిన న్యూపవర్ రెన్యూవబుల్స్ కేంద్ర బిందువులు.
- మొత్తం రూ. 3,250 కోట్ల రుణాల వివాదంపై 2017 డిసెంబర్‌లో సీబీఐ ప్రాథమిక విచారణ చేపట్టింది. ఈ క్రమంలో వీడియోకాన్ ఇండస్ట్రీస్ (వీఐఎల్), వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌తో (వీఐఈఎల్) పాటు ఆ గ్రూప్‌లోని మరో నాలుగు కంపెనీలకు 2009 జూన్ – 2011 అక్టోబర్ మధ్య కాలంలో రూ. 1,875 కోట్ల మేర ఇచ్చిన ఆరు రుణాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని సీబీఐ తేల్చింది.
- వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కి 2009 ఆగస్టు 26న రూ. 300 కోట్ల రుణం, వీడియోకాన్ ఇండస్ట్రీస్‌కు 2011 అక్టోబర్ 31న రూ. 750 కోట్లు మంజూరు చేసిన కమిటీలో చందా కొచర్ కూడా ఉన్నారని తెలినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి.
- 2009 ఆగస్టులో బ్యాంక్ కమిటీ ఆమోదం పొందిన రూ. 300 కోట్ల రుణం అదే ఏడాది సెప్టెంబర్ 7న వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు మంజూరైంది. తన సొంత సంస్థ సుప్రీం ఎనర్జీ ద్వారా ధూత్ ఆ మర్నాడే .. న్యూపవర్ రెన్యూవబుల్స్‌కి దొడ్డిదారిన రూ. 64 కోట్లు బదలాయించారని అభియోగాలున్నాయి. ‘తొలి విద్యుత్ ప్లాంట్ కొనుగోలు కోసం దీపక్ కొచర్ సంస్థ న్యూపవర్‌కి లభించిన అత్యధిక మొత్తం పెట్టుబడి ఇది. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాలు మంజూరు చేసిందుకు ఈ రూపంలో చందా కొచర్ లబ్ధి పొందినట్లయింది‘ అని సీబీఐ వర్గాలు తెలిపాయి.
- వీఐఎల్, వీఐఈఎల్‌తో పాటు మిలీనియం అప్లయెన్సెస్, స్కై అప్లయెన్సెస్, టెక్నో ఎలక్ట్రానిక్స్, అప్లికాంప్ ఇండియాకు కూడా ఐసీఐసీఐ బ్యాంక్ రుణాలిచ్చింది. వీఐఎల్ నుంచి పొందిన అన్‌సెక్యూర్డ్ లోన్‌లను తీర్చేసేందుకు ఈ నాలుగు సంస్థలు.. ఆ రుణాలను ఉపయోగించుకున్నాయని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. ఈ రుణాలు మొండిబాకీలుగా మారడంతో ఐసీఐసీఐ బ్యాంక్‌కు భారీ నష్టం వాటిల్లగా రుణాలు పొందిన నిందితులు మాత్రం ప్రయోజనాలు పొందారని తెలిపింది. ఈ నేపథ్యంలో రుణాలు మంజూరు చేసిన కమిటీలోని సీనియర్ అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాల్సి ఉంటుందని సీబీఐ పేర్కొంది.

అన్ని ఫండ్లకూ పన్ను లాభాలు!

- డెట్ ఫండ్స్‌కూ సెక్షన్ 80సీ అర్హత కల్పించాలి
- ఫండ్ ఆఫ్ ఫండ్స్‌కు ఈక్విటీ హోదా ఇవ్వాలి
- ఫండ్ పథకాలకూ క్యాపిటల్ గెయిన్స్ ప్లాన్లు
- దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుపై పునరాలోచన
- ‘బడ్జెట్’పై ప్రభుత్వానికి యాంఫీ వినతులు



స్టాక్ మార్కెట్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మరింత పెద్ద మొత్తంలో వచ్చే దిశగా చేపట్టాల్సిన చర్యలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ ‘యాంఫీ’ కేంద్ర ఆర్థిక శాఖకు సూచించింది. ఇవన్నీ దాదాపుగా గతేడాది పంపిన ప్రతిపాదనలేనని, ఈ సారి బడ్జెట్లోనైనా వీటి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరామని యాంఫీ సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ తెలిపారు. యాంఫీ ప్రతిపాదనలు ఇవీ..

డెట్‌లింక్డ్ సేవింగ్స్ స్కీమ్

సెక్షన్ 80సీ కింద ప్రస్తుతం ఈక్విటీ ఆధారిత పెట్టుబడి పథకాల్లో(ఈఎల్ఎస్ఎస్) రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంది. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సైతం సెక్షన్ 80సీసీ కింద అర్హత కల్పించాలి. డెట్ పథకాలకు పన్ను మినహాయింపు వల్ల సంప్రదాయ ఇన్వెస్టర్లు(రిస్క్ తీసుకోని వారు) సైతం పన్ను ప్రయోజనాలు పొందగలరు. దీనివల్ల బాండ్ మార్కెట్ విస్తృతి కూడా పెరుగుతుంది.

ఫండ్ ఆఫ్ ఫండ్స్

ఈక్విటీల్లో 65 శాతం పెట్టుబడులు పెట్టే ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను ఈక్విటీ ఫండ్స్‌గా పరిగణించాలి. ప్రస్తుతం దీన్ని డెట్ స్కీమ్‌గానే పరిగణిస్తున్నారు. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్‌లో కనీసం 65 శాతం పెట్టుబడులు పెట్టే పథకాలను ఈక్విటీగా ప్రస్తుతం గుర్తిస్తున్నారు. కానీ, ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను మాత్రం అవి ఎందులో ఇన్వెస్ట్ చేశాయన్న అంశంతో సంబంధం లేకుండా డెట్ ఫండ్స్‌గానే చూస్తున్నారు. అందుకే యాంఫీ ఈ ప్రతిపాదన చేసింది.

పథకాల మధ్య సమానత్వం

పన్ను పరంగా మ్యూచువల్ ఫండ్స్, యులిప్‌లను ఒకే విధంగా చూడాలి. ఒకే పథకం పరిధిలో పెట్టుబడులను మార్చుకోవడం, ఒకే ఫండ్ హౌస్ పరిధిలో పథకాల మధ్య పెట్టుబడులను మార్చుకోవడాలను మూలధన లాభాల పన్ను నుంచి మినహాయించాలి. ప్రస్తుతం యులిప్ పాలసీల్లో ఇన్వెస్టర్లు వివిధ ఫండ్స్ మధ్య పెట్టుబడులను స్విచ్ చేసుకుంటున్నప్పటికీ పన్ను భారం ఉండటం లేదు.



ఫండ్ ఆధారిత రిటైర్మెంట్ ప్లాన్

అమెరికాలో ఉన్న 401 (కె) ప్లాన్ మాదిరే... మ్యూచువల్ ఫండ్ లాంగ్ టర్మ్ రిటైర్మెంట్ ప్లాన్‌ను (ఎంఎఫ్ ఎల్ఆర్‌పీ) యాంఫీ ప్రతిపాదించింది. ఉద్యోగ సంస్థ ఉద్యోగి తరఫున చేసే రిటైర్మెంట్ పొదుపులను వారి వేతనం నుంచి మినహాయించి చూపే అవకాశం ఈ ప్లాన్ కింద ఉంటుంది. దీనివల్ల మరింత పొదుపు నిధులు క్యాపిటల్ మార్కెట్లోకి తరలివస్తాయి.

క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ప్లాన్లు

‘సెక్షన్ 54ఈసీ’ని 3–5 ఏళ్ల లాకిన్‌తో ఫండ్ పథకాలకు కూడా వర్తింపచేయాలి. ప్రస్తుతం ఎన్‌హెచ్ఏఐ బాండ్, ఆర్ఈసీ బాండ్లలో చేసే పెట్టుబడులకు లాకిన్ పీరియడ్‌తో ఈ సెక్షన్ కింద మూలధన లాభాల పన్ను మినహాయింపు కల్పిస్తున్నారు. వీటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలం పాటు ఉంచుకున్న ఆస్తులను విక్రయించినప్పుడు వచ్చిన లాభాలపై పన్ను చెల్లించాల్సిన అవసరం ఏర్పడదు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసినా ఇదే ప్రయోజనాన్ని 3–5 ఏళ్ల లాకిన్ పీరియడ్‌తో అనుమతించాలి.

క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పునఃపరిశీలన

స్టాక్స్‌లో పెట్టుబడులను ఏడాది కాలం తర్వాత విక్రయిస్తే వచ్చే లాభాలపై పన్నును (ఎల్‌టీసీజీ) కేంద్రం గతేడాది నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీన్ని పునరాలోచించాలన్నది స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు, బ్రోకరేజీ సంస్థలు, ఫండ్ మేనేజర్ల డిమాండ్. ఎల్‌టీసీజీని రద్దు చేస్తే ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంటుంది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌కు పన్ను మినహాయింపులు కల్పిస్తే బాండ్ మార్కెట్‌లోకి వచ్చే పెట్టుబడులు భారీగా పెరుగుతాయన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది దాటిన తర్వాత విక్రయించిన స్టాక్స్‌పై లాభం రూ.లక్ష దాటితే 10% పన్నును కేంద్రం గత బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం గమనార్హం.

‘నానో’కు టాటా!

- బీఎస్–6 ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చెయ్యం
- టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ స్పష్టీకరణ



హైదరాబాద్: రతన్ టాటా కలల కారు ‘నానో’ త్వరలోనే దేశీయ మార్కెట్ నుంచి కనుమరుగు కానుంది. ఎందుకంటే 2020 ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్న బీఎస్–6 కాలుష్య ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా నానో కారును అప్‌గ్రేడ్ చేసే ఆలోచన లేదని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ విభాగం ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ స్పష్టం చేశారు. అంతేకాదు, నానోకారుపై పెట్టుబడుల ప్రణాళికలు కూడా లేవని తేల్చిచెప్పారు. ‘‘నానో కారును గుజరాత్‌లోని సనంద్ ప్లాంట్‌లో తయారు చేస్తున్నాం. వచ్చే అక్టోబర్ నుంచి నూతన భద్రతా ప్రమాణాలు, 2020 ఏప్రిల్ నుంచి బీఎస్–6 ప్రమాణాలు అమల్లోకి రానున్నాయి. కనుక అన్ని ఉత్పత్తులు బీఎస్–6 ప్రమాణాలను చేరుకోలేకపోవచ్చు. ఆ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఉత్పత్తులను అప్‌గ్రేడ్ చేయడంపై ఇన్వెస్ట్ చేయకపోవచ్చు. అందులో నానో ఒకటి’’ అని మయాంక్ వివరించారు. బీఎస్–6 ప్రమాణాలకు అనుగుణంగా లేని వాహనాలను 2020 ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చింది. మధ్యతరగతి కుటుంబాలకు ద్విచక్ర వాహనానికి ప్రత్యామ్నాయంగా అందుబాటు ధరలో చిన్న కారును తీసుకురావాలన్న రతన్‌టాటా కలల రూపమే నానో అని తెలిసిందే. 2009లో తొలిసారి దీన్ని రూ.లక్ష ధరతో టాటా మోటార్స్ మార్కెట్లోకి విడుదల చేసింది. అయితే, గత కొంత కాలంగా ఈ కారును కొనేవారే కరువయ్యారు. కంపెనీ విక్రయ గణాంకాల్లో నానో కనిపించడం లేదు.

ఈ–కామర్స్ రంగంపై అంతర్జాతీయ ఒప్పందం!

- పిలుపునిచ్చిన డబ్ల్యూటీఓ చీఫ్
- మరింత క్లిష్టంగా వాణిజ్య సవాళ్లు: ఐరాస
- కృత్రిమ మేధపై నియంత్రణ: నాదెళ్ల



దావోస్: వేగంగా మారుతున్న ప్రపంచంతో పాటు మారకపోతే బహుళపక్ష వాణిజ్య వ్యవస్థలు, డబ్ల్యూటీఓ వంటి సంస్థలు కనుమరుగు కాక తప్పదని డబ్ల్యూటీఓ చీఫ్ రొబెర్టో అజెవెడో హెచ్చరించారు. దీనిని నివారించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. జోరుగా వృద్ధి చెందుతున్న ఈ–కామర్స్ కోసం అంతర్జాతీయ బహుళపక్ష ఒప్పందం అవసరమన్నారు. ఇక్కడి ప్రపంచ ఆర్థిక సదస్సులో (డబ్ల్యూఈఎఫ్) ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం, రక్షణాత్మక విధానాలు పెరుగుతుండటం వంటి కారణాల వల్ల వాణిజ్య రంగంలో గతంలో కంటే సవాళ్లు మరింత క్లిష్టమవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు నిజానికి రాజకీయ సమస్య అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుంటెరస్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయని, వీటిని సవ్యంగా పరిష్కరించలేకపోతే పెను విపత్తు తప్పదని ఆయన హెచ్చరించారు. కాగా ఆర్థిక వృద్ధికి సంబంధించిన అంశాలను దేశాలు త్వరితంగా పరిష్కరించుకోవాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) చీఫ్ క్రిస్టీనా లగార్డ్ సూచించారు. అందుకే అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి అంచనాలను తగ్గించామన్నారు. కాగా, కృత్రిమ మేధ నియంత్రణకు నిబంధనలను రూపొందించాల్సిన అవసరముందని మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వ్యాఖ్యానించారు. గోప్యతను మానవ హక్కుగా పరిగణించాలని పేర్కొన్నారు.

డిజిటల్ డిక్లరేషన్...

డిజిటల్ యుగంలో నైతికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామనే డిజిటల్ ప్రతినకు 40కు పైగా అంతర్జాతీయ వ్యాపార ప్రముఖులు సంఘీభావం తెలిపారు. ఈ డిజిటల్ డిక్లరేషన్‌పై మన దేశానికి చెందిన భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ తొలి సంతకం చేశారు. ఎరిక్సన్, ఐబీఎమ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, నోకియా, శామ్‌సంగ్, షార్ప్, వెరిజాన్, వొడాఫోన్, షియోమి తదితర సంస్థలు ఈ డిజిటల్ డిక్లరేషన్‌కు సంఘీభావం తెలిపాయి.

ఎలక్ట్రానిక్ వేస్ట్.. 6,200 కోట్ల డాలర్లు



ప్రతీ ఏడాదీ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈ–వేస్ట్) విపరీతంగా పెరిగిపోతున్నాయని తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం 5 కోట్ల టన్నులుగా (ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా తయారైన వాణిజ్య విమానాల బరువు కంటే ఇది అధికం) ఉన్న ఈ–వేస్ట్ 2050 కల్లా 12 కోట్ల టన్నులకు పెరుగుతుందని పేర్కొంది. ఫలితంగా తీవ్రమైన ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని వివరించింది. ఏటా పేరుకుపోతున్న ఈ–వ్యర్థాల విలువ 6,200 కోట్ల డాలర్ల మేర ఉంటుందని, ఇది మొత్తం ప్రపంచ వెండి ఉత్పత్తి విలువకు మూడు రెట్లకు సమానమని వివరించింది. ప్రతి ఏటా ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్స్ ఉత్పత్తుల్లో 20 శాతం మాత్రమే రీసైకిల్ అవుతున్నట్లు తెలియజేసింది.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YES BANK	215.4	9.2
RIL	1247.45	1.72
TCS	1901.55	1.38
JSW STEEL	283.65	0.98
TECH MAHINDRA	727.75	0.98
DR. REDDY'S	2668.45	0.82
TITAN COMPANY	969.65	0.78
HDFC LTD	1971.1	0.66
ITC LTD	278.9	0.58
HPCL	243.1	0.52

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
BHARTI INFRATEL	263	-5.05
TATA MOTORS	175.4	-2.69
UPL LIMITED	747.35	-2.03
SUN PHARMA	423	-1.86
CIPLA LTD	500.7	-1.69
ULTRATECH CEMENT	3790.7	-1.56
BAJAJ FINSERV	6407.3	-1.32
ONGC.	141.7	-1.12
ADANI PORT	380.95	-1.1
BPCL	353.95	-0.9

మార్కెట్స్ రికవరీ..

- సెన్సెక్స్ 87 పాయింట్లు, నిఫ్టీ 18 పాయింట్లు అప్
- రిలయన్స్, యస్ బ్యాంక్, ఐటీసీ ఊతం

దిగ్గజాలైన రిలయన్స్, ఐటీసీ, యస్ బ్యాంక్ స్టాక్స్ ఊతంతో దేశీ సూచీలు రెండు రోజుల నష్టాల నుంచి కోలుకున్నాయి. గురువారం హెచ్చుతగ్గులకు లోనైనప్పటికీ చివరికి లాభాల్లో ముగిశాయి. గత రెండు సెషన్స్‌లో దాదాపు 470 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. గురువారం 260 పాయింట్ల శ్రేణిలో తిరిగింది. చివరికి 87 పాయింట్లు పెరిగి 36,195 వద్ద క్లోజయ్యింది. నిఫ్టీ 18 పాయింట్లు పెరిగి 10,850 వద్ద ముగిసింది. రంగాలవారీగా రియల్ ఎస్టేట్, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు టాప్ గెయినర్స్‌గా నిల్చాయి.



రిలయన్స్ 1.61 శాతం అప్ ..

సెన్సెక్స్‌లో అత్యధిక వెయిటేజ్ ఉన్న రిలయన్స్ షేరు 1.61 శాతం పెరిగింది. ఇక కొత్త సారథిగా డాయిష్ బ్యాంక్ ఇండియా సీఈవో రవ్‌నీత్ సింగ్ గిల్ పేరును ప్రతిపాదించిన నేపథ్యంలో యస్ బ్యాంక్ షేరు ఏకంగా 8.39 శాతం ఎగిసింది. క్యూ3 ఫలితాల కారణంగా బుధవారం 4 శాతం క్షీణించిన ఐటీసీ గురువారం 0.43 శాతం మేర పెరిగింది.

గురువారం స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,428
ఎన్ఎస్ఈ	28,615
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	16,41,864
ఎఫ్ఐఐ	- 94
డీఐఐ	390

నేడు స్పెన్సర్స్, సీఈఎస్‌సీ లిస్టింగ్: సీఈఎస్‌సీ నుంచి విడగొట్టిన స్పెన్సర్స్ రిటైల్, సీఈఎస్‌సీ వెంచర్స్ సంస్థలు శుక్రవారం లిస్ట్ కానున్నాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ రెండింటిలోనూ వీటిని లిస్ట్ చేయనున్నట్లు సంస్థ వర్గాలు వెల్లడించాయి. స్పెన్సర్స్ రిటైల్.. ప్రధానంగా రిటైల్ వ్యాపారం నిర్వహిస్తుండగా, బీపీవో, రియల్టీ, ఎఫ్ఎంసీజీ తదితర వ్యాపారాలను సీఈఎస్‌సీ వెంచర్స్ నిర్వహిస్తోంది.

అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు

పీఎన్‌బీ హౌసింగ్ లాభం 32 శాతం అప్

పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ నికర లాభం 32 శాతం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.229 కోట్లుగా ఉన్న నికర లాభం (కన్సాలిడేటెడ్) ఈ క్వార్టర్‌లో రూ.303 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.2,078 కోట్లకు పెరిగింది. గతేడాది క్యూ3లో నమోదైన రూ.1,416 కోట్లతో పోలిస్తే 46 శాతం వృద్ధి చెందింది.

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లాభం 177 శాతం జంప్

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ క్రితం కాలంతో పోలిస్తే ఈ డిసెంబరు కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం 177 శాతం పెరిగి రూ.3.3 కోట్లు ఆర్జించింది. టర్నోవరు రూ.18 కోట్ల నుంచి రూ.25.6 కోట్లుగా ఉంది. ఎబిటా మార్జిన్ 16 నుంచి 28 శాతానికి ఎగసింది. ఇక ఏప్రిల్– డిసెంబరు మధ్య 9 నెలల కాలానికి చూస్తే రూ.68 కోట్ల టర్నోవరుపై కంపెనీ రూ.8.3 కోట్ల నికరలాభం ఆర్జించింది. గురువారం కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 3.37 శాతం తగ్గి రూ.50.25 వద్ద స్థిరపడింది.

బయోకాన్ నికర లాభం 136% జూమ్

బయోకాన్ ఆశాజనక ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ నికర లాభం రూ.217 కోట్లుగా నమోదైంది. గతేడాది క్యూ3లో ఆర్జించిన రూ.92 కోట్లతో పోల్చితే లాభం ఏకంగా 136 శాతం వృద్ధి చెందింది. ఈ ఏడాది మూడో త్రైమాసిక నికర అమ్మకాలు రూ.1,541 కోట్లుగా నమోదుకాగా, గతేడాది ఇదేకాలానికి సాధించిన రూ.1,058 కోట్ల అమ్మకాలతో పోల్చితే 46 శాతం వృద్ధి చోటుచేసుకుంది. ఎబిడిటా 59 శాతం వృద్ధి చెంది రూ.406 కోట్లుగా తేలింది.

ఎన్ఐఐటీ నికరలాభం 1.5 % తగ్గుదల

స్కిల్, టాలెంట్ డెవలప్‌మెంట్ రంగంలో ఉన్న ఎన్ఐఐటీ.. ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికలో రూ.19.4 కోట్ల నికర లాభాన్ని (కన్సాలిడేటెడ్) ప్రకటించింది. గతేడాది క్యూ3లో ఆర్జించిన రూ.19.7 కోట్లతో పోల్చితే 1.5 శాతం క్షీణత నమోదయింది. ప్రతికూల విదేశీ మారకం రేటు ప్రభావం ఇందుకు కారణమని తెలియజేసింది. కాగా ఈ క్వార్టర్లో రూ.228 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. గతేడాది ఇదేకాలంలో నమోదైన రూ.209 కోట్లతో చూస్తే ఆదాయం 8.7% పెరిగింది.

తగ్గిన అల్ట్రాటెక్ సిమెంట్ నికర లాభం...

ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ3లో (అక్టోబర్–డిసెంబర్) రూ.390 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదేకాలానికి నమోదైన రూ.457 కోట్లతో పోలిస్తే నికర లాభం 14 శాతం క్షీణించింది. ఆదాయం ఈ ఏడాది మూడో త్రైమాసికంలో రూ.9,493 కోట్లు కాగా, గతేడాది క్యూ3లో నమోదైన రూ.8,057 కోట్లతో చూస్తే ఆదాయం 19 శాతం పెరిగింది. ఏడాది ప్రాతిపదికన దేశీ అమ్మకాలు 15 శాతం వృద్ధి చెందాయి.

నెల్లూరులో డా.కేర్ హోమియోపతి



నెల్లూరులో డా.కేర్ హోమియోపతి క్లినిక్ ప్రారంభమైంది. మాజీ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, నెల్లూరు సిటీ ఎంఎల్‌ఏ డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్, రూరల్ ఎంఎల్‌ఏ కోటం రెడ్డి శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి క్లినిక్‌ను ప్రారంభించారు. వైద్యరంగంలో విశేష అనుభవం గడించిన డాక్టర్ ఎ.ఎం.రెడ్డి, డాక్టర్ సృజన ఆధ్వర్యంలో నెల్లూరులో హోమియోపతి క్లినిక్ ప్రారంభంకావడం హర్షణీయమని ఈ సందర్భంగా వారు ప్రశంసించారు.

'రూటర్'లో యాంట్‌హిల్ వెంచర్స్ పెట్టుబడి

హైదరాబాద్: రూటర్ స్పోర్ట్స్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్‌లో యాంట్‌హిల్ వెంచర్స్, దానికి సంబంధించిన ఇన్వెస్టర్ల నెట్‌వర్క్ కలసి రూ.కోటి ఇన్వెస్ట్ చేసినట్టు కంపెనీ ప్రకటించింది. భారత్‌తోపాటు యూరోప్‌లో విస్తరణకు రూటర్ స్పోర్ట్స్ టెక్నాలజీస్ ఈ నిధులను వినియోగించనుంది. లైవ్ మ్యాచ్‌లను అభిమానులకు అందించే 'రూటర్' యాప్‌ను కంపెనీ నిర్వహిస్తోంది.

సదరన్ ట్రావెల్స్... బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్

ట్రావెల్, టూరిజం రంగంలోని సదరన్ ట్రావెల్స్.. కేంద్ర ప్రభుత్వం నుంచి 'బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్' అవార్డును అందుకుంది. గత 48 సంవత్సరాలుగా పర్యాటకులకు మెరుగైన సేవలను అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కినట్లు సంస్థ పేర్కొంది. దేశ, విదేశాలకు విహార యాత్రలకు వెళ్లే పర్యాటకుల కోసం 'హాలిడే బజార్' పేరుతో ఈనెల 26, 27 తేదీల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సూర్యాపేటల్లో ఈవెంట్లను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కంపెనీ తెలిపింది.

ఓబెరాయ్ రాజ్‌విలాస్ హోటల్‌కు 13వ ర్యాంకు



ముంబై: జైపూర్‌లోని ఒబెరాయ్ రాజ్‌విలాస్ హోటల్ ప్రపంచంలోని టాప్ 25లో ఒకటిగా ట్రిప్ అడ్వైజర్స్ ట్రావెలర్స్ చాయిస్ అవార్డ్స్ 2019 జాబితాలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ హోటల్‌కు 13వ ర్యాంకు లభించింది. ఆసియాలో మాత్రం టాప్25లో ఐదో స్థానంలో ఉంది. ఆసియాలోని టాప్ 25లో కర్ణాటక కూర్గ్‌లోని ఎవాల్వ్ బ్యాక్ 14వ స్థానంలో, ఆగ్రాలోని ఒబెరాయ్ అమ్రావిలాస్ 19వ స్థానంలో , కర్ణాటకలోని ట్రివిక్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ 20వ స్థానంలో ఉన్నాయి. కోస్టారికాలోని ట్యూల్‌మర్ బంగ్లాస్ అండ్ విల్లా ప్రపంచంలో నవంబర్1గా నిలిచింది.

28న పీఎస్‌యూ బ్యాంకుల అధిపతులతో గోయల్ భేటీ



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రభుత్వరంగ బ్యాంకుల అధిపతులతో వచ్చే సోమవారం (ఈ నెల 28న) భేటీ కానున్నారు. రుణాల స్థితిగతులు, బ్యాంకుల పనితీరుపై చర్చించనున్నారు. అరుణ్‌జైట్లీ చికిత్స కోసం విదేశాలకు వెళ్లడంతో ఆ శాఖ బాధ్యతలను పీయూష్ గోయల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఎంఎస్‌ఎంఈలు, వ్యవసాయ రంగం, రిటైల్ రంగాలకు రుణాల వితరణపై ప్రధానంగా చర్చించనున్నట్టుటు అధికార వర్గాలు తెలిపాయి. బ్యాంకుల ఎన్‌పీఏలపైనా చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

ఆసియా గ్రేటెస్ట్ బ్రాండ్... డాక్టర్ కాపర్



కాపర్ ఉత్పత్తుల తయారీలో ఉన్న ఎంఎస్ఆర్ ఇండియాకు చెందిన 'డాక్టర్ కాపర్' 2018 సంవత్సరానికి గాను ఆసియా గ్రేటెస్ట్ బ్రాండ్‌గా నిలిచింది. ఆసియా గ్రేటెస్ట్ లీడర్ అవార్డు కంపెనీ సీఈవో ఎం.మల్లారెడ్డిని వరించింది. ఆసియా వన్ బిజినెస్ మ్యాగజైన్, ప్రైస్ వాటర్ హౌజ్ కూపర్స్ సంయుక్తంగా ఏటా ఈ అవార్డులను అందజేస్తున్నాయి. సింగపూర్‌లో జరిగిన ఇండో–సింగపూర్ బిజినెస్, సోషల్ ఫోరమ్ కార్యక్రమంలో ఈ అవార్డును మల్లారెడ్డి స్వీకరించారు. కాపర్ బాటిళ్ల రంగంలో డాక్టర్ కాపర్ బ్రాండ్ దేశంలో తొలి స్థానంలో ఉంది.

ఇన్నర్‌వేర్ వ్యాపారంలోకి పెపే జీన్స్

డాలర్ ఇండస్ట్రీస్‌తో కలిసి ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ (జేవీ) ద్వారా భారత లోదుస్తుల వ్యాపారంలోకి పెపే జీన్స్ యూరప్ బీవీ ప్రవేశించింది. ఇరు సంస్థలు సమాన వాటా కలిగిన ఈ జేవీ.. 'పెపే జీన్స్ ఇన్నర్‌ఫ్యాషన్' పేరిట కార్యకలాపాలు నిర్వహించనుంది. ఈజిప్ట్ కాటన్‌తో తయారైన లోదుస్తుల ధరల శ్రేణి రూ.175 నుంచి రూ.649 వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది.

నేటి బోర్డ్ మీటింగ్స్

ఎల్ అండ్ టీ, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నీల్ కమల్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, వక్రంగీ, వండర్ లా, స్వరాజ్ ఇంజిన్స్, దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, గతి, గృహ ఫైనాన్స్, సారేగమ ఇండియా, సుందరమ్ క్లేటన్,

ఆదిత్య బిర్లా సన్‌లైఫ్... మంత్లీ ఇన్‌కమ్‌ప్లాన్

ముంబై: ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్ పేరిట వినూత్నమైన బీమా పథకాన్ని ఆవిష్కరించింది. కాల వ్యవధి తీరేంత వరకు ఈ ప్లాన్ నెలవారీ ఆదాయాన్నిస్తుందని సంస్థ తెలియజేసింది. పాలసీ ప్రీమియం చెల్లింపు ముగిసిన తర్వాత నుంచి పాలసీ కాల వ్యవధి ముగిసేంత వరకు ఏటా సమ్ అష్యూర్డ్‌లో ఒక శాతాన్ని నెలవారీ చెల్లిస్తామని కంపెనీ తెలిపింది. ఇన్వెస్టర్లు తమకు ఇష్టమైతే నెలవారీ ఒక శాతం ఆదాయాన్ని ఎంపిక చేసుకోకుండా ఉండే ఆప్షన్ కూడా ఉంది. ఇక నెలనెలా ఒక శాతం బెనిఫిట్‌తో పాటు, ఏటా ఈ మొత్తం 5 శాతం పెంచి ఇచ్చే మరో ఆప్షన్ కూడా ఉంది. నెలవారీగానే కాకుండా ఏడాదికోసారి ఆదాయాన్ని ఎంచుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఒకవేళ పాలసీ కాల వ్యవధిలోపు మరణం సంభవిస్తే బీమా మొత్తాన్ని చెల్లించడంతోపాటు కుటుంబీకులకు ప్రతి నెలా ఆదాయం చెల్లించడం మొదలవుతుందని కంపెనీ తెలిపింది. పాలసీ కాల వ్యవధి తీరే వరకు నెలవారీ ఆదాయ చెల్లింపు ఉంటుంది. ప్రమాదంలో మరణిస్తే సమ్ అష్యూర్డ్‌కు రెట్టింపు చెల్లించే ఇన్‌బిల్ట్ రైడర్ కూడా ఇందులో ఉంది.

మరికొన్ని కంపెనీల ఫలితాలు క్లుప్తంగా... (రూ. కోట్లలో)

కంపెనీ	నికర లాభం 2018-19	నికర లాభం 2017-18	వృ/క్షీ(%)	మొత్తం ఆదాయం 2018-19	మొత్తం ఆదాయం 2017-18	వృ/క్షీ(%)
రిలయన్స్ పవర్	189	280	-32	2,151	2,589	20
ఎంఫసిస్	278	214	29	1,971	1,660	18
ఎడెల్‌వీస్ ఫైనాన్సియల్	258	219	18	2,791	2,224	25
కోల్గేట్ పామోలివ్	192	170	13	1,107	1,042	6
జ్యోతి ల్యాబ్స్	48	37	29	441	413	7
పీవీఆర్	55	29	89	857	560	53
జీ మీడియా	27	21	28	194	158	22
తేజాస్ నెట్‌వర్క్	33	30	9	193	236	-18
ఫైజర్	132	87	52	578	489	18
క్యేస్ కార్ప్	65	61	7	2,172	1,584	37

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెటు)	33,310	0
బంగారం (22 క్యారెటు)	31,720	0
వెండి (కిలో)	42,100	▼ 300
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,430	▼ 90
బంగారం (22 క్యారెట్లు)	30,890	▼ 80
వెండి (కిలో)	42,100	▼ 400
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,430	▼ 90
బంగారం (22 క్యారెట్లు)	30,890	▼ 80
వెండి (కిలో)	42,100	▼ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,200	▼ 100
బంగారం (22 క్యారెట్లు)	30,710	▼ 40
వెండి (కిలో)	40,000	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,500	▼ 90
బంగారం (22 క్యారెట్లు)	30,800	▼ 160
వెండి (కిలో)	41,500	
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	33,500	▼ 285
బంగారం (22 క్యారెట్లు)	30,750	▼ 220
వెండి (కిలో)	40,000	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,400	▼ 80
బంగారం (22 క్యారెట్లు)	30,890	▼ 80
వెండి (కిలో)	39,900	▼ 400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	53.18 (రాత్రి 11.30కు)	$52.62 (బుధవారం ముగింపు)
బ్రెంట్	61.22 (రాత్రి 11.30కు)	$61.14 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 25-01-2019

విశాఖ	417-00
చిత్తూరు	423-00
వరంగల్	404-00
చెన్నై	430-00
ముంబై	457-00
విజయవాడ	417-00
నమక్కల్	420-00
గోదావరి	417-00
24-01-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	380.95	385.2
ASIAN PAINT	1401.85	1396.55
AXIS BANK L	663.65	661.6
BAJAJ AUTO	2651.65	2674.1
BAJAJ FINSE	6407.3	6493.15
BAJAJ FINAN	2635.65	2634.35
BHARTI AIRT	301.65	303.7
BPCL	353.95	357.15
CIPLA LTD	500.7	509.3
COAL INDIA	223.85	225.55
EICHER MOTO	20115.6	20089.15
GAIL (INDIA	333.6	334.2
GRASIM INDU	785.8	782.15
HCL TECHNOL	946.45	944.45
HDFC LTD	1971.1	1958.25
HDFC BANK L	2102.25	2105.4
HERO MOTOCO	2790.2	2795.95
HINDALCO I	205.05	205.45
HPCL	243.1	241.85
HUL	1759.5	1767.2
INDIABULLS	773.5	778.7
ICICI BANK	364.8	367.4
INDUSIND BA	1490.3	1495
BHARTI INFR	263	277
INFOSYS LIM	732	731.65
INDIAN OIL	136.8	136.1
ITC LTD	278.9	277.3
JSW STEEL L	283.65	280.9
KOTAK MAHIN	1267.75	1276.5
LARSEN & T	1295.35	1301.45
MAHINDRA &M	697.3	695.85
MARUTI SUZU	7040.6	7045.4
NTPC LTD	140.05	140.75
OIL AND NAT	141.7	143.3
POWER GRID	186.75	186.3
RIL	1247.45	1226.3
SBI	288.05	286.65
SUN PHARMAC	423	431
TATA MOTORS	175.4	180.25
TATA STEEL	460.75	464.6
TATA CONSUL	1901.55	1875.6
TECH MAHIND	727.75	720.7
TITAN COMPA	969.65	962.15
ULTRATECH C	3790.7	3850.65
UPL LIMITED	747.35	762.85
VEDANTA LIM	193.5	192.8
WIPRO LTD	351.75	351.55
YES BANK LI	215.4	197.25
ZEE ENTERTA	433.85	432.85

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1258.35	1293.2
ADITYA BIRL	89.45	87.4
ACC LIMITED	1419.7	1429.85
AMBUJA CEME	211.2	212.4
ASHOK LEYLA	84.8	89.15
BANDHAN BAN	413.9	414.2
BANK OF BAR	113	111.3
BHARAT ELEC	82.8	83.9
BHEL	69.05	69.35
BIOCON LIMI	670.1	670.65
BOSCH LIMIT	19155.4	19090.15
BRITANNIA I	3216.85	3203.85
CADILA HEAL	346.1	342.05
COLGATE PAL	1321.9	1307.25
CONTAINER C	664.05	659.9
DABUR INDIA	430.4	430.65
DLF LIMITED	177.75	177.25
AVENUE SUPE	1391.55	1397.3
GENERAL INS	250	247.7
GODREJ CONS	790.6	789.8
HAVELLS IND	702.6	696.2
HDFC STAND	361.2	373.35
HINDUSTAN Z	257.95	259.4
ICICI LOMBA	848.4	832.25
ICICI PRU L	303.8	305.4
VODAFONE ID	34.05	33.9
INTERGLOBE	1178.55	1109.3
L&T FINANCE	137.5	136.6
LIC HOUSING	469.6	466.95
LUPIN LIMIT	868.4	864.6
MARICO LIMI	373.95	376.55
UNITED SPIR	571.75	580.25
MOTHERSON S	154.05	157.55
MRF LTD	64902.75	66072.05
NHPC LTD	25.3	25.25
THE NEW IND	179	179.3
NMDC LTD.	90.1	89.9
ORACLE FIN	3796.4	3769.65
OIL INDIA L	170	170.05
PIRAMAL ENT	2307.75	2357.85
PETRONET LN	226.3	226.8
P&G HYGIENE	9921.3	9914.85
PIDILITE IN	1109.35	1131.45
STEEL AUTHO	48.25	48.55
SBI LIFE IN	618.25	620
SHREE CEMEN	16170.55	16103.35
SIEMENS LTD	1027.95	1045
SHRIRAM TRA	1114.55	1088.05
SUN TV NETW	527	529.45

తొలి సీఎన్‌జీ టర్మినల్ దిశలో అడుగు

న్యూఢిల్లీ: దేశంలో తొలి సీఎన్‌జీ టర్మినల్‌ను గుజరాత్ తీరంలో ఏర్పాటు చేసే విషయమై గుజరాత్ మారిటైమ్ బోర్డుతో (జీఎంబీ) బ్రిటన్‌కు చెందిన ప్రముఖ షిప్పింగ్ అండ్ డ్రిల్లింగ్ కంపెనీ ఫోర్‌సైట్ గ్రూపు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా గుజరాత్ తీరంలో సీఎన్‌జీ దిగుమతికి తగిన వసతులు సమకూర్చే బాధ్యతను ఫోర్‌సైట్ గ్రూపు చేపడుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. టర్మినల్ వసతుల కోసం రూ.300 కోట్లు, సీఎన్‌జీ వెసెల్స్ కోసం రూ.700 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతానికి దేశంలో ఎల్ఎన్‌జీ టర్మినళ్లే ఉన్నాయి.

రూపాయికి 'క్రూడ్' బలం...

26 పైసలు లాభంతో 71.07 వద్ద ముగింపు

ముంబై: క్రూడ్ ధరలు ఇప్పట్లో భారీగా పెరిగే అవకాశంలేదన్న విశ్లేషణలు, ఈక్విటీ మార్కెట్ల లాభాలతో డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం బలపడింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో 26 పైసలు బలపడి 71.07 వద్ద ముగిసింది. గడచిన రెండు రోజుల్లో దేశీయ కరెన్సీ 37 పైసలు బలపడింది. గురువారం ట్రేడింగ్‌లో 71.29 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో 71.30–71.06 శ్రేణిలో కదలాడింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్ ధరలు అంతర్జాతీయంగా ఇటీవలి గరిష్ట స్థాయిల నుంచి అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో...రూపాయి క్రమంగా కోలుకుని 69.40 స్థాయిని చూసింది. అయితే మళ్లీ క్రూడ్ ధర తాజా కనిష్ట స్థాయిల నుంచి 10 డాలర్లకుపైగా పెరగడంతో రూపాయి జారుడుబల్లమీదకు ఎక్కింది. ఈక్విటీ మార్కెట్ల నష్టాలూ ఇందుకు తోడవుతున్నాయి.

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	5.69	5.42
Alphageo	468.95	452.35
Alu Flouride	111.5	115.55
Amar Raja Bat	779.8	781.25
And Bank	27	27.2
And Cemen	5.1	5.08
And Paper	432.65	443.15
And Petro	59.8	62.25
Anjani Portl	119.75	123
Aries Agro Ltd	93.75	92
Aurobindo Ph	787.8	782.05
Avantel Soft	222	223.5
Avanti Feeds	358.7	362.55
AvonOrg	6.95	6.65
BN Rathi Sec	25	26
Balaji Amin	480	492.5
Bambino Agro	183	184
Bartronics	6.74	6.71
Bhagira Chem	430	438.95
Bhagya Nag	34.6	35.85
Bhagya Wood	19	19.45
Bhaskar Agro	32.55	33.2
Brilliant Sec	1.02	1.04
CIL Securi	15.05	15.45
Cont Coffee	274.9	272.1
CoroFert	443	435.2
Country Club	7.3	7.88
Cubex Tub	14.62	14.95
Cybermate	1.97	1.9
DR Reddy	2663.2	2645.5
Danlaw Tec	94.1	98.9
Divi's Lab	1494.85	1503.7
Divya Granit	103.5	103.9
Dredgin Corp	420.95	427.55
Empee Sugars	1.47	1.41
Everest Org	127.15	125.2
Fortune Info	39.8	39.2
Four Soft	37.3	38.55
Fourth Gen	2.36	2.25
GMR Ferro	1.34	1.29
GMR Infra	15.95	16.15
GVK Power	6.87	6.96
Gati Corpn	76	77.4
Gayatri Proj	165.5	168.85
Gayatri Sugrs	2.79	2.76
Gennex Lab	3.5	3.57
GodavDru	22.8	21.2
Goldstn Tele	241.2	234.25
Goldstone Tech	13.7	14.25
Granules (I)	96	93.2
HBL Nife Pow	26.7	26.9
HYDIndus	1930	1942
Heritage Food	515.85	519.05
IDL Industrs	260	264.9
IVRCL Infras	0.96	0.98
Incap	38.85	37
IndoNationl	682.25	696
Infotech En	591.9	598.4
Invinex Lab	43.4	41.35
JSTL	36	36.15
KCP LTD	86.4	86.8
KNR Constructio	211	210.9
Kabsons Indu	5.76	6.06
KakatiCem	188.35	192.05
Kallam Spg	16.95	17.65
Kernex Micro	25.65	26.45
Krebs Bio	112.1	112.85
LGS Global	3.05	3
LancoIndus	182	183.85
Lokesh Mach	44.15	44.8
Lotus Choc	23.25	22.15
MIC Elec	0.92	0.96
Madhucon Proje	6.75	6.34
Maytas Infra	12.75	13.35
Mold-tek	50	52
Moldtek Plastic	262	266.3
Moschip Semi	21.5	21.55
NCCBlue Wat	6.9	6.78
NCLInd	126.3	126.55
NETTLINX	44.2	46.95
NMDC Ltd	90.15	89.9
NagarAgrich	27.5	27.1
NagarConst	83.9	85.45
Natco Pharma	684	685.2
Nava Bh Ventur	111.65	112.15
Neha Inter	4.35	4.3
Neocure Ther	2.29	2.24
Neuland Lab	503	500.35
Nihar Info Glo	11.4	11.98
Nile	350	354
Northgate Tech	0.64	0.61
Oil Country	14.25	14.2
Ortin Lab	16.15	15
Padmalaya Tele	2.23	2.23
Panyam Cemen	11.92	12.27
Peeti Securt	5.51	5.25
PennInd	37	37.4
Phytochem I	42.05	41.75
Pitti Lamin	55.6	55.2
Pokarna	170.35	168.95
Prajay Engs	8.13	8.25
PremiExpl	251.5	265.15
Prism Cement	79.1	80.9
Raasi Refrac	17.27	16.45
Rain Industries	119.45	119.6
Raj Packagin	26.15	27.05
Ram Informat	41.45	42.85
RavilGr	13.7	14.4
Reg.Ceramic	4.25	4.47
Restile Cer	3.82	3.9
Sagar Cem	644	632
Samkrg Pist	184.8	187.3
SangInd	57.25	59
Satvah. Ispat	9.11	9.55
Saven Techno	28.5	27.5
Sibar Auto	29.45	29.5
Softsol	36.4	36
South Bio Tech	1.94	1.97
SrRayAlk	36.35	37.1
Srinivasa Ship	41.45	40
Starchik Sp	26	26
Sujana Metal	0.38	0.37
Sujana Towers	1.26	1.26
Sujana Univers	0.3	0.31
Surana Strip	1.36	1.3
Surana Tele	4.05	4.39
Suryachakra Pow	0.3	0.29
Suryalata Sp	127.5	130
Suryava Spin	5.17	5.44
SuvarCem	69	69.4
Suven Pharma	202.1	204.1
TCI Finance	15.05	14.85
Taj Gvk Hotel	184	181.45
Tanla Solutions	32.85	29.9
Trans Biotek	5.81	5.92
Transport Co	290.5	290.7
Usher Agro	2.38	2.5
V&K Soft	4	4.05
VBC Ferro	38.5	40.35
VST Indus	3200.05	3135.85
Vamshi Rubb	31	31.75
Viceroy Hotels	3.82	3.99
VijayGrowth	9	8.92
VijayTextil	40.9	40.8
Vimta Labs	266.9	274.65
Virat Crane	32.5	31.9
Virinchi Con	77.5	79.65
VisakaInd	396	412.15
Vista Pharma	27.2	27.95
Vivimed Labs	24.9	25.65
Vjil Consult	38.95	41
ZenoTech Lab	32.45	32.1

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911, RNI Regn No. TELTEL/2008/23792


CELEKT®
Your Mobile Store
THE GREAT REPUBLIC DAY OFFERS
26 Jan
2019 Celebrating
70 Years of
1950 Republic India
క్యాష్ బ్యాక్ @ 26%
CELKON CliQ 2 (3GB RAM) 26% OFF
Karbonn Smart yuva 2 (2GB RAM) 26% OFF
డిస్కౌంట్ @ ₹2019
honor 9N ₹19999/- DISCOUNT ₹2019/- ₹17980/-
motorola G5s Plus ₹15999/- DISCOUNT ₹2019/- ₹13980/-
ACCESSORIES ONLY @ ₹70
₹249/- ₹70/- SMART CHARGER
₹299/- ₹70/- STYLISH EAR PHONES
₹249/- ₹70/- BRANDED DATA CABLES
మరియు మరెన్నో...
3 మొబైల్స్ @ ₹1950
ట్రిపుల్ ధమాకా
NEW ARRIVALS
SAMSUNG Galaxy A9 (6GB) ₹36990/- ₹33990/- ₹3000/- CASH BACK HDFC BANK
*No other offers applicable
vivo V11 Pro Jio GET INSTANT CASHBACK ₹4000
Redmi Note 6 Pro (4GB) ₹0 Down Payment LIMITED STOCKS
honor 8X FREE Surprise Gift
vivo Y93 Capacitive Touchscreen 4GB RAM 32GB
oppo F9 Pro FREE Surprise Gift
mobistar X1 Dual FREE Wireless Bluetooth ₹799
oppo F5 (6GB) FREE Rice Cooker ₹2999
మీ పాత ఫోన్ తో కొత్త ఫోన్ ని పొందండి
EXCHANGE OFFER OLD NEW
CELKON C410 Flask FREE WORTH ₹299
MICROMAX X1i - POWER 4 In one LunchBox FREE WORTH ₹499
Multimedia Camera Phone ₹399
Jio ₹2200 క్యాష్ బ్యాక్
Be Safe with Celekt's csafe
Restore . Protect . Extend
T&C Apply*
డిస్ప్లే బ్రేక్ అయిందా?
అయినా పర్వాలేదు
c-safe Protection Plan
మీకు ఉచితంగా కొత్త డిస్ప్లేతో రీప్లేస్ చేస్తుంది.
ఫిజికల్ డామేజ్ / లిక్విడ్ డామేజ్ అయినా కూడా
వారెంటీ ముగిసిందా?
అయినా పర్వాలేదు
c-safe Extended Warranty ద్వారా
మరో సంవత్సరం అదనపు వారెంటీ పొందండి
Brand warranty + Celekt Extended Warranty
పాత ఫోన్‌తో విసిగిపోయారా?
ఇక నో ప్రాబ్లమ్. Exchange Offer
ద్వారా మీ పాత ఫోన్‌ని కొత్త ఫోన్‌తో మార్చుకోండి
OLD NEW
సరైన సర్వీస్ లభించక ఇబ్బంది పడుతున్నారా?
ఇక నో ప్రాబ్లమ్. Repair & Service
ద్వారా సెలెక్ట్ స్టోర్స్‌లో స్పెషలిస్ట్ సర్వీస్ పొందండి
బీట్ మార్కెట్ యార్డ్ ఎదురుగా, శ్రీనగర్ కాలని, నల్గొండ. 9676965777
0% PROCESSING FEE DOWN PAYMENT INTEREST
BAJAJ FINSERV HDFC BANK HDB
www.celekt.com @celektindia @celektindia @celektindia | Customer Care: 9121007777 | Download Csafe app

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ ॥ శుక్రవారం
25-1-2019



భూమాత మాట్లాడగలిగితే..!

రేప్ అయిన అమ్మాయి గురించి
ఆత్మ వచ్చి సాక్ష్యం చెప్పలేదు.
ఎందుకంటే.. తను చనిపోయింది.
హతురాలైన ఆ అమ్మాయి గురించి
పిపిలీ గ్రామం సాక్ష్యం చెప్పలేదు. ఎందుకంటే ఆమె దళితురాలు.
పొలంలో ఆమెపై రేప్ జరిగింది కనుక.. ఆ భూమాత మాట్లాడితే కానీ
నిజం బయట పడదా?! ఆమెకు న్యాయం చేకూరదా?

గొల్లుమని ఏడుపు.. ఆసుపత్రి బయట!

తల్లి గుండెలు బాదుకుంటోంది. తండ్రి చేష్టలు డిగి పోయాడు. ఆమె కుప్పకూలి పోతుండగా అతడు ఆమెను గట్టిగా హత్తుకున్నాడు.

లోపల ఒక అమ్మాయి చనిపోయింది.

చనిపోయిన ఆ అమ్మాయి తల్లిదండ్రులు వాళ్లు.

అప్పటికి ఏడు నెలలుగా ఆ అమ్మాయి చావు బతుకుల మధ్య సెమీ–కోమాలో రెపరెపలాడుతోంది. కళ్లు తెరుస్తోంది. చూస్తోంది. వెంటనే స్పృహ కోల్పోతోంది. ఒక్క మాటైనా మాట్లాడగలిగే స్థితిలో లేదు.

ఇరవై మూడేళ్ల ‘నిర్భయ’పై బస్‌లో గ్యాంగ్ రేప్ జరగడానికి ఐదు నెలల ముందు.. కటక్‌లోని శ్రీరామ చంద్ర భాంజా మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో పందొమ్మిదేళ్ల ఆ ఒడిశా అమ్మాయి కోమాలోంచి మరణంలోకి జారుకున్న సంగతి.. నిర్భయ ఘటన వచ్చినంతగా నేటికీ ప్రపంచం దృష్టికి రాలేదు!

‘‘బాడీని తీసుకెళ్లండి’’.. లోపల్నుంచి ఎవరో వచ్చి చెప్పారు.

2012 జూన్ 21 ఆ రోజు. చెడ్డ రోజు అది ఆ తల్లిదండ్రులకు. అయితే వారి జీవితంలో అంతకన్నా చెడ్డ రోజు.. నవంబర్ 28, 2011.

●●●

‘‘వరి పొలాల్లో పడి ఉంది. ఒంటి మీద బట్టల్లేవు. చూస్తుంటే... మనమ్మాయిలా ఉంది’’

ఉదయాన్నే ఇంటి ముందుకు కబురు!

తల్లికి కడుపులో దేవినట్లుగా అయింది. ‘భగవంతుడా.. నా కూతురు కాకూడదు’.. చెప్పులైనా వేసుకోకుండా పొలాల్లోకి పరుగులు తీసింది. వెనకాలే ఆమె భర్త.

పొలాల్లో పడి ఉన్నది వాళ్ల కూతురే! ‘నా కూతురు కాకూడదు దేవుడా’ అని అంతకుముందే వేడుకున్న ఆ తల్లి.. కూతుర్ని ఆ స్థితిలో చూసి.. ‘ఏ కూతురికీ ఇలా కాకూడదు దేవుడా’ అని అక్కడే కూలబడిపోయింది. కూతురి ఒంటి మీద బట్టలు చిరిగి ఉన్నాయి. దేహంపై కొన్ని చోట్ల బట్టలు పక్కకు తప్పి ఉన్నాయి. తీవ్రమైన గాయాలున్నాయి. రక్తం మరకలున్నాయి. కాస్త ఊపిరి కూడా ఉంది.

‘అమ్మా.. నా తల్లీ’ అని కూతుర్ని చేతుల్లోకి ఎత్తుకున్నాడు తండ్రి.

దళిత కుటుంబం వారిది. అర్జునగొడ వాడ వారుండేది. అర్జునగొడ పిపిలీ గ్రామంలో ఉంటుంది. పిపిలీ గ్రామం పూరి జిల్లాలో ఉంటుంది. పూరి జిల్లా ఒడిశాది. ఒడిశా నవీన్ పట్నాయక్‌ది. ముఖ్యమంత్రి ఆయన.

ఆయన వరకు వెళ్లింది విషయం.

ఇక్కడ.. లోకల్ ఆసుపత్రి నుంచి పై ఆసుపత్రికి, పై ఆసుపత్రి నుంచి ఆ పై ఆసుపత్రికి.. అక్కడి నుంచి కటక్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి చేరింది.. కొన ఊపిరితో ఉన్న ఆ యువతి దేహం.

ఎవరు చేశారు? నలుగురు యువకులు.

ఏం చేశారు? ఆ కన్న హృదయాలు చెప్పలేకపోయాయి. పోలీసులు చెప్పారు. కిడ్నాప్, అత్యాచారం, హత్యాయత్నం.

●●●

ఢిల్లీ యువతి నిర్భయ, ఆ ఒడిశా యువతి.. ఇద్దరూ డెత్‌బెడ్ మీద ఉండి ఇంటికి చేరకుండానే కన్ను మూసినవారే. నిర్భయ తన ప్రాణాలతో పద్నాలుగు రోజులు పోరాడి ఓడిపోయింది. ఆ పద్నాలుగు రోజుల్లోనూ మెలకువ వచ్చిన ప్రతిసారీ ఆమె అన్న మాట ఒక్కటే.

‘వాళ్లను వదిలిపెట్టొద్దు..
వాళ్లను వదిలిపెట్టొద్దు.’

వదిలిపెట్టలేదు న్యాయస్థానం. మొత్తం ఆరుగురు. రామ్‌సింగ్, ముఖేశ్‌సింగ్, వినయ్ శర్మ, ఒక మైనర్, పవన్‌గుప్త, అక్షయ్ ఠాకూర్! మైనర్‌కి తప్ప అందరికీ మరణశిక్ష పడింది. కేసు విచారణలో ఉన్నప్పుడే రామ్‌సింగ్ తీహార్ జైల్లో చనిపోయాడు. మైనర్‌ని కోర్టు విడుదల చేసింది. కోర్టు నిబంధనల ప్రకారం మైనర్ పేరు బయట పెట్టకూడదు. కానీ పేరు బయటికి వచ్చి ఉంది. అతడికి రెండు పేర్లు ఉన్నాయి. మహ్మద్ అఫ్రోజ్, రాజు.

నిర్భయ అయినా ‘వాళ్లను వదిలిపెట్టొద్దు’ అని అనగలిగింది కానీ, ఆ పందొమ్మిదేళ్ల ఒడిశా అమ్మాయికి అలా అనే ఓపిక కూడా లేకపోయింది. తనసలు ఈ లోకంలోనే లేదు. నిర్భయ ఘటన జరగడానికి ముందే.. అలాంటి దారుణమైన అకృత్యానికే గురైన అభాగ్యురాలు ఆమె.

న్యాయస్థానాలు ఆమె పేరును బయట పెట్టకూడదని ఆంక్షలు విధించాయి కనుక ‘నిర్భాగ్య’ అనే పిలుచుకుందాం. ఆమెకు జరిగిన ‘న్యాయం’ ఏమిటో తెలుసుకుంటే ఆమెను నిర్భాగ్య అనకపోవడం అన్యాయమే అనిపిస్తుంది.



నిందితులు: 1. సుకాంత్, 2. ప్రశాంత్ ధావన్, 3. ప్రేమానంద నాయక్, 4. గుణస్వాయిన్

●●●

గొల్లుమని ఏడుపు.. కోర్టు బయట!

తల్లి గుండెలు బాదుకుంటోంది. తండ్రి చేష్టలు డిగి పోయాడు.

ఆమె కుప్పకూలి పోతుండగా అతడు ఆమెను గట్టిగా హత్తుకున్నాడు.

లోపల ఒక అమ్మాయికి అన్యాయం జరిగిపోయింది. అన్యాయం జరిగిన ఆ అమ్మాయి తల్లిదండ్రులు వాళ్లు.

నిర్భయ కేసులో తొమ్మిది నెలలకు తీర్పు వచ్చింది. ఈ ‘నిర్భాగ్య’ కేసులో ఏడేళ్లకు తీర్పు వచ్చింది! నిర్భయ కేసులో అందరికీ ఉరిశిక్ష పడింది. నిర్భాగ్య కేసులో అందరూ నిర్దోషులుగా విడుదలయ్యారు! అందరూ అంటే నలుగురు. ప్రశాంత్ ప్రధాన్, సుకాంత్, గుణస్వాయిన్, ప్రేమానంద నాయక్. మొదటి ఇద్దరూ అన్నదమ్ములు. వాళ్లిద్దర్నీ సరైన సాక్ష్యాధారాలు లేవని డిసెంబర్ 24న కోర్టు విడుదల చేసింది. తీర్పు విన్న వెంటనే నిర్భాగ్య తల్లిదండ్రులు అచేతనులయ్యారు. ‘నా కూతురు ఆత్మ శాంతించదు’ అని ఆ తల్లి బోరున విలపించింది. మిగతా ఇద్దరి పేర్లు అసలు చార్జిషీటులోనే లేవు! అయితే పాత పోలీస్ రికార్డుల్లో ఉన్నాయి.

2008లో పిపిలీ గ్రామంలో జరిగిన ఒక లైంగిక వేధింపుల కేసులో వీళ్లు నలుగురూ నిందితులు. వాళ్లు చేసిన తప్పుడు పనికి సాక్ష్యమిచ్చింది నిర్భాగ్య. అప్పుడు ఆ అమ్మాయి వయసు పదహారేళ్లు. అప్పుడే ఆమె మీద ఆ నలుగురి కన్నుపడింది. పడిన విషయం ఐదో కంటికి తెలీదు. ఇప్పుడు కోర్టు కంటికీ తెలియలేదు. తెలియనివ్వలేదు.●

సత్యమేవ జయతే : ఒడిశా మంత్రి!

పద్దెనిమిదేళ్లుగా ఒడిశాకు నవీన్ పట్నాయకే సీఎం. ఆయన పార్టీ బి.జె.డి. (బీజూ జనతాదళ్‌). 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో ముఖ్యమంత్రి పార్టీకి ప్రస్తుతం ఉన్న సీట్లు 118. కాంగ్రెస్‌కు పదిహేను, బీజేపీకి పదీ ఉన్నాయి. ఉన్న కొద్ది సీట్లోతోనే ‘నిర్భాగ్య’ కోసం పోరాడుతున్నాయి ప్రతిపక్షాలు. అయితే ‘నిర్భాగ్య’ను చంపిన హంతకులను కింది కోర్టు నిర్దోషులుగా విడుదల చేయడంపై ‘స్టేట్ క్రైమ్ బ్రాంచి’ హైకోర్టుకు వెళుతోంది కాబట్టి అంతకుమించి ప్రభుత్వమైనా చేయవలసింది ఏముంటుందని వ్యవసాయ శాఖ మంత్రి ప్రదీప్ మహారథి అంటున్నారు. దోషులను రక్షిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో 2012లోనే ఆయన తన మంత్రి పదవి నుంచి తప్పుకోవలసి వచ్చింది. ఇప్పుడు మళ్లీ అదే మంత్రి పదవిలో ఉండి, ‘సత్యమేవ జయతే. బాధితురాలికి న్యాయం జరగాలి’ అని అనడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ‘మహారథి మెదడు లోపల ఏముందో మాకు తెలియడం లేదు. ఆయన పలికిన ‘న్యాయం’ అనే మాటకు అర్థమేమిటో ఆయన చెప్పాలి’’ అని మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుమిత్రా జెనా అన్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ నాయకురాలు ప్రభాతీ పరిదా విమర్శిస్తున్నారు.



భువనేశ్వర్‌లో బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తల నిరసన

చెట్టు నీడ

చివరి పాలు

అబూహురైరా (రజి) దైవప్రవక్త (సల్లం) సేవలో, జ్ఞానార్జనలో పూర్తిగా లీనమైపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. చివరికి పస్తులు కూడా ఉండవలసి వచ్చింది. ఒక రోజయితే ఆయన తీవ్రమైన ఆకలితో విలవిల్లాడిపోయారు. దాంతో ఆయన.. దారిలో ఒకచోట నిల్చొని ఎవరైనా వచ్చి తనను ఇంటికి తీసికెళ్లి భోజనం పెట్టిస్తారేమోనని ఎదురు చూడసాగారు. కారుణ్యమూర్తి ముహమ్మద్ ప్రవక్త (స) అటుగా వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఎంతో వాత్సల్యంతో ఆయన వైపు చూస్తూ ‘‘అబూహురైరా! పద నావెంట’’ అన్నారు. అబూహురైరా (రజి) వెంటనే ఆయన వెంట నడిచారు. దైవప్రవక్త ఆయన్ని తన ఇంటికి తీసికెళ్లారు. అక్కడ ఒక గిన్నెలో పాలు ఉండటం చూసి అబూహురైరా (రజి)తో ‘‘అబూహురైరా! మస్జిద్‌కు వెళ్లి సప్ఫా వారందరినీ పిలుచుకొనిరా’’ అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) వాళ్లందరినీ పిలిపించడం అబూహురైరా (రజి)కు నచ్చలేదు. ఓ గిన్నెడు పాలు అంతమందికి ఎలా సరిపోతాయి? అనుకున్నారు ఆయన. ‘‘ఏమైనా దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ కదా!’’ అని భావిస్తూ వెళ్లి వారందరినీ పిలుచుకు వచ్చారాయన. దైవప్రవక్త (స) అందరూ వచ్చి కూర్చున్న తరువాత ‘‘అబూహురైరా! ఈ పాల గిన్నె తీసుకొని వీరందరికీ పాలు తాగించు’’ అని అన్నారు. అబూహురైరా (రజి) పాలగిన్నె తీసుకొని ఒకరి తర్వాత ఒకరు చొప్పున అందరికీ పాలు తాగించారు. అయినా గిన్నెలో పాలు ఏమాత్రం తగ్గలేదు. తరువాత ఆయన పాల గిన్నెను దైవప్రవక్త (సల్లం) ముందు పెట్టారు. ‘‘సరే, ఇప్పుడు నువ్వు తాగు ఈ పాలను’’ అన్నారు దైవప్రవక్త (సల్లం). ఆకలితో నకనకలాడుతున్న అబూహురైరా (రజి) వెంటనే పాలగిన్నె తీసుకొని గటగటా పాలుతాగి దాన్ని కింద పెట్టేశారు. దైవప్రవక్త (సల్లం) ఇంకా తాగమన్నారు. అబూహురైరా (రజి) మరొకసారి గిన్నె పైకెత్తి పాలుతాగారు. దైవప్రవక్త (సల్లం) ఇంకా తాగు, ఇంకా తాగు అన్నారు. అబూహురైరా (రజి) ఆవిధంగా కడుపునిండా తాగి ‘‘ఇప్పుడిక నా కడుపులో ఏమాత్రం అవకాశం లేదు’’ అని అన్నారు. గిన్నెలో పాలు ఇంకా మిగిలివున్నాయి. అందరి కంటే చివర్లో దైవప్రవక్త (సల్లం) ఆ పాలను తాగారు.



– ముహమ్మద్ ముజాహిద్

బ్యూటిప్స్

చర్మకాంతి కోసం...

ఎలాంటి చర్మ తత్వం వాళ్లయినా రాత్రి పడుకునేముందు తప్పని సరిగా ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇందుకోసం సబ్బును ఉపయోగించ కూడదు. సబ్బులో ఉండే గాఢ రసాయనాలు చర్మానికి హాని చేస్తాయి.

పదిచుక్కల సన్‌ఫ్లవర్ ఆయిల్ లేదా నువ్వుల నూనెలో రెండు టేబుల్‌స్పూన్ల పాలను కలిపి ముఖానికి పట్టించి సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. ఈ మిశ్రమం పొడిచర్మం గల వారికి బాగా పనిచేస్తుంది.

మూడు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్‌లో బాగా మగ్గిన అరటిపండు గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా పట్టించి అరగంట తరువాత కడుక్కోవాలి.

పుదీనా పేస్ట్‌లో బాదం నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమంలో తగినంత వేడినీటిలో కలిపి ముఖానికి పట్టించి 20 నిమిషాల తరువాత కడుక్కోవాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తుంటే చర్మకాంతి పెరుగుతుంది.

రెండు టీస్పూన్ల పెరుగులో కొద్దిగా బియ్యపు పిండిని కలిపి బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట ప్యాక్‌లా వేసుకోవాలి. తర్వాత ఆ ప్రదేశంలో వేళ్లతో వలయాలుగా చుడుతూ సున్నితంగా మసాజ్ చేయాలి. ఎక్కువ మసాజ్‌చేస్తే చర్మం ఎర్రగా అయ్యే అవకాశం ఉంది. వారంలో 3 సార్లు ఈ విధంగా చేస్తే బ్లాక్ హెడ్స్ తగ్గిపోతాయి.



కొత్త కోడలు

ఇది మా ఊరు

కోమల్ హదాలా...
ఇరవై రెండేళ్ల అమ్మాయి.
పేరుకు తగ్గట్టే కోమలంగా ఉంది.
అంతే కోమలంగా
ఓ సామాజికోద్యమాన్ని
విజయవంతంగా నిర్వహించింది.
‘ఇది మా ఊరు’ అంటూ
గర్వంగా చెబుతోందిప్పుడు.





అత్త, అత్తగారి అత్త (భర్త నానమ్మ), ఆడపడుచుతో కోమల్ హదాలా (పైన ఇన్‌సెట్‌లో) కోమల్

కోమల్ మొదలు పెట్టిన విప్లవానికి తొలి అడుగు ఇంటి నుంచే పడింది. భర్త మీద ఒత్తిడి తెచ్చింది. అత్తకు, ఆడపడుచుకు నచ్చచెప్పింది. తన వాదనతో అత్తగారి అత్తగారిని కూడా మెప్పించింది. ఇంట్లో టాయిలెట్ కట్టాలనే ఆమె డిమాండ్ ఇంటితోనే ఆగిపోలేదు. ఊరంతటికీ టాయిలెట్‌లు వచ్చాయి. కోమల్ హదాలా ఢిల్లీలో పుట్టి పెరిగింది. పెళ్లితో ఉత్తరప్రదేశ్‌లోని నిథోరా గ్రామానికి వచ్చింది. ఆ మర్నాడే తెల్లవారి నాలుగు గంటల సమయంలో ఎవరో కుదుపుతూ ఉంటే మెలకువ వచ్చింది. ‘నిద్ర లేచి త్వరగా రా, అందరూ ఎదురు చూస్తున్నారు’ అని అత్తగారు నిద్రలేపారు.

ఇంకా చీకటి వదల్లేదు, ఇప్పుడు లేవడం ఎందుకు, తన కోసం ఎదురు చూస్తున్నది ఎవరు... ప్రశ్నలను గొంతులోపలే మింగేసి అత్తగారి వెంట బయటకు వచ్చింది. పక్కిళ్ల మహిళలు, ఆ ఇంటి ఆడవాళ్లు కూడా సిద్ధంగా ఉన్నారు కొత్తకోడలి కోసం ఎదురు చూస్తూ. ‘చీకట్లో ఎక్కడికి’ అడిగింది. ‘మరి చీకటి వదలక ముందే వెళ్లి రావాల్సిన పనికి చీకటి వదిలాక వెళ్తావా’ పరాచికాలాడిందొకామె. ‘మగవాళ్లు నిద్రలేవక ముందే వెళ్లి రావాలి’ అంటూ మరొకామె హెచ్చరించింది. అంతా కలిసి కిలోమీటరు దూరానున్న పొలాల్లోకి వెళ్లారు. ఎక్కడ అడుగు పెడుతోందో తెలియట్లేదు కోమల్‌కి. కీచురాళ్ల రొద, తుప్పల్లో కాలు పెట్టాలంటే భయమేసింది. పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన తర్వాత ఆమె భర్తను డిమాండ్ చేసింది. ‘ఇంట్లో టాయిలెట్ కట్టాల్సిందే’ అని. రెండంతస్తుల ఇంట్లో డబుల్ సిలిండర్ గ్యాస్ కనెక్షన్ ఉంది, వాటర్ ప్యూరిఫయర్ కూడా ఉంది. కానీ టాయిలెట్ మాత్రం లేదు. ఇంట్లో వాళ్లందరినీ తన వాదనతో సమాధానపరిచింది కోమల్. అనుకున్నది సాధించుకుంది. ఏడాది తిరిగే సరికి ఊళ్లో 250 టాయిలెట్‌లు కట్టించింది.

ఎలా సాధ్యమైంది?

అందరూ కలిసి గ్రామపెద్ద చహాత్ రామ్‌ను కలిశారు. టాయిలెట్ కట్టుకుంటామని వచ్చిన వాళ్లను చూసేసరికి చహాత్ రామ్‌కు ప్రాణం లేచి వచ్చింది. ప్రభుత్వం నుంచి నిధులున్నాయి. ప్రతి ఇంటికీ కట్టించమనే ఆదేశమూ ఉంది. ఎంత చెప్పినా టాయిలెట్ కట్టించుకోవడానికి ముందుకు వచ్చే వాళ్లే కరువయ్యారు. ఒక అమ్మాయి అలా చొరవ చూపడంతో గ్రామ పెద్ద ఆ అవకాశాన్ని వదులుకోలేదు. ఆ అమ్మాయితోనే మిగిలిన ఆడవాళ్లకు నచ్చ చెప్పిస్తే పనవుతుందనుకున్నాడు. పైగా నగరం అమ్మాయి, చదువుకున్న అమ్మాయి. తెలివితేటలతో ఊరిని ఒక తాటి మీదకు తెస్తుందని ఆశించాడు. అలా కోమల్ తన ఇంటి నుంచి మొదలు పెట్టిన టాయిలెట్ విప్లవాన్ని ఊరంతటికీ విస్తరించింది. మహిళలందరినీ కూర్చోబెట్టి తెల్లవారు జామున నాలుగింటికి, రాత్రి తొమ్మిది తర్వాత పొలాల్లోకి వెళ్లడం వల్ల మహిళలకు ఎదురయ్యే ప్రమాదాల గురించి హెచ్చరించింది. బహిరంగ విసర్జన వల్ల వచ్చే అనారోగ్యాలను వివరించింది. ప్రమాదాలు వాళ్లకు అర్థమయ్యాయి, కానీ బహిరంగ విసర్జన అనారోగ్యాలకు ఎలా కారణమవుతుందో వాళ్లకు ఎంత చెప్పినా అర్థం కాలేదు. స్కూలు పిల్లలను సమీకరించింది, వాళ్ల పుస్తకాల్లో ఉన్న పాఠాలను పెద్దవాళ్లకు అర్థమయ్యేలా చెప్పింది. మొత్తానికి ఊరందరి చేత మరుగుదొడ్డి కట్టించింది కోమల్.

కట్టించడం వరకు ఓకే!

ఊరందరినీ సమాధాన పరిచి ఇంటింటికీ టాయిలెట్ కట్టడం పూర్తయింది. కానీ వాటిని వాడుకలోకి తేవడం మరో ఘట్టమైంది. టాయిలెట్ గదుల్లో సామాను భద్రపరిచారు కొందరు. ‘అది ఆడవాళ్ల కోసం, మగవాళ్లం మేమెందుకు వాడాలి’ అని వాదించారు మరికొందరు. చివరికి బహిరంగంగా విసర్జన చేసే వాళ్లను పిల్లల చేత విజిల్ ఊదించి ఎగతాళి చేయించడం అనే టెక్నిక్ పూర్తి ఫలితాలనిచ్చింది.

‘మోదీ ప్రభుత్వం టాయిలెట్ ఫస్ట్, టెంపుల్ లేటర్.. అనే నినాదంతో 2014 నుంచి తొమ్మిది కోట్లకు పైగా టాయిలెట్‌లను కట్టించినప్పటికీ, ఆ స్ఫూర్తితో మా నిథోరాలో ఒక్కటీ కట్టించలేకపోయాను. కోమల్ తెచ్చిన విప్లవంతోనే ఇది సాధ్యమైంది’ అని ప్రశంసించాడు గ్రామపెద్ద.

– మంజీర

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శుక్రవారం
25-1-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నాకో డౌట్. మీది లవ్ మ్యారేజా? అరేంజ్డ్ మ్యారేజా? ఎలా సార్ ఇలా ప్రేమ గురించి ఇంత బాగా తెలుసు మీకు??

– రాజ్

'నన్ను అడగాల్సిన ప్రశ్న ఆయన్ని అడిగితే ఎలా రాజ్????

ప్రేమా పాడా..?? సార్‌కి ప్రేమ ఉండదు. అబ్బాయిలను పిండేసే కక్ష.... అమ్మాయిలను చెల్లెల్లా చూసుకునే మురిపెం...!!

ఈయన లైఫ్‌లో ప్రేమ ఉంటే అబ్బాయిలను అన్నేసి క్లాసులు పీకేవాడా నువ్వే ఆలోచించు రాజ్...?!

ఒట్టి శాడిస్ట్!!

లవ్వును దగ్గరకు రానివ్వని క్రూరాతి క్రూరుడు. అసలు మీలాంటి బకరాలు ఆయనకు అడ్వైజ్ కోసం ఉత్తరాలు ఎందుకు రాస్తున్నారో నాకైతే పెద్ద డౌట్. ఏమి చూసి రాస్తారో...?!

విలన్‌లాగ మీసాలు...!

పాషాణ హృదయుడు..!!

అసలు మగ పురుగులకు కూడా హార్ట్ ఉంటుందని నమ్మని హార్ట్‌లెస్ మ్యాన్!!

అందుకే ఆయనకు హార్ట్ ఉందని.. బై మిస్టేక్ దాంట్లో లవ్ ఉంటుందని భ్రమ పడకు. బండ.. ఒట్టి బండ క్యారెక్టర్.

మిగతా విషయాలు తర్వాత చెబుతా రాక్షసుడు వస్తున్నాడు.. బై రాజ్!'

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి:
పుడుతూనే ఉయ్యాలా నువ్వు పోతే మొయ్యాలా
పుడుతూనే ఉయ్యాల నువ్వు పోతే మొయ్యాల
ఈ లోపే ఏదో చెయ్యాలా
ఏలాలా ఏలాలా దునియానే ఏలాలా
చెక చెక చెక చెడుగుడు ఆడాలా
తూగుంటే వస్తయా మావెంటె ఉంటయా
కొండంత ఆశయ కూసింతె లైఫ్ యా
ఇరగేసెయ్ తిరగేసెయ్ దున్నేసెయ్
దులిపేసెయ్
అందంగా ఆనందంగా ఇష్టంగా బతికేసెయ్
॥ఇరగేసెయ్॥ ॥పుడుతూనే॥

చరణం-1:
అవకాశం రాలేదంటూ గుక్కే పట్టి ఏడద్దే
ఏనాడో వచ్చుంటుంది నువ్వే వదిలేసుంటావే
చీకటిని తిడుతూ తొంగుంటే వేకువకి చోటే
లేదులే
నిన్నేం తిరిగి రాదు కదా రేపేం జరుగుతుందో
కదా
నీకై మిగిలి ఉంది ఇక ఈ రోజే
తాడే లేని దారులు ట్విస్టే లేని గాథలు
రిస్కే లేని లైఫులో బోర్ బోరే
నువ్వెంతో ఎత్తుకి ఎదిగినా బోల్డంత
సంపాదించినా
ఒరే నాన్న పొంగిపోకురా...
గెలుపెవ్వడి సొత్తు కాదురా అది నీతో
మొదలవలేదురా
అది ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్స్‌రా...
॥పుడుతూనే॥

చరణం-2:
నిలుచుంటే బస్ స్టేషన్‌లో బస్సొస్తాది ఎక్కొచ్చే
పడిపోతే ఫ్రస్టేషన్‌లో ఏముంటాది ఎక్కెక్కే
ఇన్నేళ్లు చేసినా పొరపాటూ సక్సెస్‌తో
సర్దేయొచ్చులే
పడినా తిరిగి లేవడం బాల్యం మొదటి లక్షణం
దాన్నే మరచిపోవడం వింతేగా
తేదీ ఎంత అవసరం ఇట్టే తెలుసుకోవడం
అంతే మోసుకెళ్లడం హ్యాపీరా
నిను భయపెట్టే పనులేమిటో అవి చేసెయ్
రోజుకొక్కటి
ఇక ఆపై జడుపే రాదురా...
నీ తోలే గుల్లైపోయినా కర్మంతా కాలిపోయినా
ప్రేమిస్తేనే పని చెయ్యరా...
॥పుడుతూనే॥

చిత్రం : నేనింతే (2008)
రచన : భాస్కరభట్ల
సంగీతం : చక్రి
గానం : గీతామాధురి, బృందం

కాసుకో సుడోకు

3	5			8		4		1
1		6	4					
9	4				5		8	6
5	7			2	3		6	
6			7		4			8
	2		1	6			7	5
7	1		2				3	9
					7	1		2
2				3			5	7


నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	7	5	3	1	4	8	2	9
2	1	9	5	8	6	3	4	7
3	4	8	2	9	7	1	5	6
1	8	4	6	7	2	9	3	5
7	9	3	4	5	1	2	6	8
5	2	6	9	3	8	7	1	4
4	6	7	8	2	3	5	9	1
8	5	2	1	4	9	6	7	3
9	3	1	7	6	5	4	8	2

హిట్ గ్యారంటీ.. డౌట్ లేదు

– బీవీఎస్ఎన్ ప్రసాద్



● వెంకీ అట్లూరి, బీవీఎస్ఎన్ ప్రసాద్, అఖిల్, నిధీ అగర్వాల్

''మిస్టర్ మజ్ను' సినిమా చాలా బాగా వచ్చింది. గ్యారంటీగా మంచి హిట్ అవుతుంది. అందులో ఏ మాత్రం డౌట్ లేదు. జనరల్‌గా హీరోలు.. హీరోయిన్స్‌ని బాగా చూసుకుంటారు. కానీ, అఖిల్ మాత్రం నన్ను బాగా చూసుకున్నాడు (నవ్వుతూ). సాంకేతిక నిపుణులందరూ చాలా బాగా పని చేశారు. ప్రేక్షకులు మా సినిమా చూసి, ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. అఖిల్, నిధీ అగర్వాల్ జంటగా 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకీ అట్లూరి మాట్లాడుతూ– ''తొలిప్రేమ' సినిమా కంటే ముందే 'మిస్టర్ మజ్ను' కథ రాసి, నిర్మాత 'దిల్' రాజుగారికి వినిపించా. 'బలమైన ఎమోషన్స్ ఉన్న కథ ఇది.. అనుభవం ఉన్న దర్శకుడైతే చక్కగా తీయగలడు. ఓ ఏడాది నాతో ట్రావెల్ చెయ్. కొంచెం అనుభవం వస్తుంది, ఆ తర్వాత చేద్దాం' అన్నారు. ఆ ప్రయాణంలో ఉన్నప్పుడే 'తొలిప్రేమ' కథ రాసి, రాజుగారికి వినిపించా. బాగుంది.. 'ఈ సినిమా తర్వాత 'మిస్టర్ మజ్ను' తీస్తే మంచి స్పాన్ ఉంటుంది' అన్నారు. 2011–2012లో ఈ కథ రాశా. టైటిల్ 'మిస్టర్ మజ్ను' అని, సినిమా ఏఎన్ఆర్‌గారి వారసులతోనే చేయాలని ఫిక్స్ అయ్యా. ఈ కథకి అఖిల్ చక్కగా న్యాయం చేయగలడనే నమ్మకం కుదిరింది. తనకు కథ చెప్పగానే ఓకే అన్నాడు. ఇందులో అఖిల్‌ది ప్లేబోయ్ పాత్ర కాదు. 20నిమిషాలు నాటీ పాత్ర ఉంటుంది. ఆ తర్వాత అంతా లవ్‌స్టోరీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఉంటుంది. మా సినిమా చూసి నవ్వుతారు, ఏడుస్తారు, ఆలోచిస్తారు. 'తొలిప్రేమ' కంటే మంచి పాటలివ్వాలని తమన్ నాకంటే బాగా కష్టపడ్డారు'' అన్నారు. అఖిల్ మాట్లాడుతూ– ''నేను ఇలాంటి సినిమా చేసినందుకు నాన్నగారు (నాగార్జున) చాలా హ్యాపీగా ఉన్నారు. ఈ సినిమా మా ఫ్యామిలీకి తగ్గ జోనర్. మంచి ప్రొడక్ట్ ఇస్తున్నామనే నమ్మకంతో ప్రతిరోజూ షూటింగ్‌కి ఎంతో ఉత్సాహంగా వెళ్లేవాణ్ని'' అన్నారు. ''ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన ప్రసాద్ సార్‌కి, వెంకీకి థ్యాంక్స్. అఖిల్ మంచి సహనటుడు. ఈ చిత్రంలోని పాత్రకు బాగా కనెక్ట్ అయ్యి చేశా'' అన్నారు నిధీ అగర్వాల్.

సైన్స్ రాజా



● రవితేజ

రవితేజ బర్త్‌డే ఈ నెల 26న. పుట్టినరోజుకి అభిమాన హీరో నుంచి కొత్త సినిమా ప్రకటన వస్తుందా? అని కొన్ని రోజులుగా ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారు. వాళ్లకో తీపి వార్త. రవితేజ చేయబోయే తాజా చిత్రం టైటిల్ అండ్ టైటిల్ లోగోను ఆ రోజు విడుదల చేయనున్నారు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' ఫేమ్ వీఐ ఆనంద్ దర్శకత్వంలో ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'డిస్కో రాజా' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఇందులో ముగ్గురు హీరోయిన్లు నటిస్తారు. పాయల్ రాజ్‌పుత్ కన్ఫార్మ్ అయ్యారు. మరో హీరోయిన్‌గా నభా నటేష్ కన్ఫార్మ్ అయ్యారట. ''జనవరి 26 రిపబ్లిక్ డే. అలాగే రవితేజ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తాం. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ చేస్తాం'' అని నిర్మాత పేర్కొన్నారు. సైంటిఫిక్ అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుందని సమాచారం. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్ర చేయనున్న ఈ సినిమాలో విలన్‌గా తమిళ నటుడు బాబీ సింహా నటిస్తారట.

ప్రతీకారం తీరిందా?



● మోహన్‌లాల్

మోహన్‌లాల్, నయనతార, ముఖేష్ ముఖ్య తారలుగా రూపొందిన మలయాళ చిత్రం 'విస్మయతుంబతు'. నాగార్జునతో 'కిల్లర్' మూవీ తెరకెక్కించిన ఫాజిల్ ఈ చిత్రానికి దర్శకుడు. ఈ సినిమాని ఓం శ్రీ నమో లలితాంబ క్రియేషన్స్‌పై కె.కస్తూరి (లల్లీ), సి.హెచ్. సరోజ గంగారామ్ తెలుగులో 'మహాతంత్రం' పేరుతో రిలీజ్ చేస్తున్నారు. ''మనుషుల్లో ఉన్న రాక్షసత్వాన్ని పోగొట్టడానికి, తన ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి, ప్రియురాలిని కాపాడటం కోసం ఓ వ్యక్తి ఎలాంటి తంత్రం ఉపయోగించాడన్న కథతో తెరకెక్కిన చిత్రమిది. మలయాళంలో సూపర్ హిట్ అయినట్లుగానే తెలుగులోనూ మంచి హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఫిబ్రవరిలో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి నిర్వహణ: కె.ఐశ్వర్య, చిరంజీవి, సమర్పణ: వర్మ.

పవర్ ఆఫ్ యూత్!



● పునీత్ రాజ్‌కుమార్

కాలేజీ స్టూడెంట్స్ లవర్స్ డేని ప్రత్యేకంగా చూస్తారు. అందుకే తన తర్వాతి చిత్రం 'యువరత్న'ను ఆ రోజే ఆరంభించాలని డిసైడ్ అయ్యారు కన్నడ స్టార్ పునీత్ రాజ్‌కుమార్. ఎందుకంటే ఆయన దాదాపు పదిహేనేళ్ల తర్వాత ఈ సినిమాలో స్టూడెంట్ పాత్రలో కనిపించబోతున్నారట పునీత్. ఈ సినిమాకు 'పవర్ ఆఫ్ యూత్' అనే ట్యాగ్‌లైన్ పెట్టారు. హీరోయిన్ పాత్ర కోసం ప్రముఖ సౌత్ ఇండియన్ హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నారట టీమ్. ప్రస్తుతం పునీత్ నటించిన 'నటసార్వభౌమ' చిత్రం రిలీజ్‌కు రెడీగా ఉంది. ఈ రోజు ఉదయం ఈ సినిమా ట్రైలర్ విడుదల అవుతుంది. అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

హ్యాక్ అయ్యాయి



● హన్సిక

ఇటీవల కమల్‌హాసన్ కూతురు అక్షరా హాసన్‌కు సంబంధించిన కొన్ని వ్యక్తిగత ఫొటోలు లీక్ అయ్యి సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు కథానాయిక హన్సిక వ్యక్తిగత ఫొటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఇటీవల ఆమె న్యూయార్క్ హాలిడేకి వెళ్లినప్పటి ఫొటోలు అవని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిలో హన్సిక బికినీ ధరించిన ఫొటోలు కూడా ఉన్నాయి. ఈ విషయం గురించి హన్సిక స్పందిస్తూ – ''నా ఫోన్, ట్వీటర్ అకౌంట్ హ్యాక్ అయ్యాయి. వాటి నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దు. కంట్రోల్ చేయడానికి మా టీమ్ వర్క్ చేస్తున్నారు'' అని పేర్కొన్నారు. సో... హ్యాక్ చేసినవాళ్లే హన్సిక ఫొటోలు బయట పెట్టి ఉంటారనుకోవాలేమో. ఇక ఆమె సినిమాల ప్రస్తావనకు వస్తే... తమిళంలో '100' అనే పోలీస్ థ్రిల్లర్ చేశారు. ఈ చిత్రం రిలీజ్‌కి రెడీగా ఉంది. ప్రస్తుతం 'మహా' అనే లేడీ ఓరియంటెడ్ సినిమాలో నటిస్తున్నారు. తెలుగులో సందీప్ కిషన్ సరసన ఓ సినిమాకి కమిట్ అయ్యారు హన్సిక.

చలిలో..!



● సూర్య

రాత్రివేళ మైనస్ 7 డిగ్రీల చలిలో సూర్య ఓ ఆపరేషన్ చేస్తున్నారట. ఈ ఆపరేషన్ వెనక స్టోరీని మాత్రం వెండితెరపై చూడాల్సిందే. సూర్య హీరోగా కేవీ ఆనంద్ దర్శకత్వంలో 'కాప్పాన్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సాయేషా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో బొమన్ ఇరానీ, మోహన్‌లాల్, ఆర్య కీలక పాత్రలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చండీఘర్‌లో జరుగుతోంది. ''మైనస్ 7 డిగ్రీల చలిలో రాత్రివేళ 'కాప్పాన్' సినిమా షూటింగ్ జరుపుతున్నాం'' అని దర్శకుడు కేవీ ఆనంద్ పేర్కొన్నారు. ఇందులో సూర్య ఎన్ఎస్‌జీ కమాండో పాత్రలో నటిస్తున్నారు. మోహన్‌లాల్ ప్రధాన మంత్రి పాత్రలో నటిస్తున్నారని కోలీవుడ్ టాక్. ఇక ఈ సంగతి ఇలా ఉంచితే... 'సింగమ్' సిరీస్‌తో హిట్ కాంబినేషన్ అనిపించుకున్న సూర్య–హరి మరో సినిమా చేయనున్నారట. ఈ సినిమాకు 'యానై' అనే టైటిల్ కూడా అనుకుంటున్నారట. యానై అంటే తెలుగులో ఏనుగు అని అర్థం. అలాగే ఇటీవల 'ఎన్‌జీకే' సినిమా షూట్‌ను కంప్లీట్ చేశారు సూర్య. సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ థ్రిల్లర్ సమ్మర్‌లో విడుదల కానుందని సమాచారం.




● సోనాక్షీ సిన్హా

కలలకు సంకెళ్లు!

మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ అమ్మాయి తన కలలను నిజం చేసుకోవాలనుకుంటుంది. కానీ ఆమె కలలకు కుటుంబ బాధ్యతలు సంకెళ్లు వేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో ఆ అమ్మాయి ఎదుర్కొన్న పరిస్థితులు ఏంటి? ఆమెకు కుటుంబం నుంచి ఎలాంటి సహకారం లభించింది అనే అంశాల ఆధారంగా హిందీలో ఓ సినిమా రూపొందనుంది. సోనాక్షీ సిన్హా ప్రధాన పాత్రలో నటిస్తారు. ఈ సినిమాతో శిల్పీ దాస్ గుప్తా దర్శకునిగా పరిచయం కానున్నారు. ఈ సినిమా షూటింగ్ నేడు పంజాబ్‌లో ప్రారంభం అవుతుంది. ''మన చుట్టూ ఉండే ఎందరో అమ్మాయిల కథే ఈ సినిమా. ఇందులో నటించబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమాలో కేవలం ఎమోషన్స్ మాత్రమే కాదు.. ఫన్ కూడా ఉంటుంది. షూటింగ్‌లో పాల్గొనడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అని అన్నారు సోనాక్షి పేర్కొన్నారు. ''ఈ సినిమా నవ్విస్తుంది. కన్నీళ్లు పెట్టిస్తుంది. ప్రతి క్యారెక్టర్‌తో ఆడియన్స్ లవ్‌లో పడిపోతారు'' అని నిర్మాతల్లో ఒకరైన భూషణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవలే 'కళంక్' మూవీ షూట్‌ను కంప్లీట్ చేసిన సోనాక్షి ప్రస్తుతం 'మిషన్ మంగళ్' సినిమాలో నటిస్తున్నారు.

భిన్న ముఖాలు!



● జాన్ అబ్రహాం

వెండితెరపై ఓ ఆపద నుంచి దేశాన్ని రక్షించేందుకు ఓ మిషన్‌ను స్టార్ట్ చేశారు బాలీవుడ్ హీరో జాన్ అబ్రహాం. గూఢచారిగా ఆ ఆపద నుంచి అతను దేశాన్ని ఎలా రక్షించాడు? అనే విషయం సమ్మర్‌లో తెలుస్తుంది. జాన్ అబ్రహాం హీరోగా హిందీలో రూపొందుతున్న చిత్రం 'రోమియో అక్బర్ వాల్టర్'. రోబ్బీ గ్రేవాల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో గూఢచారిగా నటిస్తున్నారు జాన్. ఈ సినిమాకు సంబంధించిన రెండు లుక్స్‌ను విడుదల చేశారు. 'ఒక వ్యక్తి. భిన్నముఖాలు. దేశాన్ని కాపాడటం కోసం చేసే ఓ మిషన్' అంటూ ఈ లుక్స్‌ను రిలీజ్ చేశారు జాన్. ఇందులో జాన్ అబ్రహాం ఎనిమిది డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారని బాలీవుడ్ సమాచారం. మౌనీ రాయ్, జాకీ ష్రాఫ్, సుచిత్రా కృష్ణమూర్తి తదితరులు నటిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 12న విడుదల కానుంది.

ఫుల్ యాక్షన్



● అరవింద్ స్వామి

ప్రిపరేషన్ స్టార్ట్ చేశారు నటుడు అరవింద్ స్వామి. ఎందుకంటే తన తర్వాతి చిత్రం కోసం. అవును... ఆయన నెక్ట్స్ చిత్రం ఖరారు అయ్యింది. నిర్మల్ కుమార్ దర్శకత్వంలో అరవింద్ స్వామి హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ''ఫుల్ యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఫస్ట్ హాఫ్‌లో ఒక లుక్‌తో కనిపించిన అరవింద్ స్వామి సెకండాఫ్‌లో మరో లుక్‌తో సర్‌ప్రైజ్ చేస్తారు. ఈ లుక్స్‌కు సంబంధించి ఆయన ఆల్రెడీ ట్రైనింగ్ కూడా స్టార్ట్ చేశారు. మార్చిలో అరవింద్ స్వామి లుక్, టైటిల్‌ను అనౌన్స్ చేస్తాం. మార్చి 20న ఈ సినిమా షూటింగ్ చెన్నైలో స్టార్ట్ అవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకన్నా ముందు నిర్మల్‌కుమార్ దర్శకత్వంలో అరవింద్ స్వామి 'చతురంగ వేట్టై 2' అనే సినిమా చేశారు. ఇక ఆయన కీలక పాత్ర చేసిన 'నరగాసురన్' (తెలుగులో 'నరకాసురుడు') చిత్రం కూడా రిలీజ్‌కు దగ్గరపడుతోంది. ఇలా క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హీరోగా అరవింద్ స్వామి ఫుల్ బిజీగా ఉన్నారు.

నిర్మాత కేశవరావుకు మాతృ వియోగం

ప్రముఖ నిర్మాత, తెలుగు సినీ నిర్మాతల మండలి మాజీ సహ కార్యదర్శి పల్లి కేశవరావు తల్లి పల్లి రాములమ్మ (90) గురువారం తుదిశ్వాస విడిచారు. గన్నవరం తాలుకా కేశరపల్లి గ్రామంలో నేడు రాములమ్మ అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



● శుభాంగి పంత్, అరవింద్ రెడ్డి, తమ్మారెడ్డి భరద్వాజ్, దీక్షితా పార్వతి, అజిత్ రాధారామ్

రెండు జంటల ప్రేమకథ

''ప్రేమకథలు ఎన్నిసార్లు చెప్పినా బోర్ కొట్టవు. ట్రెండ్‌కు తగ్గట్టుగా దర్శకులు అప్‌డేట్ అవుతూ ప్రేమ కథలను నవతరానికి నచ్చేలా రాస్తున్నారు. అలా న్యూ ఏజ్ లవ్ స్టోరీగా తెరకెక్కిన చిత్రం 'నీ కోసం'' అని నిర్మాత అల్లూరమ్మ (భారతి) అన్నారు. అరవింద్ రెడ్డి, శుభాంగి పంత్, అజిత్ రాధారామ్, దీక్షితా పార్వతి ప్రధాన పాత్రల్లో అవినాష్ కోకటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీ కోసం'. తీర్థ సాయి ప్రొడక్షన్స్ పతాకంపై అల్లూరమ్మ (భారతి) నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్స్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలోని 'తొలితొలిగా...' పాటను దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. 'ఈ పాట చాలా బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలి' అన్నారాయన. ''రెండు జంటల మధ్య ప్రేమకథను ఈ తరానికి నచ్చేలా తెరకెక్కించిన సినిమా ఇది. ఎంటర్టైన్మెంట్ తగ్గకుండానే ప్రేమకథలో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతున్న ఈ చిత్రం టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. లవ్ స్టోరీలో ఎమోషన్స్‌కు ఎప్పుడూ ఎక్కువ స్కోప్ ఉంటుంది. అలాంటి ఎమోషనల్ అంశాలు మా చిత్రంలో ఉంటాయి. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అని అవినాష్ కోకటి అన్నారు. సుదర్శన్, 'ఈ రోజుల్లో' సాయి, కేధార్ శంకర్, పూర్ణిమ, కల్పలత, మహేష్ విట్టా ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి సంగీతం: శ్రీనివాస్ శర్మ, కెమెరా: శివకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: తేజేశ్వరి అన్నపురెడ్డి, సహ నిర్మాతలు: సోమశేఖర్ రెడ్డి, అల్లూరి రెడ్డి. ఏ.

ఫ్యాషన్

కళ్యాణ కళ





పెళ్లిళ్ళ సీజన్ వచ్చేసింది పట్టు కళ వేడుకలలో ధగధగలాడటానికి సరికొత్తగా ముస్తాబు అవుతోంది. నవతరం లుక్‌లో వచ్చిన మార్పుకు ఆధునికత అద్దం పడుతోంది. ఇండోవెస్ట్రన్ స్టైల్ బ్లౌజ్‌లకు సంప్రదాయ పట్టు జత చేరి రెట్రో కళతో వెలిగిపోతోంది.

షోల్డర్ డౌన్, స్లీవ్‌లెస్ డిజైనర్ బ్లౌజ్‌లతో కంచిపట్టు చీరలకు మోడ్రన్ కళ తీసుకురావచ్చు. అంతేకాదు బామ్మలకాలం నాటి శారీస్‌తోనూ వేడుకలో ఆకట్టుకునే కట్టును ఈ తరం ఎంచుకుంటోందనడానికి ఈ మోడల్ సిసలైన ఉదాహరణ.

కంచిపట్టు చీరకు ప్లెయిన్ బ్లౌజ్‌తోనూ డిఫరెంట్ లుక్ తీసుకురావచ్చు. బ్యాక్ హైనెక్, ఫ్రంట్ డీప్ నెక్ ఉన్న ప్లెయిన్ బ్లౌజ్‌కి కాంట్రాస్ట్ నెటెడ్ కుచ్చులు జత చేస్తే ఇండోవెస్ట్రన్ లుక్ వచ్చేస్తుంది.

‘గ్రే కలర్ చీరలు వేడుకలో డల్‌గా ఉంటాయి’ అని సందేహించేవారికి గ్రేస్ లుక్‌తో చూపులను కట్టడి చేస్తున్నాయి ఈ చీరలు. నెటెడ్ బుట్ట చేతుల డిజైనర్ బ్లౌజ్ ఈ శారీకి అసలైన ఎన్నిక. మెడకు నిండుదనాన్ని తెచ్చే వెడాల్పిటి నెక్లెస్, పొడవాటి హారాలు అదనపు అలంకరణ.



రెట్రోలుక్ ప్రతి వేడుకకూ ఎవర్‌గ్రీన్ అలంకరణ అవుతుంది ఈ రోజుల్లో. దానికి కొద్దిపాటి మెళకువలతో చీరలకు కొత్త సింగారాలను అద్దవచ్చు. రౌండ్ క్లోజ్డ్ నెక్, కుచ్చుల చేతులున్న బ్లౌజ్‌లు పట్టు చీరల అందాన్ని రెట్టింపు చేస్తాయి.




- శశి వంగపల్లి,
ఫ్యాషన్ డిజైనర్,
ముగ్ధ ఆర్ట్ స్టూడియో, హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
25-1-2019

పరి పరిశోధన

గ్రహాల ‘ఢీ’తోనే జీవం పుట్టుక!



భూమి మీద జీవం ఎలా పుట్టిందన్న ఆసక్తికరమైన ప్రశ్నకు రైస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ కొత్త సమాధానాన్ని ప్రతిపాదిస్తున్నారు. కోటానుకోట్ల ఏళ్ల క్రితం ఇంకో గ్రహం ఒకటి భూమిని ఢీకొట్టిందన్న విషయం మనకు తెలుసు కదా. మన ఉపగ్రహం జాబిల్లి పుట్టుకకు కారణమైన సంఘటన జీవం ఏర్పడేందుకూ దోహదపడిందని వీరు అంటున్నారు. భూమి ఏర్పడి దాదాపు 450 కోట్ల ఏళ్లు అయి ఉంటుందని అంచనా. ఏర్పడిన తొలినాళ్లలో అంతరిక్షం నుంచి దూసుకొచ్చిన గ్రహశకలాలు బోలెడు భూమిని ఢీకొట్టాయి. ఈ పేలుళ్ల ఫలితంగా అప్పట్లో భూమి మీద లెక్కలేనన్ని భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లూ జరుగుతూండేవని శాస్త్రవేత్తల అంచనా. ఈ క్రమంలోనే ఓ భారీ గ్రహశకలం ఢీకొన్న ఫలితంగా భూమి నుంచి వేరుపడ్డ ఒక భాగం చంద్రుడిగా అవతరించిందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే రైస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తాజాగా ఇంకో అధ్యయనం చేయడం ద్వారా ఈ సంఘటన జీవం పుట్టుకకు కూడా కారణమని చెబుతున్నారు. జీవం మనుగడకు అత్యంత కీలకమైన కార్బన్, నైట్రోజన్ తదితర పదార్థాలు భూమి మీద ఎప్పటి నుంచి అందుబాటులోకి వచ్చాయన్న అంశం ఆధారంగా తాము ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త దమన్‌వీర్ గ్రేవాల్ చెబుతున్నారు. కంప్యూటర్ సిములేషన్ ద్వారా అప్పటి పరిస్థితులను, రకరకాల అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించామని, జీవం ఏర్పడేందుకు అవసరమైన నిష్పత్తిలో ఈ మూలకాలు 440 కోట్ల ఏళ్ల క్రితం ఉన్నట్లు తెలిసిందని వివరించారు.

మన వేడితోనే విద్యుత్తు...



శరీర వేడితోనే విద్యుత్తును ఉత్పత్తి చేసి వాడుకోగల సరికొత్త వస్త్రాన్ని అభివృద్ధి చేశారు మసాచుసెట్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్త త్రిషా ఆండ్రూ. ఈ సరికొత్త వస్త్రం ద్వారా సెన్సర్లు, పేస్ మేకర్లు, ఇతర చిన్న చిన్న ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పనిచేయించవచ్చునని అంచనా. మన శరీర ఉష్ణోగ్రతలకు, పరిసరాల్లోని వేడికి మధ్య ఉండే అంతరాన్ని ఆధారంగా చేసుకుని తాము ఈ వస్త్రాన్ని తయారుచేశామని, విద్యుత్తును బాగా ప్రసారం చేయగల, వేడిని ప్రసారం చేయలేని పదార్థాలను పొరలుగా అమర్చినప్పుడు విద్యుత్తు ఛార్జ్ అనేది వేడిగా ఉన్న చోటు నుంచి చల్లటి ప్రాంతానికి వెళుతుందని త్రిష తెలిపారు. ఈ పద్ధతి ద్వారా ఎనిమిది గంటల వ్యవధిలో ఒక వ్యక్తి నుంచి కొంత విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చునని ఇప్పటికే తెలుసు. అయితే ఇందుకు అవసరమైన ప్రత్యేక పదార్థాల తయారీ ఇప్పటివరకూ వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఉన్ని, ప్రత్తి వంటివాటితో అతిచౌకగా ప్రత్యేక పదార్థాలను తయారు చేయగలిగారు త్రిష. వీటన్నింటితో తయారైన ఒక చేతి బ్యాండ్ దాదాపు 20 మిల్లీవోల్టుల విద్యుత్తును పుట్టించాయని త్రిష తెలిపారు. అంతేకాకుండా.. స్వేదం విద్యుదుత్పత్తిని మరింత పెంచుతున్నట్లు తాము గుర్తించామని తెలిపారు. ఈ ప్రత్యేక పదార్థాలతో తయారైన దుస్తులను ధరించినప్పుడు స్మార్ట్ గాడ్జెట్లకు విద్యుత్తు అవసరం లేకుండా పోతుందని అంచనా.

విజయం

జీవితాన్నీ ఈదేసింది...



● అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలను సాధించిన అన్నపూర్ణ

ఆరోగ్యం కోసం నేర్చుకున్న ఈత ఆమెను స్విమ్మింగ్‌లో అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. శారీరక వ్యాయామం అవుతుందని స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగిన ఆమెకు ఆ ఈతే ఇప్పుడు తన కాళ్లపై తాను నిలబడేలా ఉపాధినిస్తోంది. ‘కోచ్‌గా అంతర్జాతీయ పాఠశాలలో విద్యార్థులకు ఈత నేర్పే అవకాశం వచ్చింది’ అని సంబరంగా చెబుతుంది ఈతలో మేటిగా ఎదిగిన చందికంటి అన్నపూర్ణ.

నేటి రోజుల్లో ఇల్లు గడవాలంటే భర్త సంపాదనకు ఇల్లాలి ఆదాయం ఎంతో కొంత తోడవ్వాలి అనే వారి సంఖ్య పెరిగింది. అందుకే మొదట్లో ఉపాధి కోసం ఇంట్లోనే టైలరింగ్ పని చేసేవారు అన్నపూర్ణ. దాంట్లో పెద్దగా ఆదాయం లేకపోవడంతో స్వయంగా డ్రైవింగ్ స్కూల్ నడిపారు. మార్కెట్‌లో ఉన్న పోటీకి డ్రైవింగ్ స్కూల్ నడపడం కొంత ఇబ్బందిగా మారింది. ‘వేసవి సెలవుల్లో మా ఇద్దరు పిల్లలకు స్కేటింగ్ నేర్పించేందుకు నిజామాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ కాంప్లెక్స్‌కు వెళ్లాను. పిల్లలు స్కేటింగ్ చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న సిమ్మింగ్‌పూల్‌లో కొందరు చిన్నారులు స్విమ్మింగ్ నేర్చుకోవడాన్ని చూశారు. వ్యాయామంతో పాటు, ఆరోగ్యానికీ ఉపయోగపడుతుందని, స్విమ్మింగ్ నేర్చుకుంటే బాగుంటుందని మా ఫ్రెండ్స్‌తో మాట్లాడాను. వాళ్లూ సరే అన్నారు. అలా నాతో పాటు మరో ఇద్దరు మహిళలు వ్యాయామం కోసం ఈత నేర్చుకోవడం మొదలుపెట్టారు’ అని పదేళ్ల నాటి స్థితిని వివరించారు అన్నపూర్ణ.

అంచెలంచెలుగా...

ఈత పోటీల్లో అన్నపూర్ణ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ‘మొదట 2009లో నిజామాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలలో (మాస్టర్స్) మహిళా విభాగంలో పాల్గొన్నాను. మొదటి పోటీలోనే స్వర్ణ పతకం వరించింది. ఆ తర్వాత రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. దీంతో జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాను. హైదరాబాద్, బెంగళూరు, భోపాల్, గుజరాత్, గుల్బర్గా, వైజాగ్ తదితర ప్రాంతాల్లో జరిగిన జాతీయ స్థాయి ఈత పోటీల్లో బంగారు, రజితం, కాంస్య.. పతకాలను సాధించాను’ అని మెరిసేకళ్లతో చెప్పే అన్నపూర్ణ కిందటేడాది ఫిబ్రవరిలో కజకిస్తాన్‌లో జరిగిన అంతర్జాతీయ సిమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో మూడు బంగారు, ఒక రజత పతకాన్ని సాధించి రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయికి పెంచారు.

కోచ్‌గా స్వయం ఉపాధి

అన్నపూర్ణ స్వస్థలం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం అంజుమాన్‌ఫారం. ఇంటర్ వరకు చదువుకున్నారు. భర్త సత్యపాల్‌గౌడ్ చిరువ్యాపారి. ఇద్దరు అబ్బాయిలు బీటెక్, ఇంటర్ చదువుతున్నారు. అన్నపూర్ణ ప్రస్తుతం హైదరాబాద్ శివారులో ఉన్న గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నారు. ‘2008లో నేను స్విమ్మింగ్ నేర్చుకున్నప్పుడు నిజామాబాద్‌లో ఇద్దరు ముగ్గురు మినహా మహిళలెవ్వరూ ఈత నేర్చుకునేందుకు ముందుకురాలేదు. ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావించి నేర్చుకున్న ఈత నాకు ఉపాధి కల్పిస్తుందని ముందు అనుకోలేదు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది’ అని అన్నపూర్ణ పేర్కొన్నారు.

- పాత బాలప్రసాద్, సాక్షి, నిజామాబాద్

హోమియో కౌన్సెలింగ్స్

నా వయసు 44 ఏళ్లు. నాకు కొంతకాలంగా కడుపులో విపరీతమైన మంటతోనూ, నొప్పి, అజీర్ణం, కడుపు ఉబ్బరంతో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే గ్యాస్ట్రైటిస్ అన్నారు. మందులు వాడుతున్నంత సేపు బాగానే ఉన్నా, అవి మానేస్తే మళ్లీ మామూలే. అసలు ఈ సమస్య ఎందుకు వస్తుంది. హోమియో చికిత్స ద్వారా నయమవుతుందా?

– డి.ఆర్. మహేశ్, కందుకూరు

గ్యాస్ట్రయిటిస్ నయమవుతుందా?



ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో అధిక పని ఒత్తిడి వల్ల ఉరుకులు పరుగుల జీవితం గడుపుతున్న నేపథ్యంలో చాలా మంది సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురికావడం, శారీరక శ్రమ పెద్దగా లేకపోవడం వంటి కారణాలతో చాలామంది గ్యాస్ట్రైటిస్ సమస్యతో ఇప్పుడు బాధపడుతున్నారు. జీర్ణకోశం లోపల ఉండే మ్యూకస్ పొర ఇన్‌ఫ్లమేషన్ లేదా వాపునకు గురికావడాన్ని గ్యాస్ట్రైటిస్ అంటారు. మనం తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు మన మెదడు లాగే జీర్ణ వ్యవస్థ మీద కూడా ప్రభావం పడుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు ఆకస్మికంగా మొదలై కొన్ని రోజుల వరకు ఉండి తగ్గిపోతే అక్యూట్ గ్యాస్ట్రైటిస్ అంటారు. దీర్ఘకాలికంగా ఇదే సమస్య ఉంటే దాన్ని క్రానిక్ గ్యాస్ట్రైటిస్ అంటారు. కొందరిలో గ్యాస్ట్రిక్ సమస్య ముదిరితే అవి కడుపులో అల్సర్స్ లేదా పుండ్లుగా ఏర్పడతాయి.

కారణాలు : – 20 నుంచి 50 శాతం అక్యూట్ గ్యాస్ట్రైటిస్ లకు వైరస్, బ్యాక్టీరియా (ముఖ్యంగా హెలికోబ్యాక్టర్ పైలోరీ అనే బ్యాక్టీరియా) కారణమవుతుంది. ● తీవ్రమైన మానసిక ఒత్తిడి, మద్యం ఎక్కువగా తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం ● కొన్ని రకాల మందులు... ముఖ్యంగా పెయిన్ కిల్లర్స్ వాడటం ● పైత్య రసం వెనక్కి ప్రవహించడం ● కొన్ని జీర్ణకోశ వ్యాధులు (క్రాన్స్ డిసీజ్), కొన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధులు ● శస్త్రచికిత్స లేదా వంశపారంపర్య చరిత్ర ఉన్నవారిలో ● ఆహారంలో వేపుళ్ళ, మసాలాలు, కారం, పులుపు వంటివి ఎక్కువగా తీసుకునే వారిలో గ్యాస్ట్రైటిస్ సమస్య కనిపిస్తుంది.

లక్షణాలు : కడుపు నొప్పి, మంట ● కడుపు ఉబ్బరం, కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపించడం ● అజీర్ణం, వికారం, రక్తంతో కూడిన వాంతులు ● ఆకలి తగ్గిపోవడం ● కొందరిలో గ్యాస్ట్రిక్ సమస్య వల్ల మలం రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ కోసం పాటించాల్సిన జాగ్రత్తలు

● సమయానికి ఆహారం తీసుకోవాలి ● కొద్దికొద్ది మోతాదుల్లో ఎక్కువ సార్లు తినాలి ● పొగతాగడం, మద్యపానం వంటి దురలవాట్లు పూర్తిగా మానేయాలి ● ఆహారంలో మసాలాలు, కారం, వేపుళ్లు తగ్గించాలి తిన్న వెంటనే పడుకోకూడదు. కనీసం రెండు గంటల తర్వాత నిద్రించాలి.

చికిత్స : హోమియో వైద్య విధానం ద్వారా గ్యాస్ట్రిక్ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుంది. ఈ సమస్యలకు మూలకారణమైన ఆమ్లాలు, తీవ్ర రసాయనాల సమతౌల్యతను చక్కదిద్దడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.



డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

ఫ్యామిలీ డాక్టర్

మా అమ్మాయి వయసు 24 ఏళ్లు. గత కొంతకాలంగా ఎప్పుడూ పరధ్యానంగా ఉంటోంది. ఎవరితో సరిగా మాట్లాడటం లేదు. మాట్లాడినా ఆ మాటలు తీవ్రమైన నిరాశపూరితంగా ఉంటున్నాయి. ఎప్పుడూ ఒంటరిగా కూర్చొని ఏదో ఆలోచిస్తూ ఉంటోంది. ఆమెకు సరైన హోమియో మందు సూచించండి.

– ఆర్. సత్యవతి, రాజమండ్రి

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తోంది... సమస్య నయమవుతుందా?



మీరు చెబుతున్న లక్షణాలు డిప్రెషన్ వ్యాధిని సూచిస్తున్నాయి. డిప్రెషన్ మనసుకు సంబంధించిన ఒక రకమైన రుగ్మత. దీనికి గురైన వారు విచారం, నిస్సహాయత, అపరాధభావం, నిరాశలలో ఉంటారు. భావోద్వేగాలు మారుతుంటాయి. శారీరకంగానూ కొన్ని మార్పులు కనిపిస్తాయి. అకస్మాత్తుగా బరువు కోల్పోవడం లేదా పెరగడం, చికాకు పడుతుండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరు నిర్దిష్టంగా కొన్ని కాలాలలో డిప్రెషన్‌కు గురయ్యే అవకాశం ఉంది. ఈ వ్యాధితో బాధపడే వారు పూర్తి డిప్రెషన్‌లోకి కూరుకుపోయేలోపే చికిత్స అందించడం మంచిది. హోమియో విధానంలో దీనికి మంచి చికిత్స ఉంది.

డిప్రెషన్‌ను రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది వంశపారంపర్యంగా వచ్చేది. రెండోది న్యూరోటిక్ డిప్రెషన్. ఇవి... మన చుట్టూ ఉండే వాతావరణం, సంఘంలో అసమానతలు, ఉద్యోగం కోల్పోవడం, ఎవరైనా దగ్గరివాళ్లు దూరం కావడం లేదా చనిపోవడం, తీవ్రస్థాయి మానసిక వేదన... వంటి ఎన్నో అంశాల వల్ల రావచ్చు. వివిధ పరిశోధనల ద్వారా ఈ ఆధునిక కాలంలో దీన్ని డిప్రెసివ్ డిజార్డర్‌గా పేర్కొన్నారు. దీనిలో రకాలు :

మేజర్ డిప్రెషన్ : ఇందులో డిప్రెషన్ లక్షణాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. ఆకలి లేకపోవడం, నిద్రలేకపోవడం, పనిలో శ్రద్ధ లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

డిస్థిమిక్ డిజార్డర్ : రోగి తక్కువస్థాయి డిప్రెషన్‌లో దీర్ఘకాలం పాటు ఉంటాడు. అయితే కొన్నిసార్లు రోగి నార్మల్‌గా ఉన్నట్లుగా అనిపించి, తిరిగి డిప్రెషన్ లక్షణాలు కనిపిస్తాయి.

సైకియాటిక్ డిప్రెషన్ : డిప్రెషన్‌తో పాటు భ్రాంతులు కూడా కనిపిస్తుంటాయి.

పోస్ట్ నేటల్ డిప్రెషన్ : మహిళల్లో ప్రసవం తర్వాత దీని లక్షణాలు కనిపిస్తుంటాయి.

సీజనల్ ఎఫెక్టివ్ డిప్రెషన్ : సూర్యరశ్మి తగ్గడం వల్ల కొంతమందిలో సీజనల్‌గా డిప్రెషన్ లక్షణాలు కనిపిస్తుంటాయి.

బైపోలార్ డిజార్డర్ : ఈ డిప్రెషన్‌లో కొంతమంది పిచ్చిగా, కోపంగా, విపరీతమైన ప్రవర్తనను కనబరుస్తుంటారు. కొంత ఉద్రేకం తర్వాత నార్మల్ అయిపోతారు.

చికిత్స : హోమియో వైద్యవిధానంలో నేట్రమ్‌మూర్, ఆరమ్ మెట్, సెపియా, ఆర్సెనిక్ ఆల్బ్, సిమిసిఫ్యూగో వంటి మందులు డిప్రెషన్ తగ్గించడానికి బాగా పనిచేస్తాయి.



డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

సైనసైటిస్‌కు చికిత్స ఉందా?

నా వయసు 33 ఏళ్లు. చాలాకాలంగా సైనసైటిస్‌తో బాధపడుతున్నాను. ఎన్నో మందులు వాడాను. కానీ సమస్య తగ్గడం లేదు. శాశ్వతంగా తగ్గేందుకు హోమియోలో చికిత్స ఉందా?

– ఆర్. శ్రీమన్నారాయణ, అనకాపల్లి

సైనస్ అంటే గాలి గది. మన ముఖంలోని ఎముకల మధ్యల్లో నాలుగు జతలుగా ఖాళీగా ఉండే గాలి గదులు ఉన్నాయి. సైనస్‌ల లోపలివైపున మ్యూకస్ మెంబ్రేన్ అనే లైనింగ్‌పొర ఉంటుంది. సైనస్‌లు అన్నీ ఆస్టియం అనే రంధ్రం ద్వారా ముక్కులోకి తెరచుకుంటాయి. మనం పీల్చుకునే గాలి ఉష్ణోగ్రతను మన శరీర ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉండేలా చేయడానికి సైనస్‌లు ఉపయోగపడతాయి. సైనస్‌లలోకి అంటే... ఖాళీ గదుల్లో ఇన్ఫెక్షన్ వస్తే అది సైనసైటిస్‌కు దారితీస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ ఫ్యారింగ్స్ లేదా టాన్సిల్స్‌కు వ్యాపిస్తే ఫారింజైటిస్, టాన్సిలైటిస్‌కు దారితీయవచ్చు. ఒకవేళ చెవికి చేరితే ఒటైటిస్ మీడియా అనే చెవి ఇన్ఫెక్షన్ వస్తుంది.

లక్షణాలు : సైనసైటిస్ వచ్చిన వారికి ● తరచూ జలుబుగా ఉండటం ● ముక్కుద్వారా గాలిపీల్చుకోవడం కష్టం కావడం ● ముక్కు, గొంతులో కఫం లేదా చీముతో కూడిన కఫం చేరడం ● కొందరిలో ఈ కఫం చెడువాసన రావడం ● నుదుటి పైభాగంలో లేదా కళ్లకింద, కనుబొమల మధ్య నొప్పి రావడం ● తల ముందుకు వంచినప్పుడు లేదా దగ్గినప్పుడు తలనొప్పి ఎక్కువ రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి వచ్చినప్పుడు సైనస్‌ల నుంచి ఇతర భాగాలకు అంటే... గొంతు, శ్వాసనాళాలకు ఇన్ఫెక్షన్ వ్యాపించవచ్చు.

పరీక్షలు : ఎక్స్-రే, సీటీస్కాన్ వంటి పరీక్షల ద్వారా సైనసైటిస్‌ను నిర్ధారణ చేస్తారు.



చికిత్స : సైనస్ వ్యాధిని సరైన సమయంలో గుర్తిస్తే ఎలాంటి ఆపరేషన్ లేకుండానే హోమియో మందుల ద్వారా సమర్థంగా నివారించవచ్చు. హోమియో ప్రక్రియలో రోగి వ్యక్తిగత ఆహార అలవాట్లు, ఆలోచనా విధానం, నడవడిక, వ్యాధి లక్షణాలు... ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మందులు సూచిస్తారు. ఈ వ్యాధికి వాడే కొన్ని ముఖ్యమైన మందులివి...

హెపార్ సల్ఫ్యూరికమ్ : అతికోపం, చికాకు ఉండేవారిలో, చల్లగాలికి తిరిగే సైనస్ లక్షణాలు ఎక్కువయ్యే వారికి ఇది మంచి మందు. ● **మెర్క్‌సాల్ :** రక్తహీనత ఉండి, అతినీరసం, అల్సర్లు త్వరగా మానకపోవడం, నోటిపూత, నోరు తడిగా ఉన్నప్పటికీ దాహంగా అనిపించడం వంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు మేలు. ఈ మందులేగాక... మరిన్ని రకాల మందులను వ్యక్తుల శారీరక, మానసిక లక్షణాల ఆధారంగా ఇస్తారు. ఇందులో ఫాస్ఫరస్, ఆర్సెనికమ్ ఆల్బ్, కాలీకార్బ్, సైలీషియా, రస్టక్స్ మొదలైనవి ఉన్నాయి. అయితే నిపుణులైన హోమియో వైద్యుల ఆధ్వర్యంలో మందులు తీసుకోవాలి. వాళ్లు రోగిని చూసి తగిన మందును, మోతాదును నిర్ణయిస్తారు.



డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి,
హైదరాబాద్



రిపబ్లిక్ డే స్పెషల్ క్విజ్



1 'ఈ జెండా పసిబోసి చిరునవ్వురా, దాస్య సంకెళ్లు తెంచిందిరా..' అనే పాట మహేశ్‌బాబు నటించిన ఓ చిత్రంలోనిది. ఈ పాటలో ఓ పసి బాబు చేతిలో నుండి జాతీయ జెండా ఓ కొండపై నుండి కింద పడుతుంది. ఆ జెండా కింద పడకుండా హీరో పట్టుకునే ఈ సీన్ ఏ సినిమాలోనిది?
ఎ) బాబీ బి) అతడు
సి) ఖలేజా డి) ఒక్కడు

2 అక్కినేని, సావిత్రి జంటగా నటించిన చిత్రం 'వెలుగు నీడలు'. ఈ చిత్రంలోని 'పాడవోయి భారతీయుడా' పాట రచయితెవరో కనుక్కోండి?
ఎ) కొసరాజు బి) ఆత్రేయ
సి) శ్రీశ్రీ డి) సినారె



3 'తెలుగు వీర లేవరా, దీక్ష బూని సాగరా...' అనే పాటలో నటించిన నటుడెవరో తెలుసా?
ఎ) శోభన్‌బాబు బి) యన్టీఆర్ సి) అక్కినేని డి) కృష్ణ

4 'జననీ జన్మ భూమిశ్చ, స్వర్గాదపీ గరీయసీ...' అనే పాట రచించింది, దర్శకత్వం వహించింది ఒక్కరే. ఎవరా దర్శకుడు?
ఎ) ముత్యాల సుబ్బయ్య
బి) దాసరి నారాయణరావు
సి) రవిరాజా పినిశెట్టి
డి) కోడి రామకృష్ణ

5 'దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే...' అనే పాటలో నటించిన నటుడెవరో తెలుసా? (చిన్న క్లూ: ఈ చిత్రానికి తేజ దర్శకుడు)
ఎ) ఉదయ్‌కిరణ్ బి) నవదీప్
సి) ప్రిన్స్ డి) దిలీప్ రెడ్డి

6 'కొంతమంది సొంత పేరు కాదుర గాంధీ, ఊరుకొక్క వీధి పేరు కాదురా గాంధీ...' పాట శ్రీకాంత్ నటించిన 100వ చిత్రం 'మహాత్మ' లోనిది. కృష్ణవంశీ దర్శకత్వం వహించారు. ఈ దేశభక్తి గీతం సూపర్‌హిట్. ఈ పాటలో నటించిన క్యారెక్టర్ నటుని పేరేంటి ?
ఎ) రామ్‌జగన్ బి) తనికెళ్ల భరణి
సి) పరుచూరి గోపాలకృష్ణ
డి) అజయ్ ఘోష్



7 'మేజర్ చంద్రకాంత్' చిత్రంలోని 'పుణ్యభూమి నా దేశం నమో నమామి... జన్మ భూమి నాదేశం సదా స్మరామి...' అనే పాటలో యన్టీఆర్ నటించారు. ఆ పాటను రచించింది జాలాది. సంగీత దర్శకుడెవరో తెలుసా?
ఎ) మణిశర్మ
బి) యంయం కీరవాణి
సి) రాజ్–కోటి డి) చక్రవర్తి

8 'వినరా వినరా దేశం మన దేరా, అనరా అనరా రేపిక మనదేరా' పాట ఏ చిత్రంలోనిది? (మణిరత్నం దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు).
ఎ) బొంబాయి బి) రోజా
సి) దిల్‌సే డి) దళపతి

9 'వందేమాతరం' చిత్రంలోని 'వందేమాతరం, వందేమాతరం... వందేమాతర గీతం వరస మారుతున్నది... తరం మారుతున్నది, ఆ స్వరం మారుతున్నది..' అనే పాటతో శ్రీనివాస్ ఇంటి పేరు 'వందేమాతరం' అయింది. ఈ పాటలో నటించింది హీరో రాజశేఖర్, హీరోయిన్‌గా నటించింది ఎవరో తెలుసా?
ఎ) విజయశాంతి బి) భానుప్రియ
సి) సుమలత డి) జీవిత

10 'భారత మాతకు జేజేలు... బంగరు భూమికి జేజేలు' పాట యన్టీఆర్ నటించిన 'బడిపంతులు' చిత్రంలోనిది. పీసీ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో యన్టీఆర్ మనవరాలిగా నటించిన బాల నటి ఎవరో కనుక్కోండి? (తర్వాత కాలంలో ఆమె యన్టీఆర్ సరసన హీరోయిన్‌గా నటించారు)
ఎ) విజయనిర్మల బి) జయసుధ
సి) శ్రీదేవి డి) జయంతి

11 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా... పొగడరా నీ తల్లి భూమి భారతిని.. నిలపరా నీ జాతి నిండు గౌరవమూ...' పాట 'అమెరికా అబ్బాయి' సినిమాలోనిది. అమెరికాలో షూటింగ్ చేసుకున్న ఈ క్రాస్ ఓవర్ సినిమాకు దర్శకుడెవరు?
ఎ) బాలచందర్ బి) కె. విశ్వనాథ్
సి) సింగీతం శ్రీనివాసరావు
డి) భారతీరాజ

12 'ఓ బాపు నువ్వే రావాలి, నీ సాయం మళ్లీ కావాలి...' అనే పాట చిరంజీవి నటించిన 'శంకర్‌దాదా జిందాబాద్' చిత్రంలోనిది. ఈ దేశ భక్తి గీతాన్ని సుద్దాల అశోక్‌తేజ రచించగా దేవీశ్రీ ప్రసాద్ స్వరపరిచారు. ఈ చిత్రానికి దర్శకుడెవరు?
ఎ) బి. గోపాల్ బి) ప్రభుదేవా
సి) జయంత్.సి. పరాన్జీ
డి) వీవీ వినాయక్

13 1982లో విడుదలైన 'గాంధీ' చిత్రానికి రిచర్డ్ అటెన్‌బరో స్వీయదర్శకత్వం వహించారు. బెన్ కింగ్‌స్లే 'గాంధీ' పాత్రధారి. బ్రిటిష్ ఇండియన్ ఫిల్మ్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో కస్తూర్బా గాంధీ పాత్రలో నటించిన ప్రముఖ బాలీవుడ్ నటి ఎవరో కనుక్కోండి?
ఎ) జయాబచ్చన్ బి) రేఖ
సి) రోహిణి హట్టంగడి
డి) హేమమాలిని

14 ఆంగ్లేయుల వద్ద సిపాయిగా పనిచేసిన 'మంగల్ పాండే' పాత్రలో నటించారు ఆమిర్‌ఖాన్. ఆ చిత్రంలో ఆయన సరసన హీరా పాత్రలో నటించిన నటి ఎవరో తెలుసుకుందామా?
ఎ) రాణీ ముఖర్జీ బి) కరిష్మా కపూర్
సి) కరీనా కపూర్ డి) అమీషా పటేల్







16 'ఏ మేరా ఇండియా, ఐ లవ్ మై ఇండియా...' పాట సుభాష్ ఘాయ్ దర్శకత్వం వహించిన 'పరదేశ్' చిత్రంలోనిది. ఆ చిత్రంలో షారుఖ్ ఖాన్ సరసన నటించిన నటి ఎవరు?
ఎ) మహిమా చౌదరి బి) ప్రీతి జింటా
సి) కాజోల్
డి) కత్రినాకైఫ్

15 'మేమే ఇండియన్స్ మేమే ఇండియన్స్...' పాట 'ఖడ్గం' చిత్రంలోనిది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ముస్లిం పాత్రలో నటించి, మెప్పించిన నటుడెవరు?
ఎ) శ్రీకాంత్ బి) రవితేజ
సి) ప్రకాశ్‌రాజ్ డి) బ్రహ్మాజీ

18 శంకర్ దర్శకత్వం వహించిన 'భారతీయుడు' చిత్రంలో స్వాతంత్ర్య సమర యోధుడు సేనాపతి పాత్రలో నటించారు కమల్‌హాసన్. మళ్లీ సేమ్ కాంబినేషన్‌లో 'భారతీయుడు-2' తెరకెక్కుతోంది. ఎన్ని సంవత్సరాల తర్వాత ఈ సీక్వెల్ ప్రారంభించారో కనుక్కోండి?
ఎ) 22 బి) 18 సి) 20 డి) 25

19 తెల్లదొరలపై తిరగబడ్డ తెలుగు బిడ్డ 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు. ఆయన చరిత్రను సినిమాగా రూపుదిద్దిన నటుడెవరో తెలుసా? (అతనే నిర్మాత, దర్శకుడు, నటుడు)
ఎ) చంద్రమోహన్ బి) విజయ్ చందర్
సి) మురళీమోహన్ డి) నరేశ్

20 చిరంజీవి నటిస్తున్న చిత్రం 'సైరా'. ఆంగ్లేయులను ఎదిరించిన తెలుగువాడు 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' జీవిత చరిత్ర ఇది. ఈ చిత్రంలోని 'మైరారెడ్డి' పాత్రను పోషిస్తున్న నటుడెవరో తెలుసా?
ఎ) జగపతిబాబు బి) సుదీప్
సి) అమితాబ్ డి) విజయ్ సేతుపతి

17 సంజయ్‌దత్, అజయ్ దేవ్‌గన్, సైఫ్ అలీఖాన్, అర్మాన్ కోహ్లి, సునీల్ శెట్టి, సంజయ్ కపూర్, అభిషేక్ బచ్చన్, అక్షయ్‌ఖన్నా.. ఇంతమంది బాలీవుడ్ హీరోలు నటించిన చిత్రం 'ఎల్‌ఓసి కార్గిల్'. వారితో పాటు ఆ చిత్రంలో నటించిన తెలుగు హీరో ఎవరో తెలుసా?
ఎ) ప్రభాస్ బి) నాగార్జున
సి) రానా డి) వెంకటేశ్

నిర్వహణ: శివ మల్లాల

సమాధానాలు
1) (ఎ) 2) (సి) 3) (డి) 4) (బి) 5) (బి) 6) (ఎ) 7) (బి) 8) (బి)
9) (ఎ) 10) (సి) 11) (సి) 12) (బి) 13) (సి) 14) (ఎ)
15) (సి) 16) (ఎ) 17) (బి) 18) (ఎ) 19) (బి) 20) (ఎ)

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!


ప్రియా ప్రకాశ్, రోషన్, అల్లు అర్జున్, వినోద్ రెడ్డి, గురురాజ్

సపోర్ట్ చేయడం నా బాధ్యత అనుకున్నా

– అల్లు అర్జున్

''సౌత్ ఇండియన్ సినిమాల్లో నేషనల్ వైడ్‌గా, ఇంటర్నేషనల్ వైడ్‌గా వైరల్ అయిన వీడియోస్‌లో 'కొలవెరి డీ..' పాట, 'వై కట్టప్ప కిల్డ్ బాహుబలి'... ఈ మధ్య కాలంలో ఆ రేంజ్‌లో వైరల్ అయిన వీడియోస్‌లో 'ఒరు ఆధార్ లవ్' కూడా ఒకటి'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. ప్రియా ప్రకాష్ వారియర్, నూరిన్ షరీఫ్, రోషన్ ముఖ్య తారలుగా ఒమర్ లులు దర్శకత్వంలో తెరకెక్కిన మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్'. ఈ చిత్రాన్ని 'లవర్స్ డే' పేరుతో సుఖీభవ సినిమాస్ పతాకంపై ఎ. గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. షాన్ రెహమాన్ స్వరపరచిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో అల్లు అర్జున్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''నాకు సౌతిండియా అంటే పిచ్చి. నా ప్రొఫెషన్‌లో సౌతిండియన్ యాక్టర్ అని రాసుకుంటాను. నేను దక్షిణాదికి చెందినవాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను. నేను పుట్టింది చెన్నైలో.. పెరిగింది హైదరాబాద్‌లో.. మలయాళం, కర్ణాటకవాళ్లు కూడా నన్ను ఆదరిస్తున్నారు. కాబట్టి నేను సౌతిండియన్‌నే. నా సినిమాలను కేరళవాళ్లు సొంత సినిమాల్లాగా ఆదరిస్తున్నారు. ఓ ల్యాండ్ మార్క్ ఉన్న మలయాళ సినిమా తెలుగులోకి వస్తున్నప్పుడు నేను సపోర్ట్ చేయాలని భావించా. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సమయంలో వినోద్ రెడ్డిగారిని 'బన్నీ'వాసు పరిచయం చేశాడు. ఆయన అడగ్గానే నేను ఈ ఫంక్షన్‌కి వచ్చా. నేను ఎంత కాలం నిలబడగలనో తెలియదు కానీ.. అవకాశం ఉన్న ప్రతిసారీ నా కోసం నిలబడ్డ ప్రతి ఒక్కరి కోసం నిలబడతా'' అన్నారు. ''మలయాళంలో ఎంత మంది స్టార్స్ ఉన్నా మా సినిమా వీడియోను ఎవరూ షేర్ చేయలేదు. అల్లు అర్జున్ గారు మాత్రమే షేర్ చేశారు'' అన్నారు ఒమర్ లులు. ''అల్లు అర్జున్‌గారంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి స్టేజ్‌పై నిలబడే అవకాశం వస్తుందనుకోలేదు. ఆయన్ను కలుసుకున్నందుకు వెరీ హ్యాపీ'' అని ప్రియా ప్రకాష్ వారియర్ అన్నారు. ''మా యూనిట్‌ని సపోర్ట్ చేయడానికి వచ్చిన అల్లు అర్జున్‌గారికి థ్యాంక్స్'' అన్నారు చిత్రసమర్పకుడు వినోద్ రెడ్డి. ''సీతారామరాజుగారు, సురేశ్‌గారి సపోర్ట్‌తో 'లవర్స్ డే' సినిమా అవకాశం దక్కించుకున్నాను. అల్లు అర్జున్‌తో పాటు చాలా మంది నన్ను సపోర్ట్ చేయడానికి వచ్చారు. ఇందుకు వారికి థ్యాంక్స్'' అని ఎ.గురురాజ్ అన్నారు. నటుడు అలీ, నిర్మాత అశోక్‌రెడ్డి గుమ్మకొండ, పాటల రచయిత చైతన్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగీలా రమ్మంది

దక్షిణాది చిత్రాలపై హాట్‌స్టార్ సన్నీ లియోన్ ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆల్రెడీ ఆమె కొన్ని దక్షిణాది చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. గతేడాది హీరోయిన్‌గా తమిళంలో 'వీరమాదేవి' (తెలుగులో 'వీరమహాదేవి') అనే సినిమాకు సైన్ చేశారు సన్నీ. ఈ సినిమా తెలుగు, మలయాళంలో కూడా రిలీజ్ కానుంది. ఇప్పుడు 'రంగీలా' అనే చిత్రం సన్నీని కేరళకు రమ్మంది. 'వీరమాదేవి' అనువాద చిత్రం కాబట్టి 'రంగీలా' ఆమెకు మలయాళంలో డైరెక్ట్ చిత్రం అవుతుంది. ఈ సినిమా గురించి ఇప్పుడు సన్నీనే అధికారికంగా ప్రకటించారు. ''మలయాళ చిత్ర పరిశ్రమలో 'రంగీలా' అనే మూవీతో కథానాయికగా ఎంట్రీ ఇవ్వబోతున్నానని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే నెల నుంచి ప్రారంభం అవుతుంది. సంతోష్ నాయర్ దర్శకత్వం వహిస్తారు. జయలాల్ మీనన్ నిర్మిస్తారు'' అని సన్నీలియోన్ పేర్కొన్నారు. మలయాళంలో మమ్ముట్టి హీరోగా రూపొందుతున్న 'మధుర రాజా' చిత్రంలోనూ సన్నీ ఓ ప్రత్యేక పాట చేయనున్నారు.


సన్నీలియోన్

ఆడపిల్లల స్థాయి పెంచాలి


రోహా, ప్రసాద రెడ్డి

నేటి సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, భ్రూణ హత్యల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఆ నిమిషం'. ప్రసాద రెడ్డి, రాజశ్రీ, రేఖ, నాగబాబు, శ్రీదేవి, శరభరావు, బేబీ రోహా, బేబీ నన్ను ముఖ్య తారలుగా కర్ణ రాజేష్ దర్శకత్వంలో వెంకటేశ్వర డిజిటల్ మూవీస్ బ్యానర్‌పై బంధారు హరితేజ నిర్మించారు. గురువారం నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులతో 'మన సమాజంలో ఆడ పిల్లల స్థాయి పెంచాలి' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు టీమ్. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ విలువైన అభిప్రాయాలు వెల్లడించారు. ఆడపిల్లలకు సమాజంలో సమున్నత స్థాయిని కల్పించాలని వాళ్లను గౌరవించాలి, ప్రోత్సహించాలి అని విద్యార్థులు ఏకకంఠంతో కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపింది చిత్రబృందం. ''ప్రతి ఒక్కరూ దేవుడిచ్చిన ఆడపిల్లలను స్వాగతించాలి. అపురూపంగా పెంచాలి. సుస్థిరమైన జీవితం అందించాలి. ఇందుకు మగవారు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ఈ సందేశాన్ని మా సినిమాలో చూపించాం'' అని కర్ణ రాజేష్ అన్నారు. ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేయాలనుకుంటున్నారు.